సంపుటి : 74 సంచిక : 07 పుటలు : 52

# జాగృతి

కలి 5123 - శ్రీ ప్లవ మార్గశిర శుద్ధ దశమి
13-19 డిసెంబర్ 2021
వెల : ₹15/-



## మరణం.. చివరి చరణం!

జగమంత కుటుంబం నాది అని ఎంతో ఆత్మవిశ్వాసంతో
ప్రపంచాన్ని తన బాహువుల్లోకి వెచ్చగా పొదువుకున్న కవి..
వెంటనే ఏకాకి జీవితం నాది అని తనని తాను
అందనంతదూరంగా విసిరేసుకోవడం ప్రతి తెలుగిళ్ల వెలితి.

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

74 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.200/-




వెల : ₹.300/-



వెల : ₹.200/-



వెల : ₹.300/-



వెల : ₹.390/-




వెల : ₹.299/-



వెల : ₹.100/-



వెల : ₹.90/-



వెల : ₹.250/-




వెల : ₹.250/-




వెల : ₹.595/-




వెల : ₹.799/-




వెల : ₹.395/-




వెల : ₹. 399/-




వెల : ₹.449/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ – 2. దూరవాణి : 63035 41244

# స్మరించుకుందాం! అధ్యయనం చేద్దాం!



మొహెంజదారో, హరప్పా.. ఆ పేర్లు వినగానే ఆర్యావర్తం సాక్షిగా పరిఢవిల్లిన మహా నాగరికత గుర్తుకు వస్తుంది. మట్టిదిబ్బల కింద ఉండిపోయిన ఆ నాగరికత అవశేషాలను 1920లో మొదటిసారి కనుగొన్నారు. 1934వరకు తవ్వకాలు జరిగాయి. నిజానికి ఈ పని ఇక్కడితో అయిపోలేదు. 1946 ప్రాంతంలోను వీలర్ అనే పురావస్తు నిపుణిడి నాయకత్వంలో జరిగాయి. దేశ విభజన తరువాత కూడా పాకిస్తాన్ అక్కడి భూభాగంలో తవ్వకాలు జరిపింది. భౌగోళికంగానే కాదు, నాగరికత పరంగానే ఈ దేశం ముక్కలయింది. అక్కడ  అమెరికా, పాకిస్తాన్ నిపుణులు జరిగిన తవ్వకాలు సాగించారు. మొత్తంగా ఈ తవ్వకాలలో బయటపడిన చారిత్రక అవశేషాలు ప్రపంచానికి గొప్ప చారిత్రక దృశ్యాన్ని వర్తమానం ప్రపంచం ముందుకు తెచ్చాయి. సంవత్సరం క్రితమే ఈ తవ్వకాల శత వార్షికోత్సవాలను జరిపించారు. కరోనా పుణ్యమా అని ఇంత పెద్ద కార్యక్రమం కూడా చడీచప్పుడు లేకుండా జరిగిపోయింది. ఇండియా స్టడీ సెంటర్ ట్రస్ట్, డైరెక్టరేట్ ఆఫ్ ఆర్కియాలజీ అండ్ మ్యూజియమ్స్(మహారాష్ట్ర) ఆ కార్యక్రమం నిర్వహించాయి.

ఆ మహా నాగరికత గురించి ఒక్కసారి మననం చేసుకోవాలి. ఇది క్రీస్తుపూర్వం 2500 సంవత్సరం ప్రాంతంలో విలసిల్లిందని పురావస్తుశాస్త్రవేత్తల అభిప్రాయం. హరప్పా సంస్కృతినే సింధులోయ నాగరికత అని కూడా పిలుస్తారు. సింధునది ఒడ్డు, ఆ పరిసరాలలో ఈ నాగరికత విస్తరించింది. దక్షిణాసియాలోని పాకిస్తాన్ (ఇవాళ్టి), పశ్చిమ భారతదేశం, అఫ్ఘానిస్తాన్‌లోని కొన్ని భాగాల వరకు, దాదాపు ఎనిమిది లక్షల చదరపు కిలోమీటర్ల మేర ఈ నాగరికత ప్రభావం కనిపిస్తుంది. ఈజిప్ట్, మెసపుటోమియా, చైనా పురాతన నాగరికతలకు కూడా ఇది మాతృక అని చెబుతారు. 1920 సర్ జాన్ మార్షల్ అనే పురావస్తు నిపుణిడి నాయకత్వంలో ఆర్కిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా తవ్వకాలు ఆరంభించింది. అలా బయటపడినవే మొహెంజదారో, హరప్పా. ఈ రెండు నాటి సింధు లోయ నాగరికత కాలంలో ప్రముఖ ప్రదేశాలే. పట్టణ ప్రణాళిక రూపకల్పనకు నమూనాలుగా చెప్పదగినవని ప్రపంచ పురావస్తు శాస్త్రవేత్తల అభిప్రాయం. వాటితోపాటు కాలిబంగన్, లోథాల్‌లలో కూడా తవ్వకాలు జరిగాయి.

ప్రణాళికాబద్ధమైన ఇళ్లు, రోడ్ల నిర్మాణమే కాదు, మురుగు నీటి పారుదల వ్యవస్థ కూడా అక్కడ కనిపించి, పురావస్తు శాస్త్రవేత్తలను ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ చారిత్రక ఆధారాలను బట్టే, సింధులోయ నాగరికత కాలంలోనే ఇక్కడ ఇంజనీరింగ్ ప్రతిభ ఉందని నిర్ధారించారు. 1924లో అప్పటి ఆర్కిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జాన్ మార్షల్ ఈ నాగరికత గురించీ, తవ్వకాల గురించీ, ఇక్కడ వెలుగు చూసిన విశేషాల గురించీ మొదటిసారి ప్రపంచానికి వెల్లడించాడు. కళాత్మక దృష్టి, కల్పన ఇక్కడి నిర్మాణాల ప్రత్యేకత. అనేక శిల్పాలు, ముద్రికలు, మృణ్మయ పాత్రల అవశేషాలు, ఆభరణాల శకలాలు తవ్వకాలలో లభ్యమయినాయి. ఇది రవాణా అభివృద్ధితో జరిగిన నాగరికతగా భావించారు. ఈ ప్రాంతంతో మెసపుటోమియాకు వాణిజ్య సంబంధాలు ఉండేవి. ఇక్కడ దొరికిన ముద్రికలు, నగల తరహాలోనే అక్కడి తవ్వకాలలో కూడా బయటపడినాయి. ఈ తవ్వకాలలో బయటపడిన ఇటుకలు సైతం ప్రత్యేకమైనవి. వాటి పరిమాణాలు వేరు. 20 అడుగుల ఎత్తయిన మట్టి ఇటుకల వేదికను కూడా కనుగొన్నారు. దీని చుట్టూ గోడ ఆనవాళ్లు ఉన్నాయి. పంట దాచుకునే ప్రత్యేక గాదెల తరహా కట్టడాలను కూడా కనుగొన్నారు.

ఈ తవ్వకాలను గొప్ప అన్వేషణగా,ఎన్నో ప్రత్యేకతలు కలిగినవిగా చెబుతారు. ఎందుకంటే ఈ తవ్వకాలే భారత్ గత చరిత్ర సంస్కృతి ఎలాంటివో ఆధునిక ప్రపంచం ముందుకు తెచ్చాయి. చరిత్ర నమోదు చేసినది వాస్తవమని రుజువు చేశాయి. మన చరిత్ర, సంస్కృతి గురించి అధ్యయనం చేయాలన్న తృష్ణ ప్రపంచ పండితులలో రేకెత్తింది. ఈ నాగరికత క్రీస్తుపూర్వం 1800 సంవత్సరంలో అంతరించిందని నమ్ముతున్నారు. ఇందుకు స్పష్టమైన కారణాలు తెలియదు. వరదలే కారణమని ఒక వాదన. దండయాత్రలని మరొక వాదన. ★



Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, 1-1-60/5, Musheerabad, RTC 'X' Road, Hyderabad-500 020. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥ 11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

బి. నాగరాజు సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా – సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥ 11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | 9959310103 |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్లు : సిహెచ్. కుమార్, జి. తుకారాం

'ఇంకెక్కడి యూపీఏ? ఇప్పుడెక్కడుంది?' మమతా బెనర్జీ ఈ డిసెంబర్ ఆరంభంలో ఇలా కుండబద్దలు కొట్టారు. దాదాపు పదిహేడేళ్లు సాగిన ఒక రాజకీయ ప్రహసనానికి ఎప్పుడో తెర పడిన సంగతిని టీఎంసీ నాయకురాలు ఇలా వీలు చూసుకుని, తాపీగానే అయినా జాతి ఎదుట ప్రకటించారు. ఆమె ముంబైలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శరద్ పవార్‌తో మంతనాలు జరిపి ఆపై ఈ ప్రకటన చేయడమూ ఒక తమాషాయే. ఎందుకంటే పవార్ ప్రస్తుతం మహారాష్ట్రలో అధికార శివసేన పార్టీని మోస్తున్నది కాంగ్రెస్ పార్టీతో కలసే. అప్రియసత్యాలని అంగీకరించడానికి మనసొప్పదు. ఇక కాంగ్రెస్ వంటి నిష్క్రియాపరుల శిబిరం అసలే ఒప్పుకోదు.

మెరుపు లేని పిడుగులా ఢిల్లీ రాజకీయాల మీద పడిందే యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ (యూపీఏ). 2004లో అత్యధిక స్థానాలు గెలుచుకున్నప్పటికీ, ప్రభుత్వ స్థాపనకు అవసరమైనన్ని స్థానాలను బీజేపీ సాధించలేకపోయింది. అప్పుడే వామపక్షాల చొరవతో యూపీఏ హఠాత్తుగా పుట్టుకొచ్చింది. 145 స్థానాలు ఉన్న కాంగ్రెస్‌కు కిరీటం పెట్టారు. 2009లో కూడా అధికారంలోకి వచ్చి రెండు పర్యాయాలు ఏలింది. ఆనాడు యూపీఏలో ఉన్న పార్టీలు ఇవాళ లేవు. ఇవాళ అంటకాగుతున్న పార్టీలు కొన్ని ఆనాడు యూపీఏని దూరంగా పెట్టినమాటా నిజం. బొంబాయి పేలుళ్లు, యూపీఏ-2 హయాంలో అక్రమాలు ఇప్పటికీ దేశం మరచిపోలేదు. నాడు తెర వెనక ఉన్న రాహుల్ గాంధీ ఇప్పుడు తెర వెనుక లేరు. అలా అని తెర ముందు ఉన్నారని కూడా అనుకోనవసరం లేదు. అదీ పరిస్థితి. ప్రధానమంత్రి ప్రాముఖ్యాన్ని పాతాళానికి విసిరేయడం యూపీఏ సాధించిన ఘనకార్యాలలో మొదటిది. ఈ దేశం చచ్చినట్టు కాంగ్రెస్‌ను అధికారంలోకి పంపవలసిందేనన్న ధోరణి 1952 నుంచి వస్తున్నదే. 31 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 6 చోట్లే యూపీఏ రాజ్యమేలుతోంది. కొడిగట్టిన యూపీఏ దీపం కొండెక్కుతోందనే మమత ప్రకటించారు. కాంగ్రెస్ మీద కూడా అలాంటి ప్రకటన రావడమనే లాంఛనం మిగిలి ఉంది. అది వేరే విషయం.

**శాలివాహన 1943 శ్రీ ప్లవ మార్గశిర శుద్ధ దశమి**

### లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం
**మరణం.. చివరి చరణం !**
6లో

ముఖాముఖి
**ఒక పాటని పది పదిహేనుసార్లు తిరగరాసేవాడు!**
12లో





23
నేతాజీ – ధారావాహిక
**తెలియనిచోటికి సాహసయాత్ర**
– ఎం.వి.ఆర్. శాస్త్రి
20లో

# జాగృతి

## సంపాదకీయం

ప్రాంతీయ పార్టీలు ఏకమైతే జాతీయ పార్టీ బీజేపీని అధికారంలో నుంచి అలవోకగా దింపవచ్చునని టీఎంసీ నాయకురాలు మమతా బెనర్జీకి దివ్యమైన ఆలోచన వచ్చింది.‘బీజేపీని తొలగిద్దాం, దేశాన్ని రక్షిద్దాం’ అన్న నినాదంతో ఆమె పూనకం వచ్చినట్టు ఊగిపోతున్నారు. దేశం నిండా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రాంతీయ సేనలకి తానే సేనాపతి అయి మేరునగంలా ఉన్న కమలాన్ని కూల్చాలని ఆమె చిరుకోరిక. ఇందులో ప్రజాస్వామ్యయుతమైన చింతన లేదు. ప్రజాభిప్రాయం కోణం అసలే లేదు. ప్రజాస్వామ్యం పట్ల అసలు ఆమెకు ఉన్న గౌరవం ఏపాటిది? తన రాష్ట్రంలో సవాలు విసురుతున్న బీజేపీని బలహీనపరచడానికి ఆమె పన్నుతున్న పథకం– దేశం మొత్తం మీద ఆ పార్టీని ప్రాంతీయ పార్టీల అండతో బలహీన

## మరో రాజకీయ వంచనకు సిద్ధం

పరచడమే. ఇక్కడ వచ్చే ధర్మసందేహం ఎవరు తీరుస్తారన్నదే ఇప్పుడు ఇంకా పెద్ద సందేహం.

తీసుకున్న నినాదమేమో, బీజేపీని నిరోధించడం. అది మేం లేకుండానే అయిపోతుందా అని నిలదీస్తోంది శతాధిక వర్షాల కాంగ్రెస్. అసలు మమతా బెనర్జీకి కాంగ్రెస్‌ను చిత్తు చేయాలన్న కుట్ర బుద్ధి ముందునుంచి ఉన్నదేనని అంటున్నారు లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌధురి. బెంగాల్‌లో ఆమె గెలుపు బండారం ఇప్పుడిప్పుడే బయటపడడం లేదా! అంటూ ఒక దేవరహస్యం ఆచూకీ ఇచ్చారు కూడా. యూపీఏ ప్రభుత్వంలో ఆరు మంత్రి పదవులు అనుభవించి కూడా ఇప్పుడు ఇలా తమకి మొండిచేయి చూపిస్తుంటే రంజన్‌దాకు దుఃఖం ఆగడం లేదు. కాంగ్రెస్ లేకుండా బీజేపీని ఓడించడం మమత తరం కాదని శివసేన ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే కూడా కొత్త మిత్రుడి పట్ల విధేయత చాటారు. కాంగ్రెస్ లేని విపక్ష కూటమి ఆత్మలేని దేహం అంటూ తాత్వికతను చాటారు కపిల్ సిబల్. కానీ, ఎక్కడైనా బావగాని, వంగదేశపు ఎన్నికల వంగతోట కాడ మాత్రం కాదు అన్నట్టే ఉంటుంది మమత వ్యవహారం. ఎన్నికల వేళ బీజేపీనీ, కాంగ్రెస్‌నీ, పనిలో పనిగా కమ్యూనిస్టులనీ కూడా సమానమైన శత్రువుల్లా చూడడం ఆమె అలవాటు. కానీ ఇటీవలి వరకు కూడా మమత ఢిల్లీ వస్తే సోనియా దర్శనం చేసుకోకుండా వెళ్లేవారే కాదు. అయినా అదేమిటో, మమతతో పాటు, చాలా ప్రాంతీయ పార్టీలకి కాంగ్రెస్ వరకు ఢిల్లీలో వియ్యం, స్వరాష్ట్రాలలో కయ్యం అన్న విధానమే మహా ఇష్టం. మా బెంగాల్‌లో కాంగ్రెస్ పోటీ చేయవచ్చు కాని, నేను గోవాలో పోటీ చేయకూడదా? అని అద్భుతమైన తర్కాన్ని ముందుకు తెస్తున్నారు మమత. మరోపక్క, గోవాలో మా అవకాశాలు తగ్గించడం మమతా దీదీకి భావ్యం కాదు అన్నట్టు దీనవదనులై మాట్లాడుతున్నారు ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్. యూపీఏ మరణించినట్టే అంటూ ముంబైలో మమత ప్రకటించిన తరువాత, కేజ్రీవాల్ ఒక టీవీ చానల్‌లో మాట్లాడుతూ, మమతా బెనర్జీకి గోవాలో ఓట్లేమీ రాలవు అని జోస్యం చెప్పారు. ఇది ప్రాంతీయ పార్టీల కొత్త జాతీయ ప్రత్యామ్నాయం ఏర్పాటు తీరు.

నేషనల్ ఫ్రంట్, యూపీఏ దేశాన్ని ఒక దారుణమైన సామాజిక, రాజకీయ సంక్షోభంలోకి నెట్టి చేతులు దులుపుకుని పోయాయి. ఇప్పుడు మళ్లీ అలాంటి ప్రయత్నం మమత అనే స్థానిక నియంత ఆధ్వర్యంలో ఆరంభమవుతున్నాయి. బీజేడీ వంటి ఒకటి రెండు ప్రాంతీయ పార్టీలు తప్ప అకాలీదళ్, ద్రవిడ పార్టీలు, టీఎంసీ, శివసేన, ఆప్, టీఆర్ఎస్, టీడీపీ, ఎస్పీ, బీఎస్పీ, ఆర్జేడీ– ఏ ప్రాంతీయ దుకాణమైనా కావచ్చు, దారుణమైన గతాన్ని మూటగట్టుకున్నదే. ఫెడరల్ విధానానికీ, ప్రజాస్వామ్యానికి పూర్తి విరుద్ధంగా ప్రవర్తించినదే. ఇవి జాతీయ ప్రత్యామ్నాయాన్ని నిర్మిస్తామంటే నమ్మాలా? కాబట్టి మరోసారి దేశాన్ని దగా చేయడానికి మొదలైన యత్నాలపట్ల అప్రమత్తంగా ఉండాలి. ★

13 డిసెంబర్ 2021, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



ప్రత్యేక వ్యాసం

**సార్వజనీనం ‘గీతా’ మకరందం**

24లో



కథ

**ఈ రోజుల్లో**

– డా॥ శ్రీదేవి శ్రీకాంత్

32లో



ధారావాహిక నవల

**పూలగండువనం**

– డా. చింతకింది శ్రీనివాసరావు

8 26లో



జాతీయం–1

**వణికిస్తున్న ఒమిక్రాన్**

38లో


| | | |
|---|---|---|
| శాశ్వత జ్ఞాపకాలైన ఆ క్షణాలు (ముఖపత్ర కథనం) | – | 14 |
| ఓటీఎస్ పేరుతో బలవంతపు వసూళ్లు (ఆంధ్రప్రదేశ్) | – | 16 |
| మోక్షానికి మార్గం.. ధనుర్మాస వ్రతం.. (ఆధ్యాత్మికం) | – | 18 |
| విషం కక్కుతున్న కమేడియన్‌లు (జాతీయం) | – | 30 |
| కోరమీసాల మల్లన్నకు శతకోటి దండాలు (ప్రత్యేక వ్యాసం–1) | – | 35 |
| ‘మతోన్మాద భావాలకు వ్యతిరేకంగా పోరాడారు’ (అమృతోత్సవం) | – | 36 |
| తిట్ల రాజకీయం వెనుక కొత్త వ్యూహం? (తెలంగాణ) | – | 40 |
| పదవులకే వన్నె తెచ్చిన నేత (నివాళి) | – | 42 |
| ఆటలతో అందలం! (క్రీడ) | – | 43 |
| వార్తా విశేషాలు | – | 44 |
| బాలజాగృతి | – | 46 |
| వారఫలాలు | – | 48 |
| పదరసం | – | 49 |
| హై ఓల్టేజ్ యాక్షన్ డ్రామాగా ‘అఖండ’ (సినిమా) | – | 50 |




మార్చి 1, 2020న జరిగిన జాగృతి పురస్కారాల కార్యక్రమంలో సిరివెన్నెల, పక్క పేజీలో సిరివెన్నెలను సత్కరిస్తున్న జాగృతి ప్రకాశన్ ట్రస్టు అధ్యక్షుడు డా. సంజీవ

## నా ఉచ్ఛ్వాసం కవనం
## నా నిశ్వాసం గానం

'సిరివెన్నెల' సీతారామశాస్త్రి
20 మే, 1955 – 30 నవంబర్, 2021

**"కాలమనే హంతకి నాటి మధుర జీవనాన్ని దగ్ధం చేసింద"ని వాపోయారు సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులవారు. అలా వేయి దీపాల వెల్తురు ఒక్కసారి కొండెక్కిపోయినట్టు అంతులేని తిమిరం, అంచులేని శూన్యం ఒక్కసారిగా**

శాస్త్రిగారి పాటల్లో లైనుకో గీతోపదేశం వినిపిస్తుంది. వాక్యానికో ఉన్నతమైన భావం కనిపిస్తుంది. ప్రతి చరణంలో జీవితేచ్ఛ పరవళ్లు తొక్కుతూ తడిగా తాకుతూ వెళ్తుంది. కాగితం మీద అక్షరాల్లో పరుచుకునే జీవనసారం ప్రతి క్షణాన్ని ఆప్యాయంగా తడుముతుంది. మొత్తంగా బతుకు పొడవునా పచ్చని పండగ తోరణం కడుతుంది. ***"నింగి ఎంత పెద్దదైన రివ్వుమన్న గువ్వపిట్ట రెక్కముందు చిన్నదేనురా.."*** అన్న కవి వాక్యం వింటే, జీవితంలో సాధించలేనిది ఏదీ ఉండదన్న ఆశ వేలరెక్కలతో విచ్చుకుంటుంది. అమాంతం ఆకాశం అందినట్టు, ఇంద్రధనసు ఇంట్లోకి అతిథిలా వచ్చినట్టు అనిపిస్తుంది జీవితాన్ని పాజిటివిటీతో నింపేస్తుంది. బాధపడ్డానికీ బెంబేలెత్తిపోడానికీ జీవితంలో చోటు లేదని స్పష్టమవుతుంది.

పసిడిపతకాల హారం కాదురా విజయతీరం.. ఆటనే మాటకర్థం నిను నువ్వే గెలుచు యుద్ధం' అని ఓ పాటలో గెలుపు తాలూకు దృక్పథాన్నే మార్చేశారాయన. ఇలాంటివి ఆ వెన్నెల్లో కోకొల్లలు కలువలై కళ్లు తెరిచాయి. శాస్త్రిగారి పాట కేవలం పాట మాత్రమే కాదు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పాఠం. చురుక్కుమనే వాతలు, నిష్కర్షగా తోచే కోతలు, పారమార్థికమైన చేతలు, వైయక్తికమైన గీతలు, వివిధ ఆలోచనల కల నేతలు, అద్భుత ఆవిష్కరణల జ్యోతలతో సిరివెన్నెల పాట



**గోపరాజు రాధాకృష్ణ**
సీనియర్ జర్నలిస్ట్

# మరణం.. చివరి చరణం!

**ఆవహించాయి. తీక్షణమైన, తీవ్రమైన స్వరం నిశ్శబ్దం పరదాల వెనక అర్థాంతరంగా అంతర్థానమైపోయి ఎవరి పిలుపూ వినపడనంతగా అనంతదూరాలకి తరలి వెళ్లి భయపెడుతున్న మౌనం ఇప్పుడు ప్రతి తెలుగువారి అనుభవం. జగమంత కుటుంబం నాది అని ఎంతో ఆత్మవిశ్వాసంతో ప్రపంచాన్ని తన బాహువుల్లోకి వెచ్చగా పొదువుకున్న కవి.. వెంటనే ఏకాకి జీవితం నాది అని తనని తాను అందనంత దూరంగా విసిరేసుకోవడం ప్రతి తెలుగిళ్ల వెలితి. ఒక మహా అధ్యాయం ముగింపుని ముందుకు లాక్కొచ్చిన విషాదం ఇప్పుడు తెలుగు లోగిళ్లని బాధిస్తున్న దృశ్యం. అది సిరివెన్నెల నిష్క్రమణం.**



ధగద్ధగాయామానంగా మెరుస్తూ ఉంటుంది.

సిరివెన్నెల సినిమా కవే గాని, ఆయన సృజన సినిమా చెరసాల వదిలి నర్తనశాలై విజృంభిస్తుంది. సినిమా కొలమానాలు జారిపోయినా విడిగా ఆయన పాటకి అస్తిత్వం ఉంటుంది. సందర్భంతో సంబంధం లేకుండా ఆయన పాటకి సాహితీపరమైన ఔన్నత్యం దక్కుతుంది. సినిమా ఫార్ములా తాలూకు ఇరుకు సందుల్లోంచి తెలివిగా తప్పుకుని, స్క్రూలు బిగించిన పరిమితుల్లోంచి సమర్థంగా బయటపడి, పాలనవ్వుల పలకరింపులతో పాటని తీర్చిదిద్దడమే సిరివెన్నెల ప్రత్యేకత. ఆయన విజయసూత్రం. పెద్దవాళ్ల నుంచి కుర్రతరం వరకు ఆయన పాట బలీయంగా చేరుకోడానికి, ఇదే నేపథ్యం.

ఇదంతా కవిగా ఆయన నేర్పు. ఆయన పాటకి ఒక పార్శ్వం. ఇక రెండోది ఆయన మనందరికీ చెప్పిన వ్యాకరణం, తన పాటల్ని అర్థం చేసుకునే సంవిధానం - అంతర్దర్శనం. ఎవరినివాళ్లు ప్రశ్నించుకోవడం. భౌతికంగా కనిపించే అర్థాల దశ నుంచి గాఢంగా, గూఢంగా రగిలే ఆలోచనల అగ్గిరవ్వని గుర్తించమంటారాయన. బయట కాదు.. పైపైన కాదు అనేది ఆయన తపన.వేల పాటల్లో ఆయన అంతర్లీనంగా చెప్పిందీ.. ఆచరించమని అన్యాపదేశంగా ఆదేశించిందీ అదే. నిత్యజీవితం విసురుతున్న ఎన్నో సవాళ్లకి, సమాజంలోని విపరీత ధోరణుల తాలూకు దుర్మార్గాల నీడలకి, వ్యక్తిగతంగా పీడిస్తున్న ఎన్నో సమస్యల జాడలకి పరిష్కారం.. పిరికితనంతో వాటికి దూరంగా పారిపోవడం కాదనేది శాస్త్రిగారి అభిభాషణ. నిజంగా ఏదైనా ఒకటి సమస్య అని నువ్వు అనుకుంటే, కొంపలు అంటుకుపోయేలా ఉన్నాయి అని యథార్థంగా కష్టం వస్తే – దాన్ని ఎదుర్కునే శక్తి నీలోనే ఉంది అనేది ఆయన ఫిలాసఫీ. అసలు అది సమస్య అవునో కాదో ఒకసారి లెక్క చూసుకోమంటారాయన. ఒకవేళ నిజంగా సమస్యే అయితే, దాన్ని పోరాడ్డానికి పదును పెట్టాల్సిన ఆయుధాలు, దగ్గర ఉంచుకోవాల్సిన అస్త్ర శస్త్రాలు అన్నీ పాటల్లో అందించారా చింతనాశీలి.




## చిరునవ్వుతో మొదలు...

ఎక్కడి వరకూనో ఎందుకూ మనలో ప్రతి ఒక్కరూ నవ్వడమే మర్చిపోతున్నాం. పక్క మనిషిని చిర్నవ్వుతూ పలకరించడానికి కూడా టైమ్ లేనంతగా బిజీ అయిపోతున్నాం. అదొక్కటే ఎన్ని బంధాలను ముడివేస్తుందో.. ఎన్ని దూరాల్ని దగ్గర చేస్తుందో.. ఎంత కొత్తగా ఈ ప్రపంచాన్ని పరిచయం చేస్తుందో అర్థం చేసుకొమ్మని శాస్త్రిగారు చిలక్కి చెప్పినట్టు చెప్పారు ఓ పాటలో. నవ్వలేని మానసిక దౌర్బల్యానికి అక్షరాలతో మందు వేశారు. ***“పెదవి ప్రమిద నిలపనీ నవ్వు జ్యోతిని”*** అని పొయటిగ్గా పొందిగ్గా చెప్పారు. వెక్కిళ్లు పెట్టి ఏడుస్తుంటే కష్టం పోతుందా అని మౌలికమైన ప్రశ్నని సంధిస్తూ ఇలా హితం చెప్పారాయన ***“మనుషులనిపించే రుజువు..మమతలు పెంచే రుతువు.. మనసులను తెరిచే హితవు.. వందేళ్లయినా వాడని చిరునవ్వు.”***

యువతరం అంటే శాస్త్రిగారికి అవ్యాజమైన ప్రేమ. ఎక్కణ్ణించి ఎక్కడికో గంతులు వేసే ఆలోచనలు, స్థిరత్వంలేని లక్ష్యాలు, ఏదో చేసెయ్యాలనే తపన, ఏం చెయ్యాలో తోచని గుంజాటన, చిన్న సమస్యొస్తే నిజానిజాలు బేరీజు వేసుకోకుండా తొందరపాటు నిర్ణయాలు.. లాంటివన్నీ ఛానలైజ్ చేయగలిగితే రేపటి భారతం బాగుంటుంది అని శాస్త్రిగారి ఆలోచన. అందుకే ఐఐటి లాంటి విద్యాసంస్థల్లో ఇతరత్రా సందర్భాల్లో యువతని ఉద్దేశించి మాట్లాడాలంటే ఆయన చాలా ఆసక్తి


పద్మశ్రీ స్వీకరిస్తూ..


కె. విశ్వనాథ్‌తో..


సంఘ ప్రార్థనలో


కుటుంబానికి టీఎస్ గవర్నర్ తమిళిసై పరామర్శ

చూపించేవారు. వాళ్లతో ఎక్కువ సమయం గడిపేందుకు ఇష్టపడేవారు. వాళ్లడిగే ప్రతి ప్రశ్నకీ ఓపిగ్గా జవాబిచ్చేవారు. సినిమాల్లో ఆ వయసువాళ్లకి ఏదైనా చెప్పే అవసరం, అవకాశం వచ్చినప్పుడల్లా ఆ పాటని అద్భుతమైన వ్యక్తిత్వ వికాస గ్రంథంగా మార్చేసేవారు శాస్త్రిగారు. ఆ వయసులో అనాలోచిత ప్రతిజ్ఞలు, తీర్మానాల్లో దౌర్బల్యం, మినహాయింపులు, ఆరంభ శూరత్వాలు, తప్పటడుగులూ, తొట్రుబాట్లు అన్నిటినీ పరిష్కారాలున్నాయి ఆయన పాటల్లో. ఆయన అడిగే ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కోగలిగితే.. వాటిని ఆచరణలో పెట్టగలిగితే జీవితం పచ్చగా ఉంటుంది. ఏ నీడలూ జాడలూ దరికి కూడా చేరవు.

**ఉత్తేజం.. ఉద్వేగం...**

దేహముంది, ధైర్యముంది, నెత్తురుంది, సత్తువుంది. ఇంతకంటే సైన్యముండునా? ఆశ నీకు అస్త్రమౌను. శ్వాస నీకు శస్త్రమౌను. ఆశయమ్ము సారథౌనురా.. అని ఉత్తేజాన్ని ఉద్వేగాన్ని నింపిన పాట యువతకి ఒకపాఠ్యగ్రంథం. పోరాటానికి కావాల్సిన సమస్త సంబారాలూ నీలోనే ఉంటే చుట్టూ చూస్తావెందుకు అని ఆయన పాట విన్నాక, ఊపిరి నిండా అంతులేని ఆత్మవిశ్వాసమే ఉంటుంది. నడకలో ఎదురుదెబ్బ తగిలితే.. గమనం ఆగిపోకూడదని శాస్త్రిగారు అందించిన స్ఫూర్తి అదే పాటలో ఇలా ఉంటుంది.. ***"నొప్పిలేని నిమిష మేది జననమైన మరణమైన జీవితాన అడుగు అడుగునా. నీరసించి నిలిచిపోతే నిమిషమైన నీది కాదు.. బతుకు అంటే నిత్య ఘర్షణ."***

పిల్లాడు ఏదో పోటీ పరీక్ష రాశాడు. ఫలితం అనుకూలంగా లేదు. ఇంకొకడు ఒక మౌఖిక పరీక్షకి వెళ్లాడు. ఆ ప్రయత్నం అనుకూలించలేదు. ఎక్కువ మందికి వెంటనే స్ఫురించేది – ఈ బతుకెందుకని. ఒక్క నిమిషం ఆలోచించగలిగితే ఒక నిండు ప్రాణం నిలబడేదే అని అందరూ తలో సలహా పడేస్తారు గానీ అలాంటి సందర్భానికి శాస్త్రిగారు ఓ ఆంథమ్ లాంటి పాట రాశారు. ***"ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి.. ఎప్పుడూ వదులుకో వద్దురా ఓరిమి.."*** అని మొదలయ్యే ఈ పాట విని కొన్ని ఆత్మహత్యలు ఆగాయంటే ఆ పాటకి అంతకన్నా ఏం కావాలి? కుంగిపోతున్న వెన్నెముక తాలూకు ప్రాణనాడుల్లో ఉత్తేజాన్ని నింపే మహత్తర మానవీయ కోణం లాంటి ఈ పాట నిడివి మొత్తం ప్రత్యక్షరం గుండెని గుడిగోపురంలా చేసే మంత్రం. జ్ఞానజ్యోతిని దర్శించే వేదాంతహృదయ మందారం.

ఒకడు ప్రయాణం ప్రారంభించాడు. ***'నీ పయనం ఎక్కడికో నీకు తెలియాలిగా..'*** అని ఒక ప్రశ్న వేసి ఆ ప్రయాణానికి ఒక స్పష్టతనిస్తాడు కవి. అసలు నువ్వు ఎక్కడికి వెళ్లాలనుకుంటున్నావో నీకు తెలుసా అనే పదునైన ప్రశ్న గుండెలోకి ఎంతగా దిగితే.. అంత కరెక్ట్ ఆన్సర్ వస్తుంది. ఒకవేళ సమరానికి దిగితే ***"ఏ సమరం ఎవ్వరితో తేల్చుకోముందుగా"*** అని వేసిన క్వశ్చన్‌తో ఆయన కన్‌ఫ్యూజ్ చేయరు. క్లారిటీ ఇస్తారు. నువ్వు పోరాడాల్సింది బయటివాడితో కాదేమో.. నీతో నువ్వే పోరాడాలేమో చూసుకో అని ఒక సలహా ఇచ్చి సమరానికి ఓ దిశా నిర్దేశం చేస్తారు.

చిరంజీవైనా పుడుతూనే మెగాస్టారైపోలేదు. నటుడవ్వాలన్న సంకల్పానికి కఠోరశ్రమని జోడించి ఆ స్థాయికి చేరుకున్నాడు. ఈ కథనే ఓ పాటలో చెబుతూ.. ఒకవేళ నీకు అలాంటి ఆశయం ఏదైనా ఉంటే మంచిదే, దానికెంత కష్టపడాలో అక్షరాల్లోనే బొమ్మకడతారు శాస్త్రిగారు. ***'తెగించే సత్తా చూపందే సడెన్‌గా స్వర్గం రాదయ్యా'*** అని చెప్పాల్సిన విషయాన్ని విడమరుస్తారు. వాల్‌పోస్టర్ చూసి నేనూ అంతటివాణ్ణి అవ్వాలని నిలబడి కలలు కనడం వల్ల ఉపయోగం లేదని చెబుతారు.

ఎవరో ఒకరు ఎప్పుడో అపుడు నడవరా ముందుగా అటో ఇటో ఎటో వైపు... అనే ఓ పాట సంవిధానంలో మొదటి అడుగు విశిష్టతనీ తొలి అడుగు వేసే మనిషి మార్గదర్శకత్వాన్ని అలతి అలతి పదాలతో శాస్త్రిగారు చెప్పిన తీరు.. సినిమాలో సన్నివేశానికే కాదు..పాట విన్న ప్రతి ఒక్కరికీ ఆ స్ఫూర్తి వర్తిస్తుంది.

నీ ఇంట్రెస్ట్ ఏమిటో అటే వెళ్లు అని యువతరానికి మంచి మాటలు చెప్పే పాటని ***"బోడి చదువులు వేస్ట్ నీ బుర్రంతా భోం చేస్తూ.."*** అని మొదలుపెట్టి తను చెప్పాలనుకున్న విషయాన్ని మొహమాటం లేకుండా చెప్పడం ఆయనకే చెల్లింది. మనసు కాస్త కలతపడితే మందు ఇమ్మని మరణాన్ని అడగకు..అని పాటలో పాత్రకేకాదు.. కొన్ని కోట్లమందికి ఆయన అందించిన సందేశం కూడా.

గమనమే నీ గమ్యమైతే బాటలోనే బతుకు దొరుకు... ప్రశ్నలోనే బదులు వుంది గుర్తుపట్టే గుండెనడుగు – అని ఒక పాట గుండె తలుపు తడుతుంది. ***'కష్టం వస్తేనేకదా గుండె బలం తెలిసేది దుఃఖానికి తలవంచితే తెలివికింక విలువేది'*** అని మరో పాటలో బతుకుచిత్రాన్ని ఆవిష్కరించారాయన. బతుకంటే బడి చదువా అని ఒక పాటలో ప్రశ్నించిన శాస్త్రిగారు ***'పొరపాటున చేజారిన తరుణం తిరిగొస్తుందా... ప్రతి పూటా ఒకపుటలా తన పాఠం వివరిస్తుందా?'*** అని జాగ్రత్త చెబుతారు. ***'కరుణను మరిపించేదా చదువు సంస్కారం అంటే.. గుండెను బండగ మార్చేదా సంప్రదాయం అంటే..'*** అని ఓ సామాజిక బాధ్యతని గుర్తు చేస్తారు.

... ఇలా చెప్పుకుంటూ వెళ్తే విశ్లేషణలో ఎంత సమయం గడిచిపోతుందో తెలియదు. ఎన్ని పాటల గురించి మాట్లాడుకున్నా ఇంకా ఎన్నో మిగిలే ఉంటాయి. మథించిన కొద్దీ కొత్తకొత్త రూపాల్లో సాక్షాత్కరించడం

శాస్త్రిగారి కవిత్వం. దర్శించేకొద్దీ లోతుల్లోకి తీసుకువెళ్లడం శాస్త్రిగారి కవిత్వంలోని సౌందర్యం. ఎన్నో భావచిత్రాలు దృశ్యకావ్యాలై వెండితెరని వెలిగించడం శాస్త్రిగారి శిల్పం.

**వందేమాతరం**

'రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్' నేపథ్యం శాస్త్రిగారిని నిఖార్సయిన దేశభక్తుడిగా, సుశిక్షితుడైన సైనికుడిలా తీర్చిదిద్దింది. ఆ కోణంలో సామాజికమైన పెడ ధోరణుల్ని ఆయన సహించలేరు. కవిగా స్పందిస్తారు. చాలా ధాటిగా చెబుతారు. ధారగా వెలిబుచ్చుతారు. తన అసంతృప్తిని పదునుగా మెరిసే ధగధగల ప్రశ్నార్థకంలా సంధించారు. కట్టు తప్పిపోతున్న సమాజం గురించి చెబుతూ, 'సిగ్గులేని జనాన్ని', 'జీవచ్ఛవం' లాంటి తీవ్రపదాలతో అభివర్ణించారంటేనే అర్థమవుతోంది – ఎంత వేదనలో ఉన్నారో. ఎలా ఉండాలి? ఎలా ఉన్నాం? ఎంత బాధ్యతగా ఉన్నాం? ఎందుకు ఉండలేకపోతున్నాం? లాంటి ఆవేదనాభరితమైన ఎన్నోప్రశ్నలకి సమాధానాలు దొరకని నిస్సహాయ స్థితిలోంచి వచ్చిన మాటలయి ఉండొచ్చు బహుశ. అర్థశతాబ్దపు అజ్ఞానాన్ని స్వతంత్ర మందామా.. స్వర్ణోత్సవాలు చేద్దామా అని ఆయన లేవనెత్తిన ప్రశ్న ఎంత చర్చకు దారి తీసిందో మనందరికీ తెలుసు. **"సురాజ్యమవలేని స్వరాజ్య మెందుకని.. సుఖాన మనలేని వికాసమెందుకని"** అని ఆయనలోని ఆర్తి అక్షర రూపమై సంచలనం సృష్టించింది. ***"అపుడెపుడో ఆటవికం. మరిపుడో ఆధునికం. యుగయుగాలుగా ఏ మృగాలకన్నా ఎక్కువ ఏం ఎదిగాం?"*** అనే తీక్షణమైన ప్రశ్న వేయడానికి శాస్త్రిగారు ఎంత కలత చెంది ఉంటారో ! సామాన్య శాస్త్రాన్ని ఓ మలుపు తిప్పిన పరిణామక్రమం తాలూకు మౌలికతనే ప్రశ్నించారు కవి. భారతీయ మూలాలకి తార్కిక భాష్యాన్ని అందించడమే గమ్యంగా ఎంచుకున్న ఒక తాపసిని కొన్ని పరిస్థితులు కలచివేశాయి. ఫలితంలో వచ్చిన సాహిత్యం కూడా ఎప్పటికీ నిలిచేదే కావడం విశేషం. సంఘ్ కార్యకలాపాల కోసం ***'యోగులు సాగిన మార్గమిది..'*** అనే ఓ గేయంలో దేశం గురించి ఆయన అభివ్యక్తిని చూస్తే ఈ వేదనకు కారణం ఇట్టే అర్థమవుతుంది.

**సనాతనం... అధునాతనం...**

ఈ నాగరికత అందించిన వారసత్వం, ఈ నేత్తుటితో సహవాసం చేస్తున్న సనాతన ధర్మం, వాఙ్మయమై వెల్లువెత్తిన వేదవేదాంగాల సారాంశం, పురాణేతిహాసాల వైభవం, భారతీయత భువనమంతా ప్రవచించిన విజ్ఞానకిరణాల ఉపదేశ సాక్షాత్కారం మేళవించిన అక్షరరూపం శాస్త్రిగారి సాహిత్యం. కళాతపస్వి సినిమాల్లో ఆధ్యాత్మిక జీవనతత్వాన్ని ఉప్పొంగించే గీతాలు, ఇతరుల సినిమాల్లో యుగళగీతాల్ని పరుగులెత్తించడంలో శాస్త్రిగారి అపారమైన ప్రతిభ మనకు తెలియనిది కాదు. కవిత్వాన్ని ఎంత విభిన్నంగా విలక్షణంగా చెప్పవచ్చో.. సినిమా పాటలో కూడా సృజనాత్మక స్వేచ్ఛకి కొత్త ప్రమాణాలు నిర్దేశించారాయన.

శిఖరాలకి లోతులకీ; తాత్త్వికతకి సార్థకతకీ; తాత్త్విక చింతనకి ఆత్మిక భావనకీ; ఉల్లాసానికి; ఉద్వేగానికీ; గాయానికి సాయానికీ; ఆవేదనకి; ఆర్తికీ అక్షరాలతో ముడివేసి ఆత్మదీపం వెలిగించే విజ్ఞాన సిరుల భాండాగారం సిరివెన్నెల పాట. పాటంటే – కాలరేఖల మీద సిరివెన్నెల చేసిన సాహితీ క్రతువు. తరుశాఖల మీద బహువన్నెలు పూయించిన పూల రుతువు. తత్త్వం లేని కవిత్వం రాయని ఒక నిబంధనకి కట్టుబడి, పాటకీ కవిత్వానికీ మధ్య అందమైన అనుబంధాన్ని ముడివేయడమే శాస్త్రిగారి విశిష్టత. ఆయన ఎంత సనాతనుడో అంత ఆధునికుడు. 66 యేళ్ల వయసులో ***"నీ కాళ్లని పట్టుకు వదలనన్నది..."*** అనే ఉర్రూతలూగించిన ఓ ట్రెండీ పాటని రాసిన శాస్త్రిగారి కలం ఎప్పటికీ నిత్యనూతనం.

**అదే నివాళి !**

తన ఆలోచనని సాకారం చేసుకోడానికి, అస్పష్టంగా ఉన్న భావానికి ఆకారం తీసుకోడానికి ఎన్ని యాతనలుపడ్డారో మనకు తెలీదుగాని... ఇక సాయంపట్టలేక చిట్టచివరిసారి సారీ చెప్పిన ఆఖరి ఊపిరికి, ఆయన కొవ్వొత్తిలా కాలిపోతున్న విషయాన్ని పక్కన పెట్టి మరీ ఖర్చుపెట్టిన కాలానికి, పాటకి పదును పెట్టడానికి ఆయన పడ్డ మథనలకి, వ్యక్తిగత జీవితాన్ని పణంపెట్టి కవిని మించి తన భుజం మీద వేసుకున్న బాధ్యతకీ, ఐహిక బంధాల నుంచి తనదైన లోకంలో ఒక్కడూ గడిపిన రాత్రులకీ, తనలో తాను పడ్డ సంఘర్షణలకీ ఈ సమాజం తిరిగి ఏమివ్వ గలదు? ఆచార్య స్థానంలో కూర్చోబెట్టిన సిరివెన్నెలను ఎలా సముచితంగా గౌరవించగలదు? దుఃఖాన్ని చూడడానికి, చూపించడానికి ఇష్టపడని ఆ యోగి అభిమానులందరినీ దుఃఖంలో మిగిల్చి వెళ్లిపోయిన ఈ సందర్భంలో వారి పాటలే మనకి ఓదార్పు. వాటి నుంచే శాస్త్రిగారిని గుర్తు చేసుకుంటూ ఉండాలి.

'కవులు కంటున్న కలలు మనుష్యులలో ఫలిస్తాయి' అన్న ఆధునిక మహాభారతకర్త గుంటూరు శేషేంద్రశర్మ మాటల్ని ప్రస్తావించకుండా ఇప్పటి ఈ సందర్భాన్ని దాటలేం. ఆయన ఎన్నో సందర్భాల్లో చెప్పినట్టుగా ప్రశ్నించుకునే తత్త్వాన్ని పెంపొందించడం, వారి పాటల అంతర్దర్శనం చేయడం మాత్రమే వారికి అసలైన నివాళి. చెమ్మగిల్లిన కళ్లకి, దిగులు కమ్ముకున్న గుండెలకి అదే స్వాంతన.

*అసతోమా సద్గమయ.. తమసోమా జ్యోతిర్గమయ... మృత్యోర్మా అమృతంగమయ*

*ఓం శాంతిః శాంతిః శాంతిః*

★



తల్లి సుబ్బలక్ష్మి, తండ్రి యోగి



చిన్ననాటి సీతారాముడు



సినీ గేయ కవిగా..



భార్య పద్మావతితో..

# యోగులు సాగిన మార్గమిది..



యోగులు సాగిన మార్గమిది
లోకములేలిన దుర్గమిది
శాశ్వత శాంతుల స్వర్గమిది
భగవాధ్వజ ఛాయలలో మాయని భరతావని దిగ్విజయమిది

రాయికి రప్పకి చెట్టుకి చేమకి చరాచరమ్ములకన్నిటికీ
నతమస్తకమౌ నతులు సలుపు పరమోన్నమతమౌ ఘన సంస్కృతిది
వినయము విద్యాభూషణమనుకొను విమల మనస్కుల వీడు ఇది
దురహంకారము దరిచేరని మహనీయ జీవనుల మార్గమిది

//యోగులు//

సరళ జీవనము విరళ చింతనము అవిరళ సరళి గణించినది
ఆద్యంతములకు అటు నిటు నిలిచిన ఆనందము పరికించినది
గీతాజ్యోతిని ఒసగి చేతముల చేయూతగా నడిపించినది
అజ్ఞానమునకు అందని ద్రష్టలు కాంచిన కాంచన స్వప్నమిది

//యోగులు//

కాలుడు రేపిన చీకటి ధూళి రక్కసి మూకల కర్కశకేళి
విసరిన వికృత విషవలయమ్ముల విస్మృతి పొందిన విభవమిది
పండిన పాపము పండగ కేశవుడవతరించు సంకేతమిది
హాలాహలమును హరాయించుకొను
అమృత హృదయుల స్వర్గమిది
//యోగులు//



# ఆ పాట తాకని హృదయం లేదు!



సిరివెన్నెల సీతారామశాస్త్రిగారి హఠాన్మరణం కలచివేసింది. దిగ్భ్రాంతికి గురిచేసింది. సంస్కృతి పట్ల గాఢాభిమానం, జాతీయతా భావాల నేపథ్యం ఉన్న ఆ గొప్ప కవి కన్నుమూయడంతో తెలుగు చలనచిత్ర రంగం ఒక ధ్రువతారను కోల్పోయింది. మాతృభూమి పట్ల అచంచల భక్తి, సంస్కృతి సంప్రదాయాల పట్ల సమున్నత గౌరవభావం ఉన్న సిరివెన్నెల తన అకుంఠిత దీక్షాదక్షతలతో, కష్టంతో అక్షర విన్యాసంతో మన సమాజం మీద చెరిగిపోని ముద్ర వేశారు. సాంస్కృతిక మూలాలను తడిమే గీతాలతో, తనదైన శైలీ విన్యాసాలతో, భాషా పటిమతో, భావ సంపదతో చిరకాలం వెండితెరను పండించారు. ఆయన పాట తాకని తెలుగు హృదయం లేదు. ఉప్పొంగని గుండె లేదు. ఆయన సంఘ కుటుంబం నుంచి వచ్చారు. సంఘంతో కలసి నడిచారు. వారి మరణం అశేష జనాన్ని దుఃఖ సాగరంలో ముంచింది. ఆయన భౌతికంగా కుటుంబసభ్యులనీ, మనందరినీ వీడి వెళ్లి ఉండవచ్చు. కానీ ఆయన రచనలు, జీవితం, అవి ఇచ్చే తాత్త్వికత తెలుగువారి మనోవీధులలో చిరస్మరణీయంగా ఉండిపోతాయి. వారికి దివ్యస్మృతికి ఇదే నా శ్రద్ధాంజలి. వారి పాదాలకు నా నమస్కారాలు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**వి. భాగయ్య** (ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారతీయ కార్యకారిణి సదస్యులు)

# గీత గోవిందుడు - మా సీతారాముడు

డా॥ కె.కె.వి. శర్మ

అశ్లీల పంకం అంటని అక్షరాలతో
తెలుగు కవితామ తల్లికి
త్రిసహస్ర పూర్వక
గీతాభిషేకం చేసిన
సర్వమాన్యుడు మా 'సిరివెన్నెల'.
చిరువెన్నెల కాస్తా ఇంతింతై అన్నట్లు
కవితాకాశమంతా వ్యాపించింది.
వెన్నెల సిరులు కురిపించింది.
చందమామను దివినుండి భువికి రప్పించి
పగలే వెన్నెలలు పూయించింది.
కారణ జన్ముడతడు.
ఆంధ్రుల పుణ్యఫలంబతడు.
భక్తి అయినా - దేశభక్తి అయినా
వేదన అయినా - వేదాంతమైన
ప్రేమ అయినా - విరహం అయినా
ఆయన కలం నుండి జాలువారిన
ప్రతిగీతం అనుభూతి రసాత్మకం
ఆ పాత మధురం - ఆలోచనామృతం
నానృషిః కురుతే కావ్యమ్
ఆయనొక ఋషీ
ఆయనొక క్రాంతదర్శి
యువతకు మార్గదర్శి
రాష్ట్రీయ భావనా తపస్సంపన్నుడు!
మా సీతారాముడు!!
గీత గోవిందుడు!!!

(సిరివెన్నెల గీతారామశాస్త్రి గారికి అక్షరాంజలి)

# సిరివెన్నెల చివరిగీతం

సెప్టెంబర్ 1, 2021: సిరివెన్నెల సీతారామశాస్త్రి తన తమ్ముని కుమారుని పెళ్లికి విశాఖపట్నం వచ్చారు. అప్పుడు భారతభూమి వైశిష్ట్యాన్ని చెప్పే ఒక పాట రాయవలసిందని విశ్వహిందూ పరిషత్ ప్రముఖుడు కోటేశ్వరశర్మ ఆయనను కోరారు. అప్పుడు ఈ పాట పాడారు సీతారామశాస్త్రి. బహుశా వారి చివరి పాట ఇదే.



మా మంచి మాగాణి
మముగన్న భరతావని
ఋషి పుంగవుల కృషికి
నిషితార్ష శేముషికి
ఆధారకేదారమీ హారుణి

ఇలగోడు వినునాడు
హరి వాడిదంతాలు
ఇట నాటి తొలినాటి
హలమైనవో
వినతాసుతునికేల
వినువీధి జనువేళ
సుధబిందువిట చింది
చినుకైనదో
మహిత హిత సమ్మితం
విహిత వ్రత సంచితం
మహిని ఈచోటే
ఫలియించె సుజ్ఞా ధాన్యం
ఆత్మకాహారమందించు
ఈ నేల ధన్యం.....

మా మంచి మాగాణి

తన గుండె చీల్చేటి
నాగేటి చాలుకు
సిరిసంతునందించు
కరుణామయి
తను పండి తనువంత
మలిసందెగా ఎండి
సంక్రాంతి కళలిచ్చు
శోభామయి
అమృతాశనులకే
హవ్యమందించగా
ధరకు చదలేరు దింపేటి
అరుదైన యోగం
సకల భువనాలు
తరయింప చేసేటి యాగం ..

మా మంచి మాగాణి

## కవి.. రవి.. పవి..

ఓ మహా వృక్షం కూలినప్పుడు, ఓ పాత లైబ్రరీ కళ్ళముందే తగలడిపోతున్నప్పుడు వచ్చేంత దుఃఖం ఒక కవి నిశబ్దంగా వెళ్ళిపోతే వస్తుందా? వస్తుంది మరి. ఎందుకంటే ఆయన అచేతన సిద్ధాంతాల భుజాలమీంచి ప్రపంచాన్ని చూడడు, నీకు చూపించడు. మరి? రవిలా వచ్చి నిన్ను పట్టి కుదిపి స్వప్నావస్థలోంచి బైటికి లాక్కొస్తాడు. గదిలో ఉండిపోకు నీ మదిలోకి వెళ్లి నిన్ను నువ్వు వెతుక్కోమని తోస్తాడు. విప్లవకారులవ్వాలంటే సిద్ధాంతాలు అక్కర్లేదని, ఆస్తికులవ్వాలంటే వేదాంతం బోధపడక్కర్లేదని తేలిగ్గా తేల్చేస్తాడు. నరుడు, హరుడు ఇరువురూ నీలోనే ఉన్నారు కదా, అంతకంటే పెద్ద వజ్రాయుధం ఏముంటుందని నిన్ను నిలబెట్టి ప్రశ్నిస్తాడు.

అయితే మాత్రం అంత దుఃఖం పుట్టాలా?

జీవితం నిత్య ఘర్షణ–నీవారితోనో, పైవాడితోనో, నీతో నీకో – పోరాడుతూనే ఉండు అని చెప్పి నిశబ్దంగా నిష్క్రమించాడు. ఇంతటి సత్యం అప్రయత్నంగా మనకు చెప్పినా, దాని వెనక ఎంత మేధోమథనం ఉందో తెలిస్తే ఇంత దుఃఖం రాదా మరి?

– సత్య



'నా అన్న చనిపోలేదు... గుండెల్లోనే ఉన్నాడు' అన్నారు తనికెళ్ల భరణి. ఏకోదరులు కాకున్నా, ఇద్దరిదీ అంతటి అనుబంధమే. ప్రముఖ సినీ గీత రచయిత, 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి; రచయిత, నట దర్శకుడు తనికెళ్ల భరణిది దాదాపు నాలుగు దశాబ్దాల అనుబంధం. సుమారుగా ఇద్దరూ ఒకేసారి చిత్రసీమలోకి అడుగుపెట్టారు. సీతారామశాస్త్రి మరణాన్ని జీర్ణించుకోలేకపోయిన భరణి, ఆయన భౌతికకాయాన్ని చూసి కన్నీరు మున్నీరయ్యారు. ఇద్దరూ శివతత్త్వాన్ని ఔపోసన పట్టినవారే! సీతారామశాస్త్రితో భరణికి ఉన్న అనుబంధాన్ని తెలుసుకుందామని 'జాగృతి' ప్రతినిధి ఆయనకు ఫోన్ చేసినప్పుడు సినిమా షూటింగ్ నిమిత్తం కాశీ వెళ్లానని చెప్పారు. అక్కడి నుండే తన మనోభావాలను వ్యక్తం చేశారు. కార్తీక మాసాన శివైక్యం చెందిన ఆప్తమిత్రునితో ఉన్న అనుబంధాన్నీ, 'గంగావతరణం'తో చిత్రసీమలోకి అడుగుపెట్టిన 'సిరివెన్నెల'తో ఉన్న సంబంధాన్నీ ఆ గంగాతీరం నుండి, కాశీ పుణ్యక్షేత్రం నుండి భరణి తెలియచేయడం విధి వైచిత్రి కాకమరేమిటీ!?

# ఒక పాటని పది పదిహేనుసార్లు తిరగరాసేవాడు!

**సీతారామశాస్త్రి మరణాన్ని మీరు తట్టుకోలేక పోయారు. భౌతిక కాయానికి అంజలి ఘటిస్తూ దు:ఖాన్ని ఆపుకోలేకపోయారు. ఇప్పటికైనా కొంచెం కోలుకున్నారని అనుకోవచ్చా?**

ఎన్ని అక్షరాలదారుల్లో ఇద్దరం కలిసి నడిచామో! నా చెయ్యి వదిలేసి హఠాత్తుగా వెళ్లిపోతే తట్టుకోలేక పోయాను. అతనంతే... 'సిరివెన్నెల' కదా! అలా అలా దూరమైపోతూ ఉంటాడు. మళ్లీ మన దగ్గరకు వచ్చేస్తాడు. నిజం చెప్పాలంటే, ఏం చెప్పలేక పోతున్నాను. ఆయనేమో కన్నీరు పెట్టొదంటాడు... ఇంకేం చెప్పను!

**మీ ఇద్దరి సినీరంగ ప్రవేశం ఒకేసారి జరిగింది కదా! ఆ రోజుల్ని తలుచుకుంటే ఏమనిపిస్తుంది?**

గొప్పగా అనిపిస్తుంది. 1984 ప్రాంతంలో నేనూ, సీతారామశాస్త్రి కాస్త అటూ ఇటూగా చిత్రసీమలోకి అడుగుపెట్టాం. ఏవీయం స్టూడియో ఎదురుగా సాలిగ్రామం ప్రాంతంలో తెలుగు నటులు ఎక్కువగా నివాసం ఉండేవారు. అప్పట్లో ఆయన 'సాక్షి' రంగారావుగారి ఇంటిలో అద్దెకు ఉండేవారు. నేను రాళ్లపల్లి గారి ఇంటికి వెళుతుండేవాడిని. తరచూ ఎక్కడో చోట, ఎవరో ఒకరి ఇంటిదగ్గర కలుసుకునే వాళ్లం. అయితే మా అనుబంధాన్ని బలోపేతం చేసింది మాత్రం 'లేడీస్ టైలర్' చిత్రం. వంశీ దర్శకత్వంలో 'స్రవంతి' రవికిశోర్ ఆ సినిమా నిర్మించారు. నాకది రచయితగా నాలుగో సినిమా. సీతారామశాస్త్రికి అప్పటికే కొంత పేరొచ్చింది. స్రవంతి మూవీస్ ఆఫీస్‌లోనే స్టోరీ సిట్టింగ్స్ జరుగుతుండేవి. నేనేమో పగలు వెళ్లి పనిచేసే వాడిని. సీతారామశాస్త్రిని అన్నయ్య అని ఆప్యాయంగా పిలిచేవాడిని. అతనేమో నన్ను 'ఒరేయ్' అని చనువుతో సంబోధిస్తుండేవాడు. అలా పిలిపించుకోవడంలో ఓ అందం, ఓ ఆత్మీయత, ఓ సొగసు ఉండేది. సీతారామశాస్త్రి చేతిలో ఎప్పుడూ ఓ సూట్ కేస్ ఉండేది. దాని మీద దరువు వేస్తూ పాటలు పాడుతూ ఉండేవాడు. మొదటి నుండీ అతనికి అదో అలవాటు.

మొదటివాడు ఎప్పుడూ ఒక్కడే మరి!
మొదటి అడుగు ఎప్పుడూ ఒంటరే మరి
వెనుక వచ్చు వాళ్లకు బాట అయినది

**మీ ఇద్దరి మీద ఒకరి ప్రభావం మరొకరిపై ఉందేదా?**

చిత్రం ఏమంటే... సినిమాల్లోకి వచ్చేవరకూ 'భరణి' అనే కలం పేరుతో రచనలు చేసిన సీతారామశాస్త్రి, సినిమా రంగంలో నాతో పరిచయం ఏర్పడిన తర్వాత ఒకే పేరుతో ఇద్దరు ఉంటే బాగోదని చెప్పి తన కలం పేరుకు స్వస్తి పలికాడు. అదే సమయంలో అతని తొలి చిత్రం 'సిరివెన్నెల' ఇంటి పేరుగా మారిపోయింది. ఇక నా ప్రభావం అని చెప్పను కానీ అతని కెరీర్ ప్రారంభంలో నా వంతుగా ఇచ్చిన కొన్ని సలహాలు సీతారామశాస్త్రికి బాగా ఉపయోగపడ్డాయి. ఉదాహరణకు 'లేడీస్ టైలర్' సినిమానే తీసుకుంటే, దానికి ఇసై జ్ఞాని ఇళయరాజా సంగీత దర్శకుడు. అప్పటికే ట్యూన్‌కు పాట రాయడమనే ప్రక్రియ మొదలైపోయింది. ఇళయరాజాకు ఆ సమయానికి శాస్త్రీయ సంగీత పరిజ్ఞానం పెద్దగా లేదు. దాంతో ఆయన 'తత్‌కారం'గా ట్యూన్ ఇచ్చేవాడు. వాటిని వింటూ పాట రాయాల్సి ఉండేది. అది సీతారామశాస్త్రికి ఇబ్బందిగా అనిపించేది. 'ఇదేవిట్రా ఆయన ఇలా ఇచ్చాడు?' అనేవాడు. తననా తననాల స్థానంలో ఏబీసీడీ అనుకుంటూ పాట రాసేయ్ అని చెప్పాను. అలా 'లేడీస్ టైలర్'లో రాసిన పాటలు ఆ సినిమా విజయానికి గొప్పగా దోహదపడ్డాయి. ఇక నా మీద సీతారామశాస్త్రి ప్రభావం కూడా కొంత ఉంది. తన తొలి తెలుగు సినిమా 'సిరివెన్నెల'లో 'ఆదిభిక్షువు

నేది కోరేది, బూడిదిచ్చేవాడినేది అడిగేది' అంటూ నిందాస్తుతిలో ఓ పాట రాశాడు. అది నాకు ఎంతో ఇష్టం. నేను కూడా ఆ తర్వాత 'ఆటగదరా శివ, శభాష్ రా శంకరా' గీతాలను నిందాస్తుతిలోనే రాశాను.

**సీతారామశాస్త్రిని రాత్రిళ్లు ఉదయించే సూర్యుడు అని ఆ మధ్య త్రివిక్రమ్ అన్నారు. మొదటి నుండీ ఆయన అంతేనా?**

అవును. సీతారామశాస్త్రికి కెరీర్ ప్రారంభం నుండి రాత్రిళ్లు పాట రాయడమే అలవాటు. 'లేడీస్ టైలర్' సమయంలోనూ నేను పగలంతా ఆ ఆఫీస్‌లో మాటలు రాస్తూ ఉంటే, అతను రాత్రిళ్లు తన పాటల ప్రక్రియను మొదలెట్టేవాడు. అప్పటికి నాకూ వివాహం కాలేదు కాబట్టి, నేనూ అతనితో పాటే అదే ఆఫీస్‌లో గడిపేసేవాడిని. నిద్రలేని అద్భుతమైన ఎన్నో రాత్రులు అతనితో గడిపాను. సీతారామశాస్త్రిలో ఉన్న గొప్ప సుగుణం ఏమిటంటే... దర్శక నిర్మాతలు తొందర పెడుతున్నారు కదా! అని ఏదో ఒకటి రాసి ఇచ్చేవాడు కాదు. రాసింది ముందు తనకు నచ్చాలి, అందుకోసం ప్రతి పదానికీ నగిషీలు చెక్కుతూ ఉండేవాడు. ఒకే పాటను పది పదిహేను సార్లు తిరగరాసేవాడు. అందువల్ల పాట రాయడానికి ఎక్కువ సమయం పట్టేది. అయినా సంతృప్తికరంగా వచ్చేవరకూ ఆ పాటను ఇచ్చేవాడు కాదు. అలా ప్రతి పదాన్ని తనకు తాను అనుభూతి చెంది, చెక్కుతాడు కాబట్టే అతని పాటలకు శాశ్వతత్త్వం లభించింది.

**సీతారామశాస్త్రి పాటల్లో మీకు బాగా నచ్చినవి...**

అతను రాసిన పాటలన్నీ ఇష్టమే. అయితే 'సిరివెన్నెల'కు రాసిన పాటలు మరింత ఎక్కువ ఇష్టం. ఇందాక చెప్పినట్టు 'ఆదిభిక్షువు వాడి నేది కోరేది' పాట మరీ మరీ ఇష్టం. అలానే సీతారామశాస్త్రి సినిమా కోసం కాకుండా మామూలుగా కూడా బోలెడన్ని పాటలు రాసుకునే వాడు. అలా రాసిన పాటే **'జగమంత కుటుంబం నాది... ఏకాకి జీవితం నాది'**. ఆ పాటను అప్పట్లోనే మాకు వినిపించాడు. అదే పాటను బేస్ చేసుకుని కృష్ణవంశీ 'చక్రం' సినిమా కథ రాసుకుని, ఆ పాటను అందులో వాడుకున్నాడు. ఆ పాటలో గొప్ప ఫిలాసఫీ ఉంది.

ఈ భూమి మీద పుట్టిన ప్రతి ఒక్కరికీ వర్తించే పాట అది. ఉదాహరణకు సీతారామశాస్త్రినే తీసుకోండి. అతను ఓ బిడ్డగా ఈ భూమి మీదకు వచ్చాడు. ఆ తర్వాత సీతారామశాస్త్రి అయ్యాడు, కవి అయ్యాడు, సినీ గీత రచయిత అయ్యాడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత అయ్యాడు. బోలెడంత కీర్తిని సంపాదించాడు. కానీ మొన్న వెళ్లిపోయినప్పుడు వీటన్నింటినీ, చివరకు మొలతాడును కూడా వదిలేసి వెళ్లిపోయాడు. ఈ పాటలోని భావమూ ఇదే. ఏక వాక్య మహాకావ్యం అంటుంటారు. ఈ పాట అలాంటిదే!

**సీతారామశాస్త్రిగారు, మీరు శివభక్తులు కదా! శివతత్త్వాన్ని బాగా ఆకళింపు చేసుకున్నారు. తరచూ మీ మధ్య ఆ విషయాలకు సంబంధించిన చర్చ జరుగుతుండేదా?**

మేమిద్దరమే కాదు. మాతో జొన్నవిత్తుల రామలింగేశ్వరావు, సామవేదం షణ్ముఖ శర్మ కూడా కలుస్తుండేవారు. ఎవరికి వారం మా స్థాయిలో శివతత్త్వాన్ని అర్థం చేసుకుని, తిరిగి అందించే ప్రయత్నం చేస్తూ ఉండేవాళ్లం. జొన్నవిత్తుల, సామవేదం షణ్ముఖశర్మ అయితే ఏకంగా శతకాలు రాశారు. సీతారామశాస్త్రి శివుడి తత్త్వాన్ని తెలియ చేస్తూ 'శివదర్పణం' అనే పుస్తకాన్ని తీసుకొచ్చారు. ఆ పుస్తకావిష్కరణ సమయంలో నేను గ్రంథ పరిచయం చేశాను. సీతారామశాస్త్రికి ఆంగ్ల భాష మీద కూడా చాలా గొప్ప పట్టు ఉంది. ఆ విషయం చాలామందికి తెలియదు.

**సీతారామశాస్త్రి గారి మరణ వార్త చాలామందిని షాక్ కు గురిచేసింది. మీకైనా ఆయన అనారోగ్యం గురించి ముందుగా తెలుసా?**

నిజం చెప్పాలంటే తెలియదు. బాలుగారు కొంతకాలం హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్‌లో ఉన్నారు కాబట్టి ఆయన మరణవార్తను కొంతలో కొంత ఓర్చుకోగలిగాం. కానీ సీతారామశాస్త్రి మరణం ఏ మాత్రం ఊహకు అందనిది. ఆయనకు కొంత అనారోగ్యం ఉందని తెలిసింది. అయితే గతంలో హార్ట్ ఆపరేషన్ జరిగింది కాబట్టి దానికి సంబంధించిన చిన్న సమస్య ఏదైనా ఉండి ఉంటుందని అనుకున్నాను. చనిపోవడానికి కొద్ది రోజుల ముందు హాస్పిటల్‌లో కలిసినప్పుడు మనవరాలితో సరదాగా ఆడుకుంటూ కనిపించారు. వాళ్ల పెద్దబ్బాయి యోగిని సీతారామశాస్త్రి ఆరోగ్యం గురించి అడిగినప్పుడు కంగారు పడాల్సింది ఏమీ లేదనే చెప్పాడు. కుటుంబ సభ్యులు కూడా ఈ హఠాన్మరణాన్ని జీర్ణించుకో లేకుండా ఉన్నారు. ఏదేమైనా ఏకాదశి నాడు మరణం, ద్వాదశి నాడు దహనం... గొప్పవని పెద్దలు చెబుతారు. మా అన్నయ్య విషయంలో అదే జరిగింది. నా వరకూ నాకు అన్న చనిపోలేదు. గుండెల్లోనే ఉన్నాడు.

**ఆయనలోని కవిని మీరు ఏ రీతిన చూస్తారు?**

'దాతృత్వం ప్రియ వక్తృత్వం ధీరత్వ ముచితజ్ఞతా! అభ్యాసేన నలభ్యన్తే చత్వారః సహజాగుణాః' అంటాడు చాణక్యుడు. అంటే దానగుణం, మంచిగా మాట్లాడటం, దేనికీ చలించక ధైర్యంగా ఉండటం, ఇది మంచి-ఇది చెడు అనే జ్ఞానం కలిగి ఉండటం... ఈ నాలుగు గుణాలు సహజ సిద్ధమైనవి. నేర్చుకుంటే వచ్చేవి కావు. అలానే కవిత్వం కూడా మా అన్న సీతారామశాస్త్రికి సహజంగా అబ్బింది. అందుకే ఆయన భౌతికంగా దూరమై పోయినా, ఆయన రాసిన కవిత్వం శాశ్వతంగా నిలిచిపోతుంది. ★



మంగళసూత్రం అంగడి సరుకా
కొనగలవా చేజారాకా?
లాభం ఎంతొచ్చిందమ్మా
సౌభాగ్యం అమ్మేశాకా?

* * *

ఏ చరిత్ర నేర్చుకుంది పచ్చని పాఠం
ఏ క్షణాల మార్చుకుంది జిత్తుల మార్గం
రామబాణమార్పిందా రావణకాష్టం?
కృష్ణగీత ఆపిందా నిత్య కురుక్షేత్రం

* * *

జరుగుతున్నదీ జగన్నాటకం
జరుగుతున్నదీ జగన్నాటకం
పురాతనపు పురాణవర్ణన
పైకి కనపడుతున్న కథనం
నిజజీవన సత్యమని
భాగవతలీలల అంతరార్థం.

* * *

తండ్రినే నేనైనా.. దండమే పెడుతున్నా
తల్లిలా మన్నించు.. మెల్లగా దండించు
కాళిలా మారమ్మా... కాలితో తన్నమ్మా

* * *

పాదాల్ని నడిపించే ప్రాణాల రూపేది
ఊహల్ని కదిలించే భావాల ఉనికేది
వెన్నెల దారమా జాబిల్లిని చేర్చుమా
కోయిల గానమా నీ గూటిని చూపుమా

# శాశ్వత జ్ఞాపకా

చిరంజీవి సీతారాంతో 1964 నుండి– అంటే అతని తొమ్మిదో ఏడు నుండి– దహనమయ్యేంత వరకూ నా పరిచయం సాగింది. అసలు దహించే స్వభావంతోనే జీవించాడతడు. 'అగ్గితో కడుగు' అన్న గాయం సినిమా పాటలో అతడే కనిపిస్తాడు. అగ్నిపునీత సీతలా, పరమ పవిత్ర గంగాప్రవాహంలా, హిమాలయాలు వెదజల్లే తెల్లటి మంచులా, మలయమారుతంలా, గర్జించే పర్జన్యంలా తనలో తనను ఇముడ్చుకుంటూనే, జగమంత కుటుంబానికి తన భావాలనీ, అనుభవాలనీ పాటల్లో రంగరించి అందించిన ధన్యజీవి!

ఆగని, ఆరని, ఎడతెగని ఒక బంధం అయిదు దశాబ్దాల పాటు మా మధ్య సాగింది! అతడి నుండి నేను పొందిన గౌరవానికీ, నా వ్యక్తిత్వానికీ ఏ మాత్రం సంబంధం లేదు. ఆ గౌరవానికి ఎక్కడా సామీప్యత, అర్హత లేదని ఎన్నోసార్లు విన్నవించుకున్నా, నన్ను అందరికీ ఉన్నతంగా పరిచయం చేయడం అతని అత్యున్నత సంస్కారమే. నాకు అర్హత లేకపోయినా, అతని నుంచి అలాంటి అదృష్టం మాత్రం లభిస్తూనే ఉండేది. ఇదే వైరుధ్యం!

మూడు దశాబ్దాల పాటు వారం వారం ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తూండేవి! బాధలు, కష్టాలు, కడగండ్లతోనే అతడి జీవితం ఎక్కువ భాగం గడిచింది. అందులో కొంత నాకూ భాగస్వామ్యం ఉంది! అతడికి నేను ప్రత్యక్షంగా పాఠాలు చెప్పిన ఉపాధ్యాయుడిని కాదు. సమవయస్కుడినీ కాదు. కలిసి చదువుకోలేదు. ఆర్.ఎస్.ఎస్. మా ఇద్దరినీ కలిపింది. అదే వ్యక్తిగత స్నేహంగా మారింది. స్నేహితుడుగా, సన్నిహితుడుగా జీవితమంతా నడిపించింది! అతని గురించి రాసే అర్హత లేకున్నా, రాయమన్నారు 'జాగృతి' సంపాదకులు, చిరకాల మిత్రులు గోపరాజు నారాయణరావు. స్వీకరించాను బాధ్యతని!

సీతారం తండ్రి కీ.శే. డా. సి.వి.యోగి గారితో పరిచయం ఆ కుటుంబంతో నా బంధం ఇంతగా పెనవేసుకుపోవడానికి కారణం. మావాళ్లకి మీరు గార్డియన్‌గా ఉండి, సంస్కారవంతమైన, సంఘకార్యంలో భాగస్వాములను చెయ్యండి అని చెయ్యందించి, సీతారాం, శ్రీరామ్‌లను నా చేతిలో పెట్టారాయన. నాకు అదే ఓ దివ్య సందేశమైంది! జీవిత పర్యంత బాధ్యతా అయింది! 10వ తరగతి వరకూ అనకాపల్లిలో చదివి, తండ్రిగారి ఉద్యోగ రీత్యా కాకినాడ వెళ్లవలసి వచ్చింది. అయినా, స్వస్థలం అనకాపల్లితో, అక్కడి ఆయన వైద్యసేవలతో, మిత్రులతో బంధమూ వీటిలో ఏవీ నిలిచిపోలేదు. చివరికి డాక్టర్ యోగి జీవితం అనకాపల్లిలోనే ముగిసింది! మహాపండితుడు. 16 భాషల్లో పాండిత్యం. చదివింది ఎస్.ఎస్.ఎల్.సి మాత్రమే. హోమియో వైద్య శిక్షణ పొందారు. ఏ సబ్జెక్టయినా పోస్టుగ్రాడ్యుయేట్సుకి ట్యూషన్స్ చెప్పేవారు యోగి. 'అన్ని విద్యలున్నా అన్నానికి కరవే' అన్న కఠోర వాస్తవాన్ని చెప్పే సామెతకి ఉదాహరణ కూడా వారే.

సీతారాం జీవితం ఎన్నో మలుపులూ, మెలికలూ తిరిగింది. తండ్రి ఆకస్మిక మరణం తరువాత కూడా ఒక స్వాభావిక ఆవేశం నివురు కప్పుకుని ఉండేది. ఎదిరించడం, నిలదీయడం, వాదించడం, తనదైన తర్కంతో ఎదుటివాడిని ఢీకొట్టి ఓడించడం నిత్యకృత్యం. అది తట్టుకోవడం చాలామందికి కష్టమై, దూరమయ్యేవారు. ఆర్.ఎస్.ఎస్. సంఘ శాఖా కార్యక్రమం ముగిశాక గంటల కొలది నాతోనూ వాదించేవాడు. ఓపిగ్గా వినేవాడిని. తెలిసిన మేర సమాధానాలూ, సంజాయిషీలూ ఇచ్చేవాడిని. అయినా అందరి దృష్టిలో సీతారాం Perverted genius. నా దృష్టిలో, అనుభవంలో Perfect genius. మా సంభాషణ అందరికి విసుగు పుట్టించేది! కాకినాడ వెళ్లాక అదే కవిత్వంలో, పాటల్లో ప్రతిధ్వనించింది. అతడు రాసిన ప్రతి పాటా వారంలోగా ఉత్తరంలో దర్శనమిచ్చేది! కాకినాడ సాయంశాఖలో ముఖ్యశిక్షక్‌గా, ప్రాథమిక శిక్షావర్గకీ వెళ్లి వచ్చాడు. కీ.శే.కొత్తపల్లి ఘనశ్యామలప్రసాద్ గారు తన పాటల్ని మెచ్చుకోవడం సీతారాంకు మరింత ప్రోత్సాహం కలిగించేది! గంగావతరణం పాట కె. విశ్వనాథ్‌గారి దృశ్యీకరణ ప్రతిభని దృష్టిలో పెట్టుకొని రాసినా, ఆ దర్శకుడి వద్దకి చేరడం ఆలస్యమైంది! 'జననీ జన్మభూమి' సినిమాలో ముచ్చటపడి, రామచంద్రపురం సంఘ కార్యకర్తల అనుమతితో రచయిత పేరు తెలియకుండానే సినిమాలో పెట్టారు. అదొక అదృష్టం.




జాగృతి సాహిత్య వేడుకలో
సిరివెన్నెల, సత్యారావు మాస్టారు

మలుపు తిప్పిన ఘటన. విశాఖలో చదువుతున్న వైద్య విద్యను ఆపేసి, టెలిఫోన్సు శాఖలో గుమాస్తా ఉద్యోగంలో చేరిపోయి, తన సాహిత్య విజృంభణకి స్వేచ్ఛ లభించినట్లు భావించాడు సీతారాం. తాడేపల్లిగూడెంలో, రాజమండ్రిలో, కాకినాడలో తన కవితలనే పాటల రూపంలో బల్లపై దరువేస్తూ పాడేవాడు. కొంతమంది కవులు 'డప్పు పాటగాడు' అనేవారు, అసూయతో.

తండ్రిగారి మరణం ఆ కుటుంబాన్ని దీనమైన పేదరికంలోకి నెట్టేసింది. మకాం పెంకుటిల్లు నుండి తాటాకుల పాకలోకి మారింది. అప్పులు పెరిగాయి. చిత్రంగా, కవిత్వ ధారా పెరిగింది. పేరు ప్రఖ్యాతులున్న కవులతో పరిచయం, వారి మధ్య ప్రత్యేక స్థానం తెచ్చింది. ఒకవైపు అప్పులు,ఆ తిప్పలు. మరొకవైపు అర్ధరాత్రి కవితా వ్యాసంగం. చదువుకుంటున్న తమ్ముళ్లూ, చెల్లెళ్ల బాధ్యత బరువెక్కింది. ఆ బరువు తగ్గించడానికి శ్రీరాం ఆత్మీయులు ద్వారా ఎక్కడో రాంచీలో ఉద్యోగం చేసి, అర్ధాకలిలో కడుపు మాడ్చుకుంటు రెండే జతల బట్టలతో గడుపుతూ ఇంటికి డబ్బు పంపేవాడు. అయినా అవసరాలు తీరేవి కావు. కుటుంబం కంటే, కవిత్వానికే సీతారాం ప్రాధాన్యమిచ్చేవాడు. ఫలితం– కుటుంబంలో, సమాజంలో, మిత్రులతో సంఘర్షణ. అప్పుల్లో కూరుకుపోతున్నా, కనిపించిన ప్రతి పుస్తకం, ప్రతి పత్రిక కొనే అలవాటు. రాబడంతా అలా ఖర్చయిపోయేది! అప్పుడే ఆత్మహత్యా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇది తెలిసి, కాకినాడ నుంచి ట్రాన్స్‌ఫర్ పెట్టించి, అనకాపల్లికి మకాం మార్పించక తప్పలేదు. నా సహాయం ఎంతయినా, మాష్టారున్నారు అనే భావన అక్కడ అతనికి అండగా ఉండేదనిపిస్తుంది. అదో కనపడని రక్షా కవచం. అంతే! ఆత్మహత్యాయత్నం నుండి ఆత్మవిశ్వాసం వైపు మలుపు తిరిగింది జీవితం. ఆగిపోయిన చదువు, డిగ్రీ చదువు, మళ్లీ ప్రారంభమైంది. ఎం.ఏ. ఇంగ్లీష్

యర్రంశెట్టి సత్యారావు

# లైన ఆ క్షణాలు

కట్టించాం! రెండేళ్ల పరీక్షలు ఒకేసారి రాస్తానని పట్టుబట్టాడు. అలాగే అన్నాను.

ఇంతలోనే రామచంద్రపురంలో గంగావతరణం పాట కొత్త అవతారం ఎత్తింది. దర్శకుడు విశ్వనాథ్‌గారు పేరు తెలుసుకొని రచయితకి ఉత్తరం రాశారు. పారితోషికం అవసరంలేదు గాని, తెరపై పేరుండాలని కోరాడు సీతారాం. జననీ జన్మభూమి సినిమా టైటిల్సులో ఆ పేరు చూసి అంతా గెంతులేశాం! సినిమా విజయం సాధించకపోయినా, సీతారాం సినీ జీవితంలో విజయ సూచనలు ప్రారంభమైనాయి! సంభాషణల రచయిత ఆకెళ్ల సూర్యనారాయణగారు సీతారాంకి మంచి మిత్రుడు. విశ్వనాథ్‌గారి సిరివెన్నెల సినిమాకి మాటలు రాసే అవకాశం ఆయనికి లభించింది. పాటల రచయిత కావాలనగానే సీతారాం పేరు చెప్పారు ఆకెళ్ల. వెంటనే తీసుకొనిరమ్మని ఆదేశించారు విశ్వనాథ్. ఆకెళ్ల మా ఇంటికొచ్చి, ‘మాష్టారూ! సినిమా అవకాశం వచ్చింది, మద్రాసు పంపించండి!’ అని అడిగారు. ‘ఎమ్.ఏ. పరీక్షలు, ఎలా?’ అన్నాను. నిర్ణయం మీదే అని నాకొక పరీక్ష పెట్టాడు. అటు సినిమా ఛాన్సు. ఇటు ఎమ్.ఏ. పరీక్షలు. అవి పూర్తయితే లెక్చరర్ ఉద్యోగం! మధ్య ఊగిసలాట! చివరికి సినిమా వైపే మొగ్గింది త్రాసు.

సీతారాం మద్రాసులో అడుగుపెట్టడం, విశ్వనాథ్ గారిని కలసి, తన పాటలు వినిపించడం, ఆయన ముగ్ధుడై, సిరివెన్నెల సినిమా కథ చెప్పి ఓ పాట రాసి తెమ్మనడం వరసగా జరిగిపోయాయి. తన మొదటి పాట ‘విధాత తలపున ప్రభవించినదీ అనాది జీవనగానం’ పాట అలా వచ్చింది. ఆశ్చర్యం, ఆనందంతో స్వీకరించిన దర్శకుడు బాలూగారితో పాడించి రికార్డు చేశారు. ఆ రికార్డు పాట పట్టుకొని, పరమానందంతో కేసెట్ తెచ్చాడు. రోజంతా తిరిగి టేప్‌రికార్డర్ సంపాదించి విన్నాం! పరవశంతో ఉప్పొంగిపోయాం! మళ్లీ మళ్లీ కేసెట్ వేసుకొని విన్నాం, వినిపించాం. ఇలా ప్రారంభమైంది సీతారాం సినీ జీవితం.

ప్రతిభకి పట్టం కట్టేవారి వద్దకు చేరాడు సీతారాం. అయినా అక్కడెన్నో ఒడుదుడుకులు. పోరాటాలు. ఆ పోటీలో నలిగిపోయాడు. విసుగెత్తి అనకాపల్లి చేరాడు, ఇక వెళ్లకూడదన్న నిశ్చయంతోనే. తిరిగి విషాదయోగం! మిత్రులందరం కూర్చొని ప్రోత్సహించాం, వినలేదు. ఓదార్చి, కోప్పడి, బ్రతిమిలాడి, మళ్లీ మద్రాసు ట్రయిన్ ఎక్కించాం! విజయవాడ వరకూ ఓ ఎస్కార్ట్– మధ్యలో దిగిపోకుండా. తనేమిటో నిరూపించుకొని, నిలదొక్కుకునే సరికి, పాటల కోసం చిన్న సినిమా నిర్మాతలు రావడంలేదు. ఒక్క విశ్వనాథ్‌గారికే ఈయన పనికొస్తాడు తప్ప, మిగిలినవాళ్లకు నిరుపయోగం అన్న ముద్ర. మధ్యలో మళ్లీ ఓసారి అనకాపల్లి వచ్చాడు. తిరిగి పంపించాం అందరం కలసి! ఎన్నో బాధలనుభవించాడు. తరువాత ఖ్యాతి వచ్చింది. పోటీ పెరిగింది! పాండిత్యం గల కవులు ప్రవేశించారు. కానీ సీతారాంకి వారితో స్నేహమేగాని పోటీలేదు!

చివరిగా, సీతారాం ప్రస్థానంలో పలికిన బంగారు పలుకుల గురించి కొంచెం. దశాబ్దకాలంగా, విదేశీ పర్యటనలోగాని, సభలు, సమావేశాల్లోగాని కళాశాల, విశ్వవిద్యాలయాల్లోగాని తను మాట్లాడినప్పుడు సంఘం ఆలోచన కార్యపద్ధతి, సిద్ధాంత మౌలిక లక్షణాల గురించి వివరించడానికి ప్రాధాన్యం ఇచ్చాడు. భారతీయత అనేది ప్రాదేశిక, ప్రాంతీయ సరిహద్దులకూ, ఒక నిర్దిష్ట కాలానికీ పరిమితమయ్యేది కాదనీ, అలా పరిమితం చేయాలనుకోవడం సరైనది కాదనీ సీతారాం గట్టి నమ్మకం. అది విశ్వజనీనమైనదని చెప్పేవాడు. సమస్త మానవాళికి మార్గదర్శనం చేసే సిద్ధాంతంగా ఆవిష్కరిస్తూ ఉండేవాడు. అదొక తత్త్వం, జీవన విధానమని చాటుతూ ఉండేవాడు.

సద్గురు పూజ్య శివానందమూర్తిగారి సాన్నిధ్యం, ఆయన రచించిన ‘భారతీయత’, ‘మార్గదర్శకులు మహర్షులు’, ‘కఠోపనిషత్’ వంటి గ్రంథాలూ; ఎమ్.వి.ఆర్.శాస్త్రిగారి పుస్తకాలు సీతారాంలో జాతీయ భావాలను పటిష్టం చేశాయి. కన్నతండ్రి సి.వి.యోగి ప్రభావంతో బాల్యంలోనే భారతీయత పట్ల, హిందూ వాఙ్మయంపట్ల అవగాహన కలిగింది. తెలుగులో వచ్చిన కొన్ని పురాణ చిత్రాలు, అందులోని పాత్రలు కూడా సీతారాంను ప్రభావితం చేశాయి. అలాగే నాటకాలు. భారతీయమైన పాత్రలతో నిర్మించిన ప్రాంతీయ సినిమాలు సహకరించాయి. విశ్వనాథ సత్యనారాయణగారి సాహిత్యం, కె.విశ్వనాథ్ వంటి తెలుగుదర్శకులు భారతీయతను ప్రతిబింబించేలా తీసిన సినిమాలు తెలియకుండానే సీతారాంలో భారతీయతా దృష్టిని విస్తృతం చేశాయి. ఆ విషయాన్ని గుర్తు చేస్తూ మాట్లాడేవారు సీతారాం. సత్యంవైపు పయనించేదే భారతీయ జీవన విధానమని వక్కాణించడమూ ప్రారంభించాడు. దీనిని దృష్టిలో పెట్టుకొని పాటలు రాయడం మొదలుపెట్టాడు. భారతీయతను సమస్త మానవాళికి అందించే బాధ్యత హిందూజాతిది. ఈ జాతి ప్రజలు ప్రపంచమంతా తిరిగారు. ఇప్పుడు స్థిరపడ్డారు. ఏ దేశంలో ఉన్నప్పటికి, ఆ దేశాన్ని సుసంపన్నం చేయడమే హిందుత్వం. గతంలో ఈ విషయం చెప్పినప్పుడు అడ్డుకునే శక్తుల బలమైన ప్రయత్నం ఉండేది. డాక్టర్జీ అనుచరులు వందేళ్ల పాటు చేసిన తపస్సు, నిర్విరామ కృషితో, సామాజిక స్పృహతో, సేవాతత్పరతతో ఆ ప్రతిబంధకం తొలగింది. ఆనాటి మహర్షులే ఇవాళ్టి సంఘ కార్యకర్తలుగా వచ్చి పనిచేస్తున్నారు– ఇదే సీతారాం భావన. కలియుగం నిద్రాస్థితి, ద్వాపరం మెలకువ స్థితి, త్రేతాయుగ లక్షణం ప్రయత్నం, ఇక కృతయుగ లక్షణం, ముందుకు సాగడం. అంటే గతం, వర్తమానం, భవిష్యత్తు

‘ఈ ఆపరేషన్ నుండి కోలుకున్నాక ఇక నా ప్రస్థానం అటే మాష్టారూ!’ అన్నవే థియేటర్‌లోకి వెళ్లేముందు ఆ నోటి నుంచి నేను విన్న అమృతవాక్కులు. ఇక మిగిలిన కాలమంతా శివానందగారు ఆదేశించినట్లుగా సంఘమార్గంలో పయనిస్తానని మాట ఇచ్చాడు.

కాలానుగుణమైనన చరైవేతి కృతయుగ లక్షణంవైపు మనం ముందుకు సాగాలని దీనదయాళ్ ఉపాధ్యాయ 1967 కాలికట్ నుంచి వెలువడే ఒక పత్రికకు రాసిన సంపాదకీయంలో వివరించారు.

అలాగే, విదేశాల నుండి శాస్త్రీయత, సాంకేతికత దిగుమతి చేసుకోవచ్చుగాని, సంస్కృతిని దిగుమతి చేసుకోవల్సిన అవసరం లేదన్నారు దీనదయాళ్.

భారతీయ సంస్కృతిని ప్రపంచం దిగుమతి చేసుకుంటే, నిజమైన పురోభివృద్ధి, అంటే శాస్త్రీయ సాంకేతికాలు నిలుస్తాయి. లేకపోతే అభివృద్ధి తిరోగమనం వైపు యుటర్న్ తీసుకుంటుంది. భారతీయ సంస్కృతి– శాస్త్రీయతను, సాంకేతిక అభివృద్ధిని, సుస్థిరం చేస్తుంది, మానవాళిని ఉత్తమ జీవనం వైపు నడుపుతుందని సీతారాం విదేశాల్లో సభలలో మాట్లాడినప్పుడు చెప్పేవాడు. వివేకానందుడు, డాక్టర్ హెడ్గేవార్, దీనదయాళ్‌జీ చూపిన మార్గమే ఆచరించదగిందీ, అనుసరించదగిందీ అని చెప్పినప్పుడు సభలు కరతాళధ్వనులతో మారుమ్రోగేవి.

‘ఈ ఆపరేషన్ నుండి కోలుకున్నాక ఇక నా ప్రస్థానం అటే మాష్టారూ!’ అన్నవే థియేటర్‌లోకి వెళ్లేముందు ఆ నోటి నుంచి నేను విన్న అమృతవాక్కులు. ఇక మిగిలిన కాలమంతా శివానందగారు ఆదేశించినట్లుగా సంఘమార్గంలో పయనిస్తానని మాట ఇచ్చాడు. వినయంగా పాదాభివందనంచేసి, ఆలింగనం చేసుకొని కంట తడిపెడుతూ లోపలికి వెళ్లాడు. రెండురోజులకి కోలుకొని, ‘మాష్టారు రాలేదా!’ అని అడిగాడట. ఇంతలో ఆకస్మికంగా పొలమారి ఊపిరాడలేదు. తరువాత మూడురోజులు మృత్యువుతో పోరాడి సెలవంటూ అందర్నీ వదలిపెట్టి అందని లోకాలకి చేరుకున్నడా పుణ్యమూర్తి. తెలుగుతనం నుండి తన దృష్టిని భారతీయత వైపు పయనింపజేసాడు. అన్ని ప్రాంతాలు భారతీయతలో అవయవాలే అంటూ, ఆ సంగతి సినిమావారికీ గుర్తు చేయగలిగినంత ఎత్తుకు ఎదిగి, భగవాధ్వజాన్ని ఎగురవేశాడు.

**(వ్యాసకర్త బీవీకే కళాశాల, విశాఖపట్నం విశ్రాంత అధ్యాపకులు. సీతారామశాస్త్రికి గొప్ప ఆత్మీయులు)**



# ఓటీఎస్ పేరుతో బలవం

**పేదలకు కేటాయించిన ఇళ్లు, ఇళ్ల స్థలాలపై రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థకు చెల్లించాల్సిన పాత బకాయిలను వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద రుణమాఫీ చేసి రిజిస్ట్రేషన్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం అమలు వివాదంగా మారింది. డిసెంబర్ 20 వరకు గడువు విధించిన ఈ పథకాన్ని నిర్బంధంగా అమలుచేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఈ పథకం అమలు చేసుకోకుంటే లబ్ధిదారులకు అందుతున్న ఇతర సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని కూడా బెదిరిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. పేదలకు ఉపయోగ పడేందుకు ఈ పథకాన్ని అమలుచేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా రూ.4,400 కోట్లు డబ్బు వసూలు చేయడమే అంతిమ లక్ష్యంగా పేర్కొంటున్నారు.**

ఆదాయ మార్గాలు లేక డబ్బు పంచడానికి నిధుల సేకరణకు ఓటీఎస్ అమలు చేస్తున్నట్లు ప్రజలు భావిస్తున్నారు. పథకాల సొమ్ము ఇచ్చినట్లే ఇచ్చి మద్యం అమ్మకాల ద్వారా లాగేసుకుంటున్నారు. ఈ పథకం అమలయ్యేవారిలో సగం మంది నిర్మాణరంగ కార్మికులే. మద్యం అలవాటుగా ఉండి ప్రభుత్వం చేత నిలువుదోపిడి చేయించుకుంటున్నవారే. ఎవరికో చెల్లించడం కోసమే తమ నుంచి డబ్బు లాక్కోవడానికి ప్రభుత్వం వేసిన పన్నాగంగా వారు భావిస్తున్నారు. అందుకే ప్రభుత్వాన్ని నమ్మడం లేదు. డబ్బు చెల్లించలేమని ఎదురు తిరుగుతున్నారు. ప్రభుత్వానికి తమపై ప్రేమ ఉంటే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతున్నారు. కాని ప్రభుత్వం మాత్రం డబ్బు వసూళ్లకే ప్రాధాన్యం ఇస్తోంది. కలెక్టర్ నుంచి వాలంటీర్ల వరకు ఈ పథకం అమలుపై దృష్టిపెట్టారు. అన్ని ప్రాంతాల్లో అవగాహన శిబిరాలు నిర్వహిస్తూ పోస్టర్లు, కరపత్రాలు పంచుతున్నారు. దినపత్రికల్లో ఫుల్‌పేజీ ప్రకటనలు జారీ చేసి ప్రచారం చేస్తున్నారు. నవరత్నాలు పేరుతో డబ్బు పంచుతూ తిరిగి తమ నుంచే ఏదొక పేరుతో డబ్బు వసూలుచేయడం పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే ప్రభుత్వ మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందని భావించవచ్చు.

నవరత్నాల అమలుకు ప్రభుత్వానికి నిధులు సరిపోవడంలేదు. అవకాశానికి మించి అప్పులు తీసుకోవడంతో ఇక కొత్తగా అప్పులు పుట్టడం లేదు. నెలకో పథకానికి డబ్బు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం 3 నెలలుగా చెల్లింపులను వాయిదాలు వేస్తోంది. డ్వాక్రా మహిళలకు ఇచ్చే చేయూత పథకాన్ని మరో నెలకు పొడిగిస్తే, విద్యాదీవెన పథకంలో వాయిదా మాత్రమే చెల్లించారు. వసతి దీవెన గురించి మాట్లాడటం లేదు. అమ్మఒడి పథకాన్ని జూన్ నెలకు పొడిగించారు. క్షురకులకు, దర్జీలకు, రజకులకు ఆర్థిక సహాయం కింద ఇచ్చే చేదోడు, డ్రైవర్లకు ఇచ్చే వాహన మిత్ర పథకాల్లో చెల్లింపులు కూడా వాయిదాలు వేశారు. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగులు తమకు పీఆర్‌సీ, డీఏలు, ఇతర ఇన్‌సెంటివ్‌లు కావాలని కోరుతున్నారు. వీటికి పెద్ద మొత్తంలో నిధులు అవసరం. ప్రతినెలా వచ్చే జీఎస్టీ వసూళ్లు వీటికి సరిపోవు. అందువల్ల అదనపు నిధుల కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందుకు ప్రజల నుంచే సేకరించాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు పేదలకు ఇచ్చినట్లు పేర్కొంటున్న 52 లక్షల ఇళ్లకు పాత బకాయిలు రూ.14,400 వేల కోట్లు ఉండగా, వాటిని వన్ టైం సెటిల్‌మెంట్ కింద పంచాయతీల్లో రూ.10 వేలు, మున్సిపాలిటీల్లో రూ.15 వేలు, మున్సిపల్ కార్పొరేషన్‌ల పరిధిలో రూ.20 వేలు చెల్లిస్తే బకాయిలు రద్దుచేసి రిజిస్ట్రేషన్ కూడా చేస్తామని ప్రకటించింది. ఇలా వసూలుచేయడం ద్వారా రూ.4,400 కోట్లు సమకూర్చుకోవాలనేది లక్ష్యం. అలాగే మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీల్లో ప్లాన్‌లు లేకుండా నిర్మించిన భవనాలకు కూడా జరిమానాలు విధించడం ద్వారా కొంత మొత్తం వసూలు చేయాలని నిర్ణయించింది. ఈ బాధ్యతను రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్ అధికారులపై విధించారు.

**రిజిస్ట్రేషన్‌పై అనుమానాలు**

ప్రభుత్వం చేస్తామన్న రిజిస్ట్రేషన్ ప్రక్రియపై లబ్ధిదారులకు అనుమానాలున్నాయి. రిజిస్ట్రేషన్ సబ్ రిజిస్ట్రార్లతో చేయించడం లేదు. గ్రామ సచివాలయాల్లోనే పంచాయతీ కార్యదర్శులు, వార్డు అడ్మిన్‌లు ఈ ప్రక్రియ పూర్తి చేస్తారట. చట్ట ప్రకారం ఇవి ఎంతవరకూ చెల్లుబాటు అవుతాయన్నది ప్రశ్నార్థకమే. కానీ ప్రభుత్వం మాత్రం వారిని తాత్కాలిక రిజిస్ట్రార్లుగా గుర్తించి ఉత్తర్వులు జారీ చేసి పత్రాలు పంపిణీ చేసింది. పంచాయతీ కార్యదర్శులు చేసే రిజిస్ట్రేషన్ చెల్లుతుందా అనేది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రభుత్వం ఇవ్వబోతున్న రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు వాస్తవ రూపానికి దూరంగా ఉన్నాయి. మొత్తం ఏడు పేజీలు ఉండే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లో అసలు నిజమైన డాక్యుమెంట్ అని చెప్పుకునే ఒక్క లక్షణం కూడా లేదని నిపుణులు అంటున్నారు. ఆస్తి లావాదేవీకి చెందిన వ్యవహారం మాత్రమే రిజిస్ట్రేషన్ చేసే డాక్యుమెంట్లలో ఉండాలి. స్టాంప్ ప్రధాన పేజీతో పాటు ఇతర పేజీలన్నీ తెల్లగా ఉండాలి. కానీ ప్రభుత్వం ఇచ్చే పుస్తకంలో వైకాపా





# తప్పు వసూళ్లు



**తురగా నాగభూషణం**

ఉపయోగించే రంగులు, ముఖ్యమంత్రి జగన్ చిత్రం ప్రింట్ చేశారు. ఇదో వైకాపా పాంప్లెట్‌లా కనిపిస్తోంది. రిజిస్టర్ డాక్యుమెంట్‌కు ఉన్న నిబంధనలు దీనికి లేవు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న డాక్యుమెంట్ పేపర్లు ఎలా చెల్లుతాయని కూడా కొందరు ఆలోచిస్తున్నారు. గతంలో పంపిణీ చేసిన 30 లక్షల ఇళ్ల పట్టాల వ్యవహారంతో ఒకసారి భంగపడిన ప్రజలు దీనిని కూడా ప్రభుత్వ ప్రచార పటాటోపంతో పాటు డబ్బు గుంజే వ్యవహారంగా భావిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్లతో.. ఒర్జినల్ డాక్యుమెంట్లతో చేయించని రిజిస్ట్రేషన్లకు ఆ స్థలంపై సంపూర్ణ హక్కులు రావని, ఇలా తాత్కాలిక రిజిస్ట్రార్లతో, రిజిస్ట్రేషన్లతో పనులు చేయిస్తే వివాదాలు తప్పవని అంటున్నారు. నిబంధనలకు అనుగుణమైన డాక్యుమెంట్లతో సబ్ రిజిస్ట్రార్లతోనే రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తే పేదల్లో నమ్మకం ఉంటుంది. కాని ప్రభుత్వం మాత్రం ఎవరి మాట వినడం లేదు. అందుకే లబ్ధిదారులు సహకరించడం లేదు.

**ప్రభుత్వం ఒత్తిడి**

జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకాన్ని ఎలాగైనా అమలుచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకుంది. తహసీల్దారు, ఎంపీడీవో, గృహ నిర్మాణశాఖ ఏఈ, పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వో, వాలంటీర్ల వరకు అందరికీ ఓటీఎస్ వసూలు బాధ్యత అప్పగించారు. అయితే లబ్ధిదారుల్లో స్పందన కనిపించడం లేదు. తమకు గత ప్రభుత్వాలు ఇళ్లు లేదా స్థలాలు ఇచ్చాయని, ప్రభుత్వం ఇచ్చిన అరకొర నిధులకు తాము అప్పులుచేసి ఇళ్లు నిర్మించుకున్నామని, ఇప్పుడొచ్చి గృహ నిర్మాణసంస్థకు ఉన్న అప్పులు చెల్లించమనడం సరికాదంటున్నారు. కరోనాతో ఉపాధి కోల్పోయి ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నామని, ఈ దశలో వచ్చి డబ్బు చెల్లించమంటే ఎక్కడి నుంచి తెస్తామంటున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. అయినా ప్రభుత్వం వెనక్కి తగ్గడంలేదు. అన్నిరకాల దమననీతిని ప్రయోగిస్తోంది. బకాయిలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోకుంటే ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తామని హెచ్చరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మహిళల నుంచి ప్రతిఘటన ఉన్నచోట్ల మహిళా పోలీసులనూ వినియోగిస్తున్నారు. ఈ బలవంతపు వసూళ్ల వ్యవహారంపై రాజకీయ పార్టీల నుంచి వ్యతిరేకత రావడంతో ఇది స్వచ్ఛందంగా చేసే కార్యక్రమమని, ఎవరిపైనా ఒత్తిడి చేయడం లేదని అధికారులు అంటున్నారు. పథకాలు ఆపుతామని ఉత్తర్వులిచ్చిన ఒకరిద్దరు కిందిస్థాయి అధికారులపై చర్యలు తీసుకున్నారు.

**అధికారుల తాపత్రయం**

మరోవైపు ఓటీఎస్ కార్యక్రమాన్ని నిర్దేశించుకున్న సమయంలో పూర్తిచేయాలని అధికారులు తాపత్రయ పడుతున్నారు. ఎవరు త్వరగా పూర్తిచేస్తే వారికి ఎక్కువ మార్కులు పడతాయని ప్రభుత్వం హెచ్చరించడంతో ఎవరికివారు ఒత్తిడి పెంచారు. లబ్ధిదారులకు ఆయా ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గోడపత్రికలను, కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. స్వచ్ఛందం అంటూనే వివిధ మార్గాల్లో లబ్ధిదారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ పథకం ద్వారా వడ్డీ, అసలు రెండింటికి రాయితీ ఇచ్చి నిర్ణీత మొత్తాలు చెల్లించిన వారి ఇంటిపై సంపూర్ణ హక్కు కల్పిస్తామని హామీ ఇస్తున్నారు. ఆస్తిని అమ్ముకునేందుకు, తనఖా పెట్టుకునేందుకు వీలుగా 22(1) (ఏ) నిషేధిత జాబితా నుంచి తొలగించి ఎలాంటి యూజర్, స్టాంప్ చార్జీలు లేకుండా రిజిస్టర్ చేస్తామంటున్నారు. ఆర్థిక సంస్థలు, బ్యాంకు రుణాలకు జామీను కింద దఖలు పరుచుకునే వీలు ఉందన్నారు. త్వరపడాలని నానా విధాలుగా హెచ్చరిస్తున్నారు. నిర్దేశించిన మొత్తాన్ని చెల్లించిన వారికి రుణమాఫీతో పాటు ఇంటి రిజిస్టర్ దస్తావేజులు డిసెంబర్ 21 నుండి అందిస్తామన్నారు.

ఇప్పుడు ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి ఉన్న ఏకైక లక్ష్యం ఓటీఎస్ పథకంలో డబ్బు వసూలు చేయడమే. పర్యవేక్షణకు సచివాలయాల వారీగా మండలస్థాయిలోని ఇతర అధికారుల్ని ప్రత్యేక అధికారులుగా నియమించారు. ఉన్నతాధికారులు జిల్లాస్థాయిలో రోజుకు పలుదఫాలుగా టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ క్షేత్రస్థాయి సిబ్బందిపై ఒత్తిడి చేస్తున్నారు. ప్రతి సచివాలయం నుంచి రోజుకు కనీసం పది మంది లబ్ధిదారులతో డబ్బులు కట్టించాలని లక్ష్యంగా పెట్టారు. ఇవన్నీ మౌఖిక ఆదేశాలుగానే అధికారులు ఇస్తున్నారు. నిర్దేశించిన లక్ష్యంలో రోజుకు 10% సొమ్మును వసూలు చేయాలని ఆదేశాలున్నాయి. లబ్ధిదారుల నుంచి మూకుమ్మడిగా వ్యతిరేకత వ్యక్తంకాకుండా ఓటీఎస్ జాబితాను విడతల వారీగా విడుదల చేస్తున్నారు. డబ్బులు లేవని చెబుతున్న వారికి డ్వాక్రా సంఘాల ద్వారా అప్పు ఇప్పించి మరి వసూలు చేస్తున్నట్లు కొన్ని ప్రాంతాల్లో ప్రచారం జరుగుతోంది. లబ్ధిదారుల్లోని డ్వాక్రా మహిళల నుంచి ఓటీఎస్ రుసుం కట్టించే బాధ్యతను వెలుగు సిబ్బందికి అప్పగించారు. కొన్నిచోట్ల ఆసరా కింద ఇచ్చిన మొత్తాన్ని ఓటీఎస్‌కు కట్టిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆసరా మొత్తంతోపాటు మరికొంత బయట నుంచి అప్పు తెచ్చి కట్టారు. జాతీయ రహదారి పక్కన ఉన్న గ్రామాల ప్రజలు, గ్రామకంఠం, పోరంబోకు, ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు మాత్రం ఓటీఎస్ చెల్లించేందుకు ముందుకొస్తున్నారు. పట్టణాల పరిధిలోని వారూ కొంతమేర స్పందిస్తున్నారు.

ఓటీఎస్ వసూలు చేయని ప్రభుత్వ సిబ్బందిని అధికారులు, ప్రజాప్రతినిధులు అవమానిస్తున్నారు. చేతకాని వారిగా ఎంచి అగౌరవపరుస్తున్నారు. ముందుగా వసూళ్ల బాధ్యతను వీఆర్వోలకు అప్పగిస్తే వారు లబ్ధిదారులతో మాట్లాడినా ప్రయోజనం లేదు. డబ్బు కట్టేందుకు ఎవరూ ముందుకురాకపోవడంతో అధికారులే కాదు, స్వయానా మంత్రి అప్పలరాజు కూడా ఆగ్రహించారు. వీఆర్వోలపై ఇష్టారీతిన దుర్భాషలాడారు.

**నియంతృత్వ ధోరణి సరికాదు**

దశాబ్దాల క్రితం కూలీ నాలీ చేసుకొని కట్టుకున్న పేదల ఇళ్లకు ఇప్పుడు వన్ టైమ్ సెటిల్మెంట్ అంటూ ఒక్కొక్కరి నుంచి బలవంతంగా డబ్బు వసూలు చేయడం శోచనీయం. ఎవరైనా కట్టకపోతే వారి కుటుంబ సభ్యుల పింఛన్లు ఆపేస్తామని బెదిరించడం, ఆ ఇంట్లో డ్వాక్రా మహిళల ఖాతాల నుంచి మినహాయించుకుంటామనడం ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనం. ఒకపక్క తమ వద్ద డబ్బులు లేవంటున్న ప్రజలను ఎందుకు అనవసరంగా ఇబ్బంది పెడుతున్నారో ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలి. ప్రభుత్వానికి పేదలపై చిత్తశుద్ధి ఉంటే వారి అప్పులు మాఫీ చేసి ఆ ఇళ్లకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలి. పేదల నుంచి వసూలుచేసి మరల పేదలకే ఇవ్వడం సరికాదని అందరి వాదన.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**



# మోక్షానికి మార్గం.. ధనుర్మాస వ్రతం..

దేవాలయాల్లో జరిగే ఆగమ విహిత కైంకర్యాలలో స్థానిక ఆచార వ్యవహారాలు, ఇతర సంప్రదాయాలు కలగలసిన అంశాలలో ధనుర్మాసం ఒకటి. విష్ణు ఆలయాలలో ఉదయం పూట అర్చనలుచేసి, నివేదనలు చేసి వాటిని పిల్లలకు పంచుతారు. దీనిని బాలభోగం అని పిలుస్తారు. తిరుమలలో ధనుర్మాసం నెలరోజులు సుప్రభాతం బదులు తిరుప్పావై గానం చేస్తారు. సహస్రనామార్చనలో తులసీదళాలకు బదులు బిల్వపత్రాలను ఉపయోగిస్తారు. శయన బేరంగా ఈ ధనుర్మాసంలో రజిత శ్రీకృష్ణస్వామిని అర్చిస్తారు. ఇది తిరుమలలో జరిగే సంప్రదాయం.

ధనుర్మాసంలో ఉభయ సంధ్యలలో ఇల్లు శుభ్రం చేసి దీపారాధన చేయటం వల్ల మహాలక్ష్మీ అనుగ్రహం లభిస్తుంది. దరిద్రం దూరమవుతుంది. ఈ మాసంలో ప్రతిరోజు బ్రహ్మముహూర్తంలో తిరుప్పావై పారాయణం చేసినవారు దైవానుగ్రహానికి పాత్రులవుతారని శాస్త్రవచనం.

సాక్షాత్తూ భూదేవి, అవతారమూర్తి అయిన అండాళ్ రచించిన దివ్యప్రబంధమే తిరుప్పావై. వేదాలు, ఉపనిషత్తులసారమే తిరుప్పావై అని మన పూర్వాచార్యులు ప్రస్తుతించారు. ఉపనిషత్తులే గోదాదేవి నోట సర్వసులభరీతిలో వెలువడినాయనీ, తిరుప్పావై మహావిష్ణు పాదపద్మాలను అందు కోవటానికి మార్గదర్శకమని చెబుతారు. ఈ మాసంలో విష్ణువును మధుసూధనుడు అనే పేరుతో పూజించి, మొదటి పదిహేను రోజులు చక్కెర పొంగలి లేదా పులగం నైవేద్యంగా సమర్పించాలి. తర్వాత పదిహేను రోజులు దద్యోజనం అర్పించాలి. పెళ్లీడు అమ్మాయిలు ఇళ్లముందు ముగ్గులు, గొబ్బిళ్లతో పూజలు చేయటం వల్ల కోరిన వరుడు లభిస్తాడు. ఈ వ్రతం వల్ల మోక్షం సిద్ధిస్తుంది. శ్రీకృష్ణునికి ధనుర్మాసం నెలరోజులూ తులసీమాల సమర్పించే యువతులకు, నచ్చిన వరునితో వివాహం జరుగుతుంది.

విష్ణుచిత్తుడి కుమార్తెయైన గోదాదేవి మానవ మాత్రులని కాక రంగనాథుడినే వివాహం చేసు కుంటానని దీక్ష బూనుతుంది. ఆ కారణంగా ఆమె ధనుర్మాసంలో వేకువనే లేచి నిత్యం విష్ణుపూజ చేస్తూ తనకి కలిగిన అనుభవాన్ని, భావాన్ని ఒక పద్యం అనగా పాశురం రూపంలో రచించేది. అలా 30 పాశురాలను ఆ మాసంలో రచించి వాటిని విష్ణువుకు అంకితంచేసింది. వెంటనే విష్ణువు ప్రత్యక్షమై ఆమెను శ్రీరంగం రమ్మని చెప్పగా.. ఆమె కోరికపై తండ్రి

ధనుర్మాస వ్రతం గురించి మొదట బ్రహ్మ దేవుడు నారద మహర్షికి వివరించినట్లు పురాణ కథనం. ధనుర్మాస వ్రతానికి సంబంధించిన అంశాలు బ్రహ్మాండ, ఆదిత్య పురాణాల్లో, భాగవతంలో, నారాయణ సంహితలో కనిపిస్తాయి.

గోదాదేవిని తీసుకొని శ్రీరంగం చేరి రంగనాథ స్వామితో వివాహం జరిపిస్తాడు. వివాహం జరిగినంతనే గోదాదేవి రంగానాథుని పాదాల చెంత మోకరిల్లి స్వామిలో కైంకర్యం అయిపోతుంది.

ధనుర్మాస వ్రతం గురించి మొదట బ్రహ్మ దేవుడు నారద మహర్షికి వివరించినట్లు పురాణ కథనం. ధనుర్మాస వ్రతానికి సంబంధించిన అంశాలు బ్రహ్మాండ, ఆదిత్య పురాణాల్లో, భాగవతంలో, నారాయణ సంహితలో కనిపిస్తాయి. ఈ వ్రతం ఆచరించాలనుకునేవారు శక్తిమేరకు విష్ణుప్రతిమని తయారుచేయించి, పూజాగృహంలో ప్రతిష్టించు కోవాలి. ప్రతిరోజూ సూర్యోదయానికి ముందు లేచి, స్నానాదికాలు ముగించాలి. పంచామృతాలతో శ్రీమహావిష్ణువును అభిషేకించాలి. అభిషేకానికి శంఖం ఉపయోగించడం మంచిది. తర్వాత తులసీ దళాలు, పూలతో అష్టోత్తర సహస్రనామాలతో స్వామిని పూజించి నైవేద్యం సమర్పించాలి. ఈ నెలరోజులూ విష్ణుకథలు చదవాలి. తిరుప్పావై పఠించాలి. నెలరోజులూ చెయ్యలేనివారు పదిహేను రోజులు, 8 రోజులు లేదా కనీసం ఒక్కరోజైనా ఆచరించవచ్చు.

ధనుర్మాస వ్రతం వల్ల ఇహలోక సుఖాలు, పరలోక మోక్షం పొందుతారు. ఆత్మ పరమాత్మను చేరడానికి ఉపకరించేదే ధనుర్మాస వ్రతం. ప్రాచీన కాలం నుంచి భారతీయులందరూ ఈ వ్రతాన్ని ఆచరి స్తున్నారు. భక్తిమార్గం చేత భగవంతుని సులభంగా వశపరచుకోవచ్చనీ నిరూపించిన ఆరాధన తపస్విని గోదాదేవి తన పాశురాలలో చివరి పాశురంలో సూచించిన విధంగా తిరుప్పావై పారాయణం చేసిన వారికి; తిరుప్పావై గానం, శ్రవణం చేసినవారికి ఆయురారోగ్యాలూ, అష్టైశ్వర్యాలూ కలుగుతాయి.

**నైవేద్యం ప్రత్యేకత**

ఈ మాసంలో వేకువనే చేసే పూజలో ప్రసా దంగా పులగం, పాయసం, దద్యోజనం సమర్పిస్తారు. చలికాలంలో కడుపులో జఠరాగ్ని పెరిగి తద్వారా ఆకలి పెరుగుతుంది. ఈ జఠరాగ్ని సాత్వికాహారం తీసుకోవడం వల్ల చల్లబడుతుంది. పాలు, పెరుగు, పెసరపప్పులలో చలువ చేసే గుణం ఉన్నందువలన ప్రసాదంగా వాటిని వినియోగిస్తారు. ఆయుర్వేదం, జ్యోతిష్యం ప్రకారం ఈ ఆహారం తీసుకోవడం వలన సత్వగుణం అలవడి సత్ఫలితాలు కలుగుతాయి.

రవి ధనురాశిలో ప్రవేశించి మకరంలోకి వెళ్లే సమయమే ధనుర్మాసం. ధనుస్సు, మీనంలో రవి ఉన్నప్పుడు రవి రాశి అయిన బృహస్పతిలో ఉన్నప్పుడు ఏ శుభకార్యమూ జరపకూడదు. కేవలం పండుగ వాతావరణంతో అంతా సంతోషంగా, ప్రశాంతంగా ఉండగలుగుతారు. ఈ మాసంలో ఎక్కువగా సూర్య పూజలు చేస్తారు.

గొబ్బెమ్మలు ఎందుకు పెడతారు? ఇంటిముందు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి వాటిని బియ్యంపిండి, పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి పూజిస్తారు. నిత్యం ముగ్గులు వేయడం వలన స్త్రీలకు మంచి వ్యాయామం కలుగుతుంది.

**తిరుప్పావై అంటే?**

తిరుప్పావై ఒక అద్భుత వేదాంత గ్రంథం. భగవంతుని సులభంగా అందించగలిగే సాధనా మార్గం. 'తిరు' అంటే శ్రీ అని, 'పావై' అంటే పాటలు లేక వ్రతం అని అర్థం. కలియుగంలో మానవకన్యగా జన్మించి గోదాదేవిగా ప్రఖ్యాతమైన ఆండాళ్ భగవంతుడినే తన భర్తగా భావించి, ఆయన్ను చేపట్టడానికి సంకల్పించిన వ్రతమే తిరుప్పావై వ్రతం. తిరుప్పావైలో పాశురాలు ఉంటాయి. పాశురం అంటే ఛందోబద్ధంగా ఉన్న పాటలు. ఆండాళ్ అపురూప భక్తి పారవశ్యాన్నే శ్రీకృష్ణ దేవరాయలు ఆముక్తమాల్యద అనే గ్రంథంగా అందించారు.

తిరుప్పావై వ్రతానికి కొన్ని విధివిధానాలు ఉన్నాయి. వేకువజామునే నిద్రలేచి స్నానం చేయాలి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా స్వామి కీర్తనలను, తిరుప్పావై పాశురాలను ఆలపించాలి. పేదలకు దానాలు, పండితులకు సన్మానాలు చేయాలి. స్వామికి, ఆండాళ్‌కు ఇష్టమైన పుష్పకైంకర్యం చేయాలి. ప్రతిరోజూ స్వామివారికి పొంగలి నివేదించాలి. సృష్టిలో భగవంతుడొక్కడే పురుషుడు, మానవు లందరూ స్త్రీలు అనే ఉద్దేశంతోనే విష్ణుమూర్తిని శ్రీవారు అని సంబోధిస్తుంటారు. అటువంటి విష్ణుమూర్తిని భర్తగా పొందాలనే తలపుతో గోదాదేవి ధనుర్మాసంలో చేసిన ఈ వ్రతాన్ని నేటికీ మనం ఆచరిస్తున్నాం. ధనుర్మాసం మొదటిరోజున ఈ వ్రతాన్ని ఆరంభించి, భోగిరోజున ఆండాళ్, శ్రీరంగనాథుల కల్యాణం జరిపించడంతో ఈ వ్రతం ముగుస్తుంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

## భూదేవియే ఆండాళ్

శ్రీవైష్ణవ సంప్రదాయం ప్రకారం భక్తిసాగరంలో మునిగితేలినవారిని 'ఆళ్వారులు' అంటారు. పన్నెండుమంది ఆళ్వారుల్లో విష్ణుచిత్తుడు మొదటివాడు. ఆయన గోదాదేవికి భక్తిసంపదలను వారసత్వంగా ఇచ్చారు. నిజానికి భూదేవియే ఆండాళ్ అని చెప్తారు. జనకమహారాజు భూమిని దున్నే సమయంలో సీతామాత దొరికింది. అలాగే శ్రీరంగనాథునికి పుష్పకైంకర్యం కోసం విష్ణుచిత్తులవారు తులసితోట సాగుచేస్తుండగా ఆండాళ్ దొరికింది. భగవంతుని తప్ప ఇతరులను సేవించడానికి వినియోగం కాని తులసి వనంలో ఆండాళ్ దొరకడాన్ని గమనిస్తే సీతాదేవి ఆండాళ్ భూదేవి అంశయే అన్న సంగతి అర్థమవుతుంది. ఆండాళ్ అసలు పేరు కోదై. 'కోదై' అంటే మాలిక. ఆ పేరే క్రమంగా గోదాగా మారింది. ఆ గోదాదేవి రచించిన 30 పాశురాలలో ఏయే అంశాలు ఉన్నాయో తెలుసుకోవాలనే ఆసక్తి అందరికీ ఉంటుంది. 30 పాశురాలలోని అంశాలు స్థూలంగా మంచిని ప్రబోధిస్తాయి. మంచి అలవాట్లతో జీవించమని, తోటివారికి సాయపడమని, భగవంతుని తప్పనిసరిగా ఆరాధించమని ఈ ప్రబోధాలు సూచిస్తాయి.



ధారావాహిక



# నేతాజీ 23

# తెలియనిచోటికి సాహసయాత్ర

అది ఓపెన్ ఎయిర్ థియేటర్. ఝాన్సీ రాణి లక్ష్మీబాయి వీరగాథ నాటకాన్ని చూడవచ్చిన మూడువేల మంది ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికులతో, 500 మంది మహిళా రెజిమెంట్ అమ్మాయిలతో ఆగస్టు 14 రాత్రి కిక్కిరిసి ఉంది. సుభాస్ చంద్ర బోస్ అనుకున్నదాని కంటే ముందే అక్కడికి చేరుకున్నాడు. ప్రియతమ నాయకుడిని చూడగానే హర్షాతిరేకంతో చప్పట్లు, జయజయ ధ్వానాలు మారుమోగాయి. మహిళా రెజిమెంట్ అమ్మాయిలు ప్రదర్శించిన చక్కని నాటకం అందరినీ ఆకట్టుకుంది. వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి ధైర్యం, శౌర్యం అక్కడ చేరిన ప్రతి ఒక్కరికీ గొప్ప ఉత్తేజాన్ని ఇచ్చింది. ప్రదర్శన పూర్వగానే అన్ని వేల మందీ లేచి ఒక్క గొంతుతో 'శుభ్ సుఖ్ చెయిన్...' జాతీయగీతాన్ని ఒక్క గొంతుతో ఆలపించారు. బోస్ పాల్గొన్న ఆఖరి పబ్లిక్ ఫంక్షన్ అదే.

నాటకం మధ్యలో ఉండగా ఆజాద్ హింద్ ప్రభుత్వ న్యాయ మంత్రి ఎ.ఎన్. సర్కార్ బాంగ్‌కాక్ నుంచి విమానం దిగి నేరుగా అక్కడికి వచ్చాడు. సుభాస్ బోస్ అతడిని పక్కన కూచోబెట్టుకుని నాటకం అయ్యాక తనతో బాటు బంగాళాకు తీసుకువెళ్ళాడు. డిన్నర్ కాగానే రోజూలాగే మంత్రిమండలి సమావేశం మొదలైంది.

సైనిక పోరాటంలో సుభాస్ చంద్ర బోస్ కున్న ప్రధాన ఆలంబనం జపాన్. అదికాస్తా లొంగిపోయాక పరిస్థితి దారుణంగా విషమించింది. బ్రిటిష్ సామ్రాజ్యానికి బోస్ మీద పీకల దాకా కోపం ఉంది. అతడిని తమకు అప్పగించమని జపాన్ మీద మిత్రరాజ్యాల ఒత్తిడి ఎక్కువైంది. అతడు చేతికి చిక్కితే చాలు వార్ క్రిమినల్ గా పరిగణించి, నామరూపాలు లేకుండా చేయాలని బ్రిటిషు పాలకులు మహా మంట మీద ఉన్నారు. రేపో మాపో సింగపూర్‌లోకి బ్రిటిషు సేనలు రాబోతున్నాయి. పోరాటం కొనసాగించ దలచుకుంటే బోస్ ఇంకా సింగపూర్లో – ఆ మాటకొస్తే ఆగ్నేయాసియాలో – ఉండటం ప్రమాదం.

మొత్తం అక్షకూటమి కుప్పకూలిన స్థితిలో బ్రిటిష్ సామ్రాజ్యం పంజాకు అందకుండా పోరాటం కొనసాగించాలంటే ఆదుకోలిగింది, ఆశ్రయించ వలసినది సోవియట్ రష్యానే. జపాన్ మిలిటరీకి అది బొత్తిగా ఇష్టం లేదు. ఆ దిశగా బోస్ చేసిన ప్రయత్నాలను జపాన్ పాలకులు ప్రతిసారీ అడ్డం కొట్టారు. అయినా జపాన్ సైనిక, ప్రభుత్వవర్గాలలో సుభాస్ చంద్ర బోస్ అభిమానులు, శ్రేయోభిలాషులు బాగానే ఉన్నారు. వారి ద్వారా అనుకున్నది సాధించటానికి ఆయన బహు గోప్యంగా ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. ఇంకా జపాన్ అధీనం లోనే ఉన్న మంచూరియాలో రష్యన్ సరిహద్దుకు చేరువలో బోస్‌ను వదిలిపెట్టేట్టు, అక్కడి నుంచి ఆయన సొంత రిస్కుపై ఎలాగో రష్యా చేరుకునేట్టు రహస్య ఒప్పందమైతే కుదిరింది. ఎలాగైనా మాస్కోను ప్రసన్నం చేసుకుని, ఆజాద్ హింద్ ప్రభుత్వాన్ని అక్కడ నుంచి నడపాలని బోస్ ఆశ. సోవియట్లతో మిలిటరీ పొత్తు కుదుర్చుకుని, ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దు గుండా ఐఎన్ఏ ఇండియాలోకి ప్రవేశించాలని ఆయన ప్రణాళిక.

అది ఎంతవరకు నెరవేరుతుందో దేవునికెరుక. ఆ లోగా రహస్యం బయటికి పొక్కితే మొదటికే మోసం. పెదవి దాటితే పృథివి దాటుతుంది. కాబట్టి తన మనసులో ఏముందో ఏ ఒక్కరికీ తెలియకుండా బోస్ జాగ్రత్తపడ్డాడు. తన మంత్రులు, సహచరులు ఏ సలహా ఇచ్చినా చూద్దాం, చేద్దాం, ఆలోచిద్దాం అంటూనే ఉన్నాడు. అందరి మాటా వింటున్నట్టే కనపడ్డాడు.

ఆగస్టు 12వ తేదీన బోస్ సింగపూర్‌కు వచ్చినప్పటి నుంచీ కేబినేట్ రోజూ కలుస్తూనే ఉంది. అప్పటిదాకా ఏకాభిప్రాయం ఏమిటంటే బ్రిటిష్ సేనలు వచ్చేసరికి మిగతా మంత్రులతో బాటు నేతాజీ కూడా సింగపూర్‌లో ఉండిపోవాలని. నేతాజీ తెల్లవారికి చిక్కకూడదని మొదట్లో మంత్రులు అభిప్రాయపడ్డారు. ఆయన వినలేదట. ఏమైనా కానీ నేను ఇక్కడే ఉంటాను అని ఆయన పట్టుబట్టేసరికి సరే అలాగే కానిద్దాం అనుకున్నారట!

నేతాజీని ఖైదీగా పట్టుకుని మాత్రం బ్రిటిషువారు ఏమి చేయగలరు? మలయాలోనో, తూర్పు ఆసియా లోనో, భారత దేశంలోనో రాజద్రోహ అభియోగం మోపి విచారణ జరుపుతారు. మహా అయితే మరణ శిక్ష వేస్తారు. అది అమలు జరిగిన మరుక్షణం బ్రిటిషు సామ్రాజ్యానికి కాలం మూడుతుంది. ఇండియాకు స్వాతంత్ర్యం వచ్చి తీరుతుంది. శిక్షించే ధైర్యం లేక ఆయనను విడిచి పెడితే ఎక్కడ ఉన్నా ఆయన స్వాతంత్ర్య పోరాటం కొనసాగిస్తాడు. ఏ రకంగా చూసినా నేతాజీ ఖైదీగా చిక్కటం బ్రిటిషువారికి కాదు – మనకే లాభం అన్నది అప్పటిదాకా మంత్రిమండలి భావన. జనరల్ కియానీ వంటి సైన్యాధికారులూ అలాగే అనుకుంటున్నారు. 'వార్ క్రిమినల్' గా గుర్తించబడిన బోస్ వంటి ముఖ్య శత్రువులను ఏ విచారణ లేకుండా కాల్చివేయాలని బ్రిటన్ నిర్ణయించిన సంగతి బహుశా వారికి తెలియదు.

నాటకం నుంచి తిరిగి వెళ్ళాక 14 వ తేదీ రాత్రి సమావేశంలోనూ ఈ విషయం మళ్లీ ప్రస్తావనకు వచ్చింది. నేతాజీ ఎట్టి పరిస్థితుల్లోనూ బ్రిటిషువారికి చిక్కకూడదని సహాయ్ గట్టిగా వాదించాడు. (నేతాజీని అరెస్టు చేసి, విచారణ జరిపి మరణశిక్ష వేసినా ఉద్యమానికి మంచిదే. కాని మూడో కంటికి తెలియకుండా కాల్చేసి, ఏమీ ఎరగనట్టు బ్రిటిష్ సర్కారు బుకాయిస్తే ఎలా అని అతడి వాదన.) దాంతో అందరిలోనూ పునరాలోచన మొదలైంది. అప్పటిదాకా అందరితోబాటు తానూ సింగపూర్‌లోనే ఉండి బ్రిటిష్ సైన్యాన్ని ఎదుర్కొంటా నని చెప్పిన నేతాజీ కూడా ఆ రాత్రి సుదీర్ఘ చర్చ తరవాత 'కొంచెం' మెత్తబడ్డాడట!! అప్పటికే తెల్లవార వస్తున్నది. అందరి కళ్లూ కూరుకుపోతు న్నాయి. తుది నిర్ణయం మరునాడు తీసుకుందామని అనుకుని సమావేశం ముగించారు.

దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికులకు సముచిత స్మారకస్థూపం కట్టించాలని బోస్ అంతకుముందే సంకల్పించాడు. "Memorial to the unknown soldier of Azad Hind Fouj" పేర అజ్ఞాత అమరవీరులకు సింగపూర్లోని కన్నాట్ డ్రైవ్ సముద్ర తీరాన జూలై 8న పునాదిరాయి కూడా వేశాడు. "Unity, Faith and Sacrifice" (ఐకమత్యం, విశ్వాసం, త్యాగం) అనే ఆజాద్ హింద్ ఫౌజ్ మోటోను ఆ ఫలకం మీద చెక్కించాడు. వార్ మెమోరియల్‌కు రూపకల్పన చేసి నిర్మించే బాధ్యతను కల్నల్ సిరిల్ జాన్ స్ట్రేసి అప్పగించాడు. ఆగస్టు 15 ఉదయం స్ట్రేసీకెప్టెన్ మాలిక్‌తో కలిసి వచ్చి అర



ఎం.వి.ఆర్. శాస్త్రి

డజను నమూనాలు, డిజైన్లు బోస్‌కు చూపించాడు.

బ్రిటిష్ సేనలు ఏ క్షణమైనా సింగపూర్ దీవిలో అడుగుపెట్టనున్న సమయంలో అమరవీరులకు స్మారక చిహ్నం కట్టించే సాహసం సుభాస్ చంద్ర బోస్‌కే చెల్లింది. తన ముందు పెట్టిన నమూనాలను, డిజైన్లను పరీక్షించి ఖరారు చేశాక "కల్నల్ స్ట్రేసీ! బ్రిటిషు వాళ్లు ఇక్కడ అడుగుపెట్టేలోగా ఈ స్మారక చిహ్నం నిర్మాణం జరగాలి. అది మీవల్ల అవుతుందా?" అని అడిగాడు నేతాజీ.

"తప్పకుండా సర్!" అని నమ్మకంగా చెప్పాడు స్ట్రేసీ. తాను పైన వేసుకున్నది ఎంత మహా భారమో అతడికి తెలుసు. అనుకున్న సమయానికల్లా పని సరిగా చేసిపెట్టే కాంట్రాక్టరును చూసుకోవాలి. కావలసిన సామగ్రి సమకూర్చుకోవాలి. మంచి పనివాళ్లను మాట్లాడుకోవాలి. ఇప్పుడు మొదలుపెట్టి వేగంగా కానిస్తే నిర్మాణం పూర్తయ్యేందుకు కనీసం రెండు వారాలు పడుతుంది. అంత వ్యవధి ఉన్నదా? ఆ లోపే బ్రిటిష్ సేనలు ఊడిపడితే పని ఆపెయ్యవలసిందే. స్ట్రేసీ అవేవీ ఆలోచించలేదు. ఏది ఏమైనా స్మారక చిహ్నం వెలసి తీరాలన్న తహతహ నేతాజీ కళ్లలో అతడికి కనిపించింది. ఉద్వేగం పొర్లుకొచ్చింది. అనుకున్నది చేసి తీరుతానన్న దృఢ విశ్వాసంతో నేతాజీ కళ్లలోకి సూటిగా చూసి స్మార్ట్ గా నిలబడి 'జైహింద్' అంటూ సెల్యూట్ చేసి నిష్క్రమించాడు. మళ్లీ అతడు బోస్‌ని కలవలేదు. రేయింబవళ్లు కష్టపడి మూడువారాల్లో స్మారకచిహ్నం నిర్మాణం పూర్తి చేయించాడు. మౌంట్ బాటెన్ సైన్యం సింగపూర్ కు వచ్చీ రాగానే చేసిన మొదటి పని డైనమైట్లతో ఆ మెమోరియల్ ను కూల్చటమే! (తరవాతెప్పుడో పి.వి.నరసింహారావు హయంలో 1945లో సింగపూర్ ఎస్ప్లనేడ్ పార్కు లో ఆ మెమోరియల్ స్మారకార్థం అదే చోట ఒక మార్కర్ నిర్మించారు.)

ఆగస్టు 15 మధ్యాహ్నం జపాన్ లొంగుబాటు నిర్ణయాన్ని టోక్యో రేడియో అధికారికంగా ప్రకటించింది. తరవాత కథాక్రమం ఎస్.ఎ. అయ్యర్ వివరిస్తాడు వినండి:

"ఆ రాత్రి డిన్నర్ తరవాత 10 గంటలకు మొదటి అంతస్తు వరండాలో అందరం చేరి మూడింటివరకూ మాట్లాడుకున్నాం. నేతాజీ సింగపూర్ నుంచి బయటపడాలని అందరం నిశ్చయించి అతికష్టం మీద ఆయనను ఒప్పించాం. ఆయన ఎక్కడికి వెళ్లాలి అన్నది తరవాత ప్రశ్న. ఇండో చైనాకా? జపాన్‌కా? మంచూరియాకా? రష్యాకా?ఎక్కడికన్నది తరవాత ముచ్చట. ముందు మలయా నుంచి వెళ్లిపోవాలి. ఏదో ఒక రష్యా పాలిత ప్రాంతాన్ని చేరుకోవాలి. వీలయితే రష్యాకే వెళ్లాలి. థాయిలాండ్‌కో, ఇండో చైనాకో వెళ్లి బ్రిటిషు మిలిటరీకి పట్టుబడటంలో అర్థం లేదు. జపాన్ సరెండర్ అయ్యాక జపాన్ వెళ్లటం దండుగ. నేతాజీ తానే వర్ణించినట్టు ఈ 'తెలియని చోటికి సాహసయాత్ర' (Adventure into the unknown)లో ఉన్న రిస్కు మాటేమిటి? జపాన్ లొంగిపోయాక జపాన్ విమానంలో ప్రయాణం ఎంతవరకు క్షేమం? మధ్యలో ఏమైనా అయితే...? ఇదే మాట నేను అడిగితే– 'ఏమైనా కానీ! జరిగేది జరిగే తీరుతుంది' అన్నాడు నేతాజీ.

గడియారం 3 కొట్టింది. ఇక తుది ఏర్పాట్లు మిగిలాయి. వీలయితే మాస్కోకు, లేదా మంచూరియాకు వెళ్లాలని ఆలోచన. నేతాజీ వెంట ఎవరు వెళ్లాలి? ఆ చిట్టచివరి ఇన్ఫార్మల్ మీటింగులో నేతాజీ కాక మేజర్ జనరల్ కియానీ, మేజర్ జనరల్ అలగప్పన్, కల్నల్ హబీబుర్ రహమాన్, ఎ.ఎన్. సర్కార్, నేను ఉన్నాము. తాను వెళ్లాక సింగపూర్లో ఉండి ఐఎన్ఏ వ్యవహారాలన్నీ చూసుకోవలసిన



బాధ్యత కియానీదని నేతాజీ చెప్పాడు. మిగతా పనులు చక్కబెట్టటానికి అలగప్పన్, సర్కార్‌లను కూడా సింగపూర్‌లో ఉండిపొమ్మన్నారు. హబీబుర్ రహమాన్ కేసి చూసి 'నువ్వు నాదో వస్తావా?' అని నేతాజీ అడిగాడు. 'ఎస్‌సర్' అని అతడు బదులిచ్చాడు. మరికాసేపట్లో అక్కడికి చేరుకోనున్న మేజర్ స్వామి కాక సింగపూర్ నుంచి కల్నల్ ప్రీతమ్ సింగ్, మేజర్ ఆబిద్ హుస్సేన్, బాంగ్ కాక్ నుంచి దేవనాథ్ దాస్ కూడా తన వెంట వస్తారని నేతాజీ అన్నాడు. తరవాత 'అయ్యర్ సాబ్! నీ మాటేమిటి?' అని నన్ను అడిగాడు. 'సర్! నాకు మలయా అయినా మాస్కో అయినా ఒక్కటే. నేనూ మీతో వస్తాను' అని నేనన్నాను. అలా అన్నీ సెటిల్ అయ్యాయి. ఇంకో రెండు మూడు గంటల్లో బయలు దేరాలి. నేను వెళ్లి మంచం మీద పడ్డాను. నేతాజీ కంటికి కునుకు లేకుండా అందరికీ అప్పగింతలు చేస్తూ తెల్లవార్లూ పనిచేస్తూనే ఉన్నాడు.

16 వ తేదీ ఉదయం మేము బయలుదేరాము. నేతాజీకి 'జై హింద్'తో వీడ్కోలు ఇవ్వటానికి కియానీ, మరికొందరు ఏరోడ్రోమ్‌కు వచ్చారు. బాంబర్ విమానంలో 10 గంటలకు సింగపూర్ వదిలి, మధ్యాహ్నం 3 గంటలకు బాంగ్ కాక్ చేరాము. మేము వస్తున్నట్టు అక్కడ ఎవరికీ ముందుగా తెలియదు. ఆలస్యంగా సమాచారం అందిన మేజర్ జనరల్ భోంస్లే మేము విమానం దిగిన రెండు గంటల తరవాత వాహనాలు తీసుకుని ఏరోడ్రోమ్‌కు పరుగున వచ్చాడు.

నేతాజీ వచ్చాడన్న వార్త బాంగ్ కాక్ నగరమంతా పాకింది. ఆ సాయంత్రం నుంచి మరునాడు తెల్లవారే వరకూ ఆయనను కలిసేందుకు ఐఎన్ఎ ఆఫీసర్లు, ఐఐఎల్ ప్రముఖులు, భారతీయ వ్యాపారులు, ఇతరులు ప్రవాహంలా వస్తూనే ఉన్నారు. మేము బస చేసిన భవనం కాలుబెట్ట సందు లేకుండా విజిటర్లతో కిక్కిరిసి పోయింది. నేతాజీ తదుపరి కార్యాచరణ ఏమిటో తెలుసుకోవాలని అందరికీ కుతూహలం. మేము రాత్రి ఏదో కాస్త తినే సరికి అర్ధరాత్రి అయింది. ఐఎన్ఎ, లీగ్ అధికారులతో బోస్ వివరంగా మాట్లాడాడు. ఇప్పుడు తప్పనిసరై సరెండర్ అవుతున్నంత మాత్రాన మనం స్వాతంత్ర్య పోరాటాన్ని వదిలేసినట్టు కాదు. దాన్ని తప్పక కొనసాగిస్తాం. మీరు గుర్తు పెట్టుకోవలసింది

ఓటమిని కాదు.. మనం సాధించిన విజయాలను' అని ఐఎన్ఎ ఆఫీసర్లను ఉద్బోధించాడు. తరవాత ఉదయం 5 గంటలకు పక్క మీద వాలి ఒక గంట రెస్టు తీసుకున్నాడు. (ఆగస్టు 17 వ తేదీ) పొద్దున్నే తేలికపాటి లగేజి తీసుకుని, బెల్టుకి రివాల్వర్ బిగించి అందరం బయలుదేరాం. నేతాజీ విడిది వద్ద చేరిన ప్రతి ఒక్కరినీ నీళ్లు నిండిన కళ్లతో ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నాడు.

ఉదయం 8 గంటలకు మేము రెండు విమానాల్లో బాంగ్ కాక్ నుంచి సైగాన్‌కు బయలుదేరాం. మొదటి విమానంలో నేతాజీ, కల్నల్ హబీబ్, కల్నల్ ప్రీతమ్ సింగ్, జపనీస్ లైజాన్ ఆఫీసరు, నేను ఉన్నాము. రెండో దానిలో జనరల్ ఇసోడా, జపాన్ ప్రభుత్వ రాయబారి హచియ, కల్నల్ గుల్జారా సింగ్, మేజర్ ఆబిద్ హుస్సేన్, దేవనాథ్ దాస్ ఉన్నారు. మేము సైగాన్ చేరేసరికి 10 అయింది. తరవాత జరగ వలసినదాని గురించి జపాన్ అధికారులతో నేతాజీ మాట్లాడాడు. జనరల్ ఇసోడా, ప్రభుత్వ ప్రతినిధి హచియ ఆగ్నేయాసియాలో జపాన్ సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ తెరౌచీ హెడ్ క్వార్టర్స్ ఉన్న దాలత్‌కు ముందుగా విమానంలో వెళ్లి నేతాజీ తదుపరి ప్రయాణానికి విమాన సదుపాయాల ఏర్పాటు గురించి మాట్లాడాలని నిర్ణయమైంది. వారు అటు వెళ్లారు. మేము రెండు కార్లలో వెళ్లి సైగాన్ ఊరుబయట స్థానిక ఐఐఎల్ సెక్రటరీ నివాసంలో బస చేశాం.

ఆ రోజు మధ్యాహ్నం ఇసోడా, హచియ, తెరౌచీ కార్యాలయ అధికారి కలిసి కారులో చాలా స్పీడుగా మేమున్న చోటికి వచ్చారు. నేతాజీ ఒక గది లోకి వారిని తీసుకు వెళ్లాడు. హబిబుర్ రహమాన్ ను కూడా లోపలికి పిలిచాడు. తలుపులు మూసి వారితో మాట్లాడాడు. వారు ఏమి మాట్లాడుకున్నారో నాకు తెలియదు. వచ్చిన వారిని లోపలే ఉంచి నేతాజీ మధ్యలో హబీబ్‌తో కలిసి విసురుగా బయటికి వచ్చి మమ్మల్ని అర్జెంటుగా రమ్మని కేకేశాడు. నన్ను, ఆబిద్, దేవనాథ్, ఆబిద్, హబీబ్‌లను తన గదిలోకి తీసుకువెళ్ళి తలుపు గడియపెట్టాడు. ఆ సమయాన గుల్జారా సింగ్, ప్రీతమ్ సింగ్‌లో పక్క ఇంట్లో ఉన్నారు. వారిని అర్జెంటుగా రమ్మని కబురు చేశాడు. 'బట్టలు మార్చుకోనక్కరలేదు. ఉన్నవాళ్లు ఉన్నట్టు రమ్మను. ముఖ్య విషయం మాట్లాడాలి. టైము లేదు' అని నొక్కి చెప్పాడు. వారు వచ్చేదాకా అసహనంతో వేచి ఉన్నాడు. నేతాజీని అంత కంగారుగా నేను ఎప్పుడూ చూడలేదు. ఆ ఇద్దరూ పరుగున రావటానికి కొద్ది నిమిషాలు కూడా పట్టలేదు. ఆ లోపే 'ఇంకా రాలేదేం' అని నేతాజీ చికాకుపడ్డాడు. వాళ్లు రాగానే మళ్లీ తలుపులు గడియపెట్టాడు.

మేమందరంఆత్రంగా నేతాజీ చుట్టూ చేరాం. ప్రతిఒక్కరి మొహం కేసి ఒకసారి చూసి, 'చూడండి. మనం ఇప్పుడు ఒక ముఖ్య నిర్ణయం తీసుకోవాలి. అది కూడా కొద్ది క్షణాల్లోనే! మరి కాసేపట్లో ఒక విమానం బయలుదేరబోతున్నది. అందులో ఒకటే సీటు మనకు దొరికింది. కనీసం ఇంకొకటి కావాలని నేను అడిగాను. కాని వాళ్లు కుదరదంటున్నారు. మనం వెంటనే తేల్చుకోవాలి. ఉన్న ఆ ఒక్క సీటులో నేను ఒంటరిగా వెళ్లనా? వద్దా? మీరు ఏమంటారు?' అని అసహనంగా అడిగాడు.

మాకు నోట మాట రాలేదు. అంత భయంకర మైన నిర్ణయం చేయవలసి వస్తుందని ఎవరం కలనైనా ఊహించలేదు. ఎక్కడికో తెలియని ప్రయాణానికి తోడు ఎవరూ లేకుండా ప్రియతమ నాయకుడు ఒక్కడినే పంపటానికి ఎవరికీ ధైర్యం చాలలేదు. 'సర్! మిమ్మల్ని ఒక్కరిని ఎలా వెళ్లమనగలం? కనీసం ఇంకొక్క సీటు ఇవ్వమని అడగండి. మాలో ఒకరిని దయచేసి వెంట తీసుకువెళ్లండి.' అని ఒకరు ప్రాధేయపడ్డారు. మా అందరికీ జపాన్ వాళ్ల మీద చాలా కోపం వచ్చింది. బాంబర్ విమానంలో చోదక సిబ్బందిగాక కనీసం ఆరుగురికి చోటు ఉంటుంది. వారు తలుచుకుంటే ఇంకొక్కరికి చోటు ఇవ్వలేరా? అంతటి మహా నాయకుడిని ఒంటరిగా పంపుతారా?

'మాట్లాడే సమయం లేదు. అడిగి చూస్తాను. ఒకవేళ ఇంకొకరికి చోటు లేదని వారంటే ఏమి చేయాలి? నేను ఒక్కడినీ వెళ్లనా వద్దా?' అని రెట్టించి అడిగాడు నేతాజీ.

ఎట్టి పరిస్థితుల్లోనూ నేతాజీ సైగాన్‌లో ఉండ కూడదు. ఉంటే ఏ క్షణమైనా శత్రువులకు చిక్కవచ్చు. అది జరగకూడదు. ఆ విషయంలో మా అందరికీ స్పష్టత ఉంది. సైగాన్‌లో ఉండి ఆయన ఫ్రెంచ్ సైన్యానికి పట్టుబడటం కంటే ఏ ప్రత్యామ్నాయమైనా అది ఎంత ప్రమాదభరితమైనా మేలే. ఇక చేయ గలిగింది లేక 'సర్! దయచేసి ఎలాగైనా మాలో ఒకరిని వెంటబెట్టుకు వెళ్లండి. అది కుదరకపోతే మీరు ఒక్కరే వెళ్లండి. కానీ సాధ్యమైనంత త్వరగా మీ వెనకే మేమూ మిమ్మల్ని చేరేందుకు రవాణా ఏర్పాటు చేయమని జపాన్ వాళ్లకు గట్టిగా చెప్పండి' అని మేము ఏడుపు గొంతుతో చెప్పలేక చెప్పాం.

ఎట్టి పరిస్థితుల్లోనూ నేతాజీ సైగాన్‌లో ఉండ కూడదు. ఉంటే ఏ క్షణమైనా శత్రువులకు చిక్కవచ్చు. అది జరగకూడదు. ఆ విషయంలో మా అందరికీ స్పష్టత ఉంది. సైగాన్‌లో ఉండి ఆయన ఫ్రెంచ్ సైన్యానికి పట్టుబడటం కంటే ఏ ప్రత్యామ్నాయమైనా అది ఎంత ప్రమాదభరితమైనా మేలే. ఇక చేయ గలిగింది లేక 'సర్! దయచేసి ఎలాగైనా మాలో ఒకరిని వెంటబెట్టుకు వెళ్లండి. అది కుదరకపోతే మీరు ఒక్కరే వెళ్లండి. కానీ సాధ్యమైనంత త్వరగా మీ వెనకే మేమూ మిమ్మల్ని చేరేందుకు రవాణా ఏర్పాటు చేయమని జపాన్ వాళ్లకు గట్టిగా చెప్పండి' అని మేము ఏడుపు గొంతుతో చెప్పలేక చెప్పాం.



ఇంతకీ నేతాజీ ఎక్కడికి వెళుతున్నాడు? మేము అడగలేదు. ఆయన చెప్పలేదు. కానీ మాకు తెలుసు. మాకు తెలుసని ఆయనకూ తెలుసు. ఆ బాంబర్ విమానం మంచూరియా వెళుతున్నది.

అవతల గదిలో నేతాజీ జవాబు కోసం జపాన్



వాళ్లు మహా తొందర మీద ఉన్నారు. నేతాజీ, ఆయన వెంట హబీబ్ రివ్వున లోపలికి వెళ్లారు. కొద్ది నిమిషాల్లో నేతాజీ బయటికి వచ్చి 'ఇంకో సీటు దొరికింది. నా వెంట హబీబ్ వస్తాడు. మనకు అంతకు మించి చోటు దొరుకుతుందనుకోను. అయినా మన అదృష్టం పరీక్షించుకుందాం' అన్నాడు. తరవాత నన్ను, కల్నల్ గుల్జారా సింగ్‌నూ పిలిచి 'మీరు కూడా లగేజి తీసుకుని నా వెంట రండి. అదృష్టం బాగుండి ఇంకో రెండు సీట్లు దొరికితే మీరూ రావచ్చు' అన్నాడు.

అందరం లగేజి తీసుకుని హడావుడిగా పరిగెత్తి కార్లు ఎక్కి మహా వేగంగా ఏరోడ్రోమ్ వెళ్లాం. ముందు కారులో నేతాజీ, నేను, హబీబ్ ఉన్నాం. మేము వెళ్లేసరికే విమానం ఇంజన్ చప్పుడు చెవులు పగిలేలా వినిపిస్తున్నది. అదే విమానంలో వెళ్లబోతున్న లెఫ్టినెంట్ జనరల్ షిదేయ్ అప్పటికే వచ్చి వెయిట్ చేస్తున్నాడు. (అతడు మంచూరియాలోని జపనీస్ క్వాన్ టుంగ్ ఆర్మీకి వైస్ చీఫ్. అక్కడ సరెండర్ ఏర్పాట్లను పర్యవేక్షించటానికి వెళుతున్నాడు.) ఆలస్యమయింది,వెంటనే బయలుదేరాలని జపాన్ అధికారులు తొందర పడుతున్నారు. కాని రెండో కారు రావటం ఆలస్యమయింది. అందులో ముఖ్యమైన లగేజి ఉంది. అది వస్తే కాని బయలు దేరనని నేతాజీ చెప్పాడు. అది వచ్చేదాకా ఆగి, అందులోని లగేజిని విమానంలోకి ఎక్కించారు (కోట్ల డాలర్లు విలువ చేసే ఐఎన్ఎ సంపద అందులో ఉంది. తూర్పు ఆసియా లోని దేశభక్త భారతీయులు తమ దగ్గర ఉన్నదంతా ఊడ్చి స్వాతంత్ర్య పోరాటం కోసం సమర్పించిన ధర్మనిధి అది. తదుపరి పోరాటానికి వినియోగించటానికి సుభాస్ చంద్ర బోస్ దానిని వెంట తీసుకువెళుతున్నాడు).

ఖాకీ డ్రిల్ బుష్ షర్టు, ట్రౌజర్స్, తళతళలాడే బూట్లు, ఐఎన్ఎ కాప్, బాడ్జి ధరించిన నేతాజీ చకచకా విమానం దగ్గరికి వెళ్లి జనరల్ షిదేయ్‌తో కరచాలనం చేశాడు. ఐసోడా, హచియలకు గుడ్‌బై చెప్పి టార్మాక్ మీద సామాన్లు పట్టుకుని నిలబడ్డ మాకేసి తిరిగాడు. కుడిచెయ్యి చాచి 'జైహింద్. తరవాత మళ్లీ కలుద్దాం' అంటూ అశ్రునయనాలతో గట్టిగా షేక్ హాండ్ ఇచ్చాడు. రాచఠీవితో నిచ్చెన మెట్లు ఎక్కి లోపలికి వెళ్లాడు. వెంటనే తలుపు మూసుకుంది. విమానం కదిలింది.

సాయంత్రం 5-15కు సైగాన్లో జపనీస్ బాంబర్ ప్లేను నేతాజీని తీసుకుని మరలిరాని పయనానికి టేక్ ఆఫ్ అయింది. ఎక్కడికో తెలియదు. అదే కడపటి వీడుకోలు. అదే అక్కడున్న అందరికీ నేతాజీ ఆఖరి చూపు.

[Unto Him A Witness, S.A.Ayer, 61-72 ]

**మిగతా వచ్చేవారం**








# సార్వజనీనం 'గీతా'

విశ్వమానవాళి అభ్యుదయాన్ని కాంక్షించిన శ్రీకృష్ణుడు సర్వశాస్త్రసారంగా 'గీతా'మృతాన్ని పంచి, జ్ఞానసిరులను అనుగ్రహించాడు. 'జీవితమంటేనే నిరంతర సమరం. జీవితంలో కానీ యుద్ధంలో కానీ పురోగమనమే తప్ప పలాయనం చిత్తగించడం, నిష్క్రమించడం, అచేతునులుగా వ్యవహరించడం ధీరుల లక్షణం కాదు. విజయం, శాంతిసౌఖ్యాల కోసం పోరు అనివార్యం. ప్రతి వ్యక్తిలోనూ కొన్ని ప్రత్యేకతలు, శక్తియుక్తులు ఉంటాయి. వాటిని గుర్తించి సద్వినియోగం చేసుకోవడం ద్వారా మనసులోని అల్లకల్లోలాను నివారించి, కర్తవ్యపరాయ ణులు కావాలి' అన్నది గీతాచార్యుని దివ్యోపదేశం. కాగా, మనిషి మనీషిగా మారే వైనం చెప్పే 'జ్ఞాన'గీత శ్రవణాన్ని శవ జాగారానికో, శవయాత్రకో పరిమితం చేయడం శోచనీయం. ఇది 'శోభ' గీతే కాని 'శోక' గీత కాదు, కారాదు అని నిరూపించేందుకు కంకణబద్ధులు కావడమే 'గీతా జయంతి'కి ఇచ్చే నిజమైన గౌరవం.

**డిసెంబర్ 14**
**'గీతా'**
**జయంతి**



భగవద్గీత సాక్షాత్తు భగవద్వాణి. అద్భుత విజయం, ఐశ్వర్యం, అసాధారణ శక్తి, నీతిని ప్రసాదించేందుకే దీని ఆవిర్భావం అని తెలిస్తే 'గీత'పట్ల అమోఘ, అపూర్వాభిమానం కలుగుతుంది. అర్జునుడి అంతటి పరాక్రమవంతుడు 'విజయం వద్దు.. రాజ్యసుఖమూ వద్దు' అని అస్త్ర సన్యాసానికి సిద్ధపడినప్పుడు భగవానుడు కర్తవ్యబోధ చేశాడు. గీతోపదేశంతో అర్జునుడు ప్రబుద్ధుడై 'విజయుడు' అయ్యాడు. భగవద్గీతను శ్రద్ధగా విని ఆచరిస్తే మోహాంధకారాన్ని (మోహం అంటే చేయవలసిన పనిని మరచి ఇతర ఆలోచనలో పడడం) వీడి నిశ్చయంగా సత్ఫలితాలు సాధిస్తారని భావం. అన్ని స్థాయిలు, అన్ని వర్గాల వారికి 'మోహం' సూత్రం వర్తించవచ్చు. ఉదాహరణకు, విద్యార్థిలోకాన్నే తీసుకుంటే వారిలో కొంత శాతమైనా చదువుకు బదులు వేరే కలాపాలకు లోనుకావడం మోహం లాంటిదే అవుతుంది. గీతోపదేశం ద్వారా అర్జునుడికి కర్తవ్యం స్ఫురించినట్లే గీతాభ్యాసం/శ్రవణంతో వర్తమానంలో పాలకుల నుంచి పాలితుల దాకా తమ తమ తక్షణ కర్తవ్యాలు గుర్తుకు రాకమానవు.

**'గీత' ఆవిర్భావం..**

శ్రీమత్ మహాభారత అంతర్గతమైన భగవద్గీత సకల మానవాళికి నిత్య పఠనీయ గ్రంథం. నరనారాయణుల మధ్య సంవాద రూపంలో అనేక విషయాలను ప్రబోధించిన ఈ అష్టాదశాధ్యాయనిలోని ప్రతి అంశం మానవ జీవనానికి ఉపకరించేదే.

**'సర్వశాస్త్రమయీ గీతా సర్వదేవ మయోహరిః**
**సర్వతీర్థమయీ గంగా సర్వ వేదమయో మనుః'**

మనువు సర్వవేదమైనట్లు, గంగ సకలతీర్థరూపిణి అయినట్లు, శ్రీహరి సర్వదేవ మయుడైనట్లు భగవద్గీత సర్వ శాస్త్రమయం. ఇది సార్వకాలీనం, సార్వజనీనం. జ్ఞానపరిణతిని బట్టి ఒక్కొక్క స్థాయిలో ఒక్కొక్క విధంగా బోధపడే నిత్యనూతన గ్రంథం. ఈ అష్టాదశాధ్యాయినికి గీత, గంగ, గాయత్రి, సీత, సత్య, వేదత్రయి, పర, అనంత, త్రిసంధ్య, సరస్వతి, బ్రహ్మవిద్య, బ్రహ్మవల్లి, ముక్తిగేహిని, అర్థమాత్ర, చిదానంద, భవఘ్ను, భయనాశిని, తత్త్వార్థ జ్ఞానమంజరి అని పద్దెనిమిది పేర్లున్నాయి. భగవానుడైన శ్రీకృష్ణుడు ఉపదేశించాడు కనుక 'భగవద్గీత', పరబ్రహ్మను తెలిపే విద్య కనుక 'బ్రహ్మవిద్య' అని, వేదాంతాలను సంగ్రహించిన చెప్పినందున 'ఉపనిషత్సారం'అంటారు.

**'న కాంక్షే విజయం కృష్ణ**
**న చ రాజ్యం సుఖాని చ**
**కిం నో రాజ్యేన గోవింద**
**కిం భోగై ర్జీవితేన వా'** (విజయం వద్దు, రాజ్య సుఖమూ వద్దు) అని అర్జునుడు కదనరంగంలో బంధుప్రీతి, బేలతనంతో అస్త్రసన్యాసం చేసిన క్షణంలో (మార్గశిర శుద్ధ ఏకాదశి) ఈ మహోత్కృష్ట గ్రంథం ప్రభవించింది. భగవంతుడు ముఖత: ఉపదేశించిన పుణ్యదినమే గీతాజయంతి. ఇలా ప్రపంచ వ్యాప్తంగా ఒక గ్రంథం ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం 'గీత'కే చెల్లింది. ఇది కేవలం ఆధ్యాత్మిక గ్రంథమే కాదు. వ్యక్తిత్వ వికాసానికి నిలువెత్తు సాధనం. లక్ష్యసాధకులకు మార్గదర్శి. ప్రపంచ భాషలన్నిటిలోకి అనువదితమైన దీనిపై వందలకొద్దీ భాష్యాలు వచ్చాయి. గీతాధ్యయనం, గీత ఆదేశానుసారం జీవితాన్ని కొనసాగించే వారికి విజయాలు సొంతమవుతాయని అనుభజ్ఞులు చెబుతారు.

**అర్జునుడికే ఎందుకు?**

భీష్మద్రోణాది ఉద్దండులు ఎందరో ఉండగా భగవానుడు అర్జునుడికే ఎందుకు గీతాబోధ చేశాడు? లాంటి సందేహాలకు విజ్ఞులు, పండితులు, విద్యావేత్తలు చక్కటి వివరణలు ఇచ్చారు. యుద్ధ విముఖుడైన అర్జునుడిని యుద్ధానికి సిద్ధం చేయడం అందుకు కారణంగా కనిపించినప్పటికీ, తరచి చూస్తే ఎన్నో విశేషాలు

అవగతమవుతాయి. 'పాండవానాం ధనం జయః' (పాండవులలో అర్జునుడను) అని శ్రీకృష్ణుడే చెప్పుకున్నాడు. పైగా వారిద్దరు నరనారాయణులు. అర్జునుడు అనేక దేవతల మెప్పు పొంది అస్త్ర శస్త్రాదులతో పాటు పరమేశ్వరుని మెప్పించి పాశు పతాస్త్రాన్ని సాధించాడు.

భగవానుడికి బాల్యంలో సఖుడు, అనంతరం భక్తుడు. ఈ రెండింటిని పరిగణలోకి తీసుకుని 'రహస్యమైన ఈ బ్రహ్మ విద్యను ఉపదేశించాను' అన్నాడు భగవానుడు. అంటే నరుడి భక్తితత్వమే నారాయణుడి ప్రియత్వానికి హేతువైందని పండిత వాక్కు. వారిద్దరు కురుక్షేత్రం నాటికే ఆత్మబంధువు లైనా, కర్తవ్యాకర్తవ్యాల గురించి పార్థుడికి సందేహాలు రాలేదు, పార్థసారథికి వాటిని తీర్చవలసిన ఆస్కారం కలగలేదని, రణరంగంలో వైరాగ్య ప్రపూరితమైన అర్జునుడికి జ్ఞానబోధకు తగిన సమయంగా భావించిన పరమాత్మ తన ధర్మాన్ని నిర్వర్తించారని చెబుతారు. భగవానుడు అర్జునుడిని సాకుగా పెట్టుకుని, కురుక్షేత్ర సంగ్రామాన్ని కారణంగా ఎంచుకుని సమస్త మానవులు కర్మ జ్ఞాన భక్తి యోగాలు, పరమ

# మకరందం

విజయాలు పొందేందుకు భగవద్గీతోపదేశం చేశారని పెద్దలు అంటారు.

**వ్యక్తిత్వ వికాసిని**

మానవ జీవన గమనంలో అడుగడుగునా భయాందోళనలే. ఏదైనా కార్యం ఆరంభించే ముందు అది సరైనదేనా? అనే భయం... ప్రారంభించిన తరువాత సజావుగా సాగుతుందో? లేదో! అనే అనుమానం. పూర్తయ్యాక ఫలితంపై శంక. ఇక మృత్యుభయం ఉండనే ఉంటుంది. ఇలాంటి ఎన్నో అంశాల పట్ల మనిషిని జాగృత పరిచేదే భగవద్గీత. 'ధర్మవిహితమైన కర్తవ్య పాలనలో ఊగిసలాట పనికిరాదు. కర్తవ్యాన్ని నిర్వహించాల్సిందే. నిష్కామ కర్మకు అంతిమ విజయం తథ్యం. ధర్మబద్ధంగా, భగవదర్పితంగా నిర్వహిస్తే అది పాపనాశనమై తుదకు మోక్షసాధకం అవుతుంది' అని గీతాచార్యుడు చెప్పారు. 'ధర్మంగా కర్తవ్యాన్ని నిర్వర్తించు' అని భగవానుడి సందేశం పార్థుడికే కాదు, సర్వ మానవాళికి వర్తిస్తుంది.

ఒక పనిని చేయబూనడానికి కానీ, నిరాకరించడం కానీ విధి లేదా ప్రకృతికి లోబడి ఉంటుంది తప్ప మనిషి చేతిలో లేదని భగవద్గీత చెబుతోంది. 'అర్జునా! నీవు చేయబోతున్న యుద్ధంలో నీవు చంపుతున్నావని, వైరి పక్షంలోని వారు చావబోతున్నారని అనుకోవడం భ్రమ. నీవు నిమిత్తమాత్రుడివి మాత్రమే. యుద్ధం చేయడమే నీ ధర్మం. అలా చేయకున్నా వారిలో బతికేవారు ఎవరూ లేదు. ఈ విషయంలో బాధపడి ప్రయోజనం లేదు' అన్న భగవానుడి మాటలు వేదాంతంలా అనిపించవచ్చు. శ్రద్ధగా పరిశీలిస్తే... ఎవరి కర్తవ్యాన్ని వారు నిర్వహిస్తూ పోవాలని, జననమరణాలు, జయాపజయాలు సహజ పరిణామాలని బోధపడి, చింత, శోకం లాంటి భావోద్వేగాలు దూరమై ప్రశాంత జీవనానికి ఆస్కారం కలుగుతుందని ఆధ్యాత్మిక వేత్తలు, వ్యక్తిత్వ వికాస నిపుణులు అంటారు.

జ్ఞానసముపార్జన, కర్తవ్యపరాయణత, జీవన సంవిధానం, అద్భుత విజయం, ఐశ్వర్యం, అసాధారణ శక్తి, నీతిని ప్రసాదించడం లాంటి వాటివి 'గీత' సహా పురాణేతిహాసాల పరమ లక్ష్యం. అయినప్పటికి 'ఫలశ్రుతి' పట్ల ఆసక్తి మానవనైజం. ఆ కోణంలోనే కావచ్చు, 'గీత'లోని ఒక్కొక్క అధ్యాయ పారాయణం వల్ల కలిగే అమోఘ ఫలితం గురించి పద్మపురాణంలోని కథలు చెబుతున్నాయి. భగవద్గీతలోని కనీసం ఒక్క శ్లోక సారాంశాన్నయినా అర్థం చేసుకుని ఆచరించగలిగితే మోక్షసాధనకు వీలుంటుందని 'గీత'కు మొదటగా భాష్యం రాసిన శ్రీశంకర భగవత్పాదులు పేర్కొన్నారు. 'భగవద్గీతా కించిదధీతా గంగాజల కణికా పీతా' (గీతా శ్లోకం ఒక్కటి పారాయణం చేసినా గంగ జలం తాగినంత పుణ్యం వస్తుంది) అని, 'భగవద్గీతలోని ఒక్క శ్లోకాన్నైనా గురుముఖతః అధ్యయనం చేసినవారు ధన్యులు' లని ఆయనే అన్నారు. ఎందరో మహామహులు లెక్కకు మిక్కిలిగా వెలువరించిన వ్యాఖ్యానాలను చదివి జీర్ణించుకొనే తీరిక, ఓపిక, శక్తిసామర్థ్యాలు లేనివారు మొదటి, చివరి శ్లోకాలను జాగ్రత్తగా చదివితే గీతాసారం ఒంటబడుతుందని చెబుతారు.

మానవాళికి కలిగే అనేకానేక సంశయాలను నివృత్తి చేసే ఆధ్యాత్మిక గ్రంథం భగవద్గీత. నిరాశా నిస్పృహలు, నిస్తేజం, నిస్సత్తువ లాంటివి ఆవరించినప్పుడు గీతాసందేశం మార్గదర్శిగా నిలుస్తుందని వివేకానంద, మహాత్మాగాంధీ లాంటి ఎందరో మహనీయులు అనుభవపూర్వకంగా చెప్పారు.

**'ఏకం శాస్త్రం దేవకీ పుత్రగీతమ్**
**ఏకోదేవో దేవకీ పుత్ర ఏవ**
**ఏకో మంత్రస్య నామానియాని**
**కర్మాప్యేకం తస్య దేవస్య సేవా'** (గీతాశాస్త్రమే ఏకైక శాస్త్రం, దేవకీనందనుడు శ్రీకృష్ణుడే ఏకైక దైవం, ఆయన నామాలు దివ్యమంత్రాలు, ఆయన సేవే సత్కర్మయుక్త ఏకైక సేవ) అని ఆర్యోక్తి. 'సృష్టిలో పరిణామం, మార్పులు అనివార్యం. ఏది ఆదిలో ఉన్నట్లు అంతంలో ఉండదు. జీవితం పరిమిత కాలం. నియమిత కాలంలో చేయగలిగే మంచిపనులే అపరిమిత తృప్తిని ఇవ్వగలుగుతాయి. తద్వారా జన్మ సార్థకమవుతుంది. ఈ జీవన సత్యమే భగవద్గీత పరమోపదేశం. ★




**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్


## యువతలో ఆత్మవిశ్వాసం నింపుతుంది!

యువతలోని ఆధ్యాత్మిక జ్ఞానశక్తిని, క్రియాశక్తిని మేలుకొల్పి ఆత్మస్థైర్యంగల ధీమంతులుగా తీర్చిదిద్దటానికి భగవద్గీతలో ఎంపికచేసిన, అత్యంత భావస్ఫోరకమైన మండల (40) శ్లోకాలను లక్షమంది యువతచే పారాయణం చేయించాలని మహాత్ములు నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి 'లక్ష యువగళ గీతార్చన' అని పేరుపెట్టారు.

డిసెంబర్ 14 (గీతా జయంతి)న భాగ్యనగరంలోని ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఇందులో పాల్గొనదలచిన వారు పారాయణం చేయవలసిన నలభై శ్లోకాలను విశ్వహిందూ పరిషత్ ఒక బ్రోచర్‌లో అందిస్తున్నది. https://gitarchana.com వెబ్‌సైట్ నుండి దానిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. శ్లోకాలను ముందుగా అధ్యయనం చేసి, భావస్ఫూర్తిని పొంది, భావార్థాన్ని హృదయస్థం చేసుకుంటే కంఠస్థం చేయటం సులభమవుతుంది. ఈ శ్లోకాల కంఠస్థంతో లభించిన చైతన్యస్ఫూర్తి ఆజన్మాంతం వెన్నంటి ఉండి ధైర్యవంతులుగా వివిధ రంగాలలో అభివృద్ధిపథంలో పయనించటానికి ఉపకరిస్తుంది. ఈ మండల శ్లోకాలు ఎవరికి వారు స్వయంగా అధ్యయనం చేయటానికి అనుకూలంగా 'పంచాధ్యయన పద్ధతి' (భావచిత్రం, పదవిభాగం, ప్రతి పదార్థం, తాత్పర్యం, విశేషార్థం)తో కూడిన పాఠ్యప్రతులను రూపొందించారు. భగవద్గీత శ్లోకపారాయణం ద్వారా భవితను భవ్యంగా తీర్చిదిద్దుకునేందుకు వచ్చిన అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి.

కార్యక్రమానికి సంబంధించిన మరిన్ని వివరాలు https://gitarchana.comలో చూడవచ్చు.

**ముదుపు యాదిరెడ్డి, విహెచ్‌పి, తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి.**

"ఏమ్మా! ఆరోగ్యం ఎలా ఉంది. న్యాయ విభాగానికి చేరే ముందువరకూ బాగానే ఉన్నావు. అక్కడ తారసిల్లిన ఏదైనా అంశం నిన్ను బాధించిందా?" ప్రేమాస్పదమైన స్వరంతో రాచగన్నియ పక్కకు చేరి, ఆమె చేతులను తన చేతుల్లోకి తీసుకుని నోరారా అడిగింది. ఒక్కసారిగా అత్తమ్మ కరస్పర్శ అనుభవంలోకి రాగానే గన్నియకు మాకలిశక్తి జ్ఞాపకానికి వచ్చింది. అమ్మ తలపు తాకగానే ఆమె కళ్లు చెమర్చాయి. మరులిప్తలోనే పూర్ణిమాదేవి చేతుల్లో ఒరిగిపోయింది. మాతృప్రేమ కోసం అర్రులుచాచే బిడ్డలా అత్తగారికి మరింతగా దగ్గరయింది.

ఇదే సరైన సమయమని తలచింది పూర్ణిమ. అరణపు దాసిగా నందపురం నుంచి గన్నియతోపాటే వడ్డాది వచ్చిన సేవిక చిత్తజాణ ఆ సమయాన అక్కడ లేదు. అందుకనే కొద్దిపాటి చొరవ తీసుకుంది. గన్నియ తలనిమురుతూ,

"చెప్పు. నీకొచ్చిన కష్టం చెప్పు. అత్తగారిగా అడగడం లేదు. తోటి స్త్రీగా తెలుసుకోవాలని అనుకుంటున్నాను. భయపడకు. బెంగపడకు." ప్రియ వచనాలను ప్రసరింపజేసింది. గన్నియ తేరుకుంది. సాటి మహిళగా అత్తమ్మ అడుగుతోంది కాబట్టి మనసులో మాట చెప్పేందుకు సాహసించింది.

"అత్తయ్యా! దేవిడీలోకి అడుగుపెట్టి అర్థ సంవత్సరం అవుతున్నా ఇక్కడి భోగట్టాలేవీ అంతుపట్టడం లేదు. ఇదేం రాజ్యమో బోధపడటం లేదు. అంతా కొరుకుడుపడని పంచాగంలా ఉంది." టకటకా చెప్పేసింది. గతుక్కుమంది పూర్ణిమ. కోడలి మనసులోతుల్లో చాలా సందేహాలే ఉన్నట్టుగా తేలడంతో సమస్య పరిష్కారానికి నడుం బిగించింది.

"నేనూ నీలాగే ఒకనాడు ఈ రాచనగరికి కోడలిగా వచ్చినదాన్ని. కొత్తలో ఎవరికైనా అలాగే ఉంటుంది. రానురానూ అన్నీ సర్దుకుంటాయి." గన్నియ హస్తాలకు పట్టిన చిరుచెమటలను చీరకొంగుతో తుడుస్తూ నిమ్మళంగా పలికింది. అయినప్పటికీ గన్నియలో పెద్దగా మార్పులేదు. తన సమస్య అది కాదని, తన హృదయం దుఃఖసంకులం కావడానికి కారణం అదంతా కానేకాదని అత్తమ్మకు ఆమె చెప్పదలచింది. ఎందుకనో తటపటాయించింది. ఈ లజ్జుగుజ్జులను పూర్ణిమాదేవి గ్రహించి,

"నా మాటలు నీకు సాంత్వన చేకూర్చడం లేదు కదూ?" తల నేలకు పడేసుకుని నిలుచున్న కోడలి ముఖాన్ని తన చేత్తో పట్టి పైకి తీస్తూ మృదువుగా పలికింది. గన్నియను అక్కడే ఉన్న ఆసనానికి చేర్చింది. తనూ ఆ పక్కనే కూర్చుంది. రాచకోడలికి కొంచెం ఉపశమనం దొరికింది. గళం విప్పింది.

"అత్తమ్మా! వడ్డాది ఆచారవ్యవహారాలేవీ నచ్చడం లేదు. వీటి గురించి ఎంతో చెప్పవలసి ఉంది. కానీ, అంతటి శక్తి నాకిప్పుడు లేదు. కొన్ని మటుకు ఉటంకిస్తాను. ఇంతక్రితమే న్యాయపాలక భవనంలో మనముందుకు వచ్చిన తగవు ఏమిటి? భూమి భాగోతమే కదా! అసలు నేలను అమ్ముకోవడం ఏంటి? అది మనం సృష్టించింది కాదే! భగవంతుడు ఇచ్చిందే. దాన్ని ఒకరికి ఒకరు పత్రాలు రాసి ఇచ్చుకోవడం న్యాయమా? దీనికి మళ్లీ గొడవలు పడటం ఏంటి? మా దేశంలో ఎప్పుడూ ఇలాంటివి మేం చూడలేదే." ఆవేశం కట్టలు తెంచుకోగా ఘంటిక మోగినట్టుగా మోగింది.

అప్పటికిగానీ, గన్నియ గుండెల చప్పుడేమిటో రాజమాతకు పూర్తిగా అవగతం కాలేదు. ఆ గుండియలు పలురకాల సందియాలతో సతమతమవుతున్నాయనీ తెలియరాలేదు. ఉడుకుతున్న కోడలి మానసం కలవరపెట్టకపోలేదు. అందుకే ఆ సందర్భాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సాగదీయకూడదని గట్టిగానే అనుకుంది. అదే తడవుగా,

"గన్నియా! మనసును కష్టపెట్టుకోకు. పొంగి పొరలుతున్న నీ భావాలన్నీ తెలుసుకోగలుగుతున్నాను. ఇవి మనిద్దరం మాట్లాడుకుంటే తెగేవి కావు. పైగా నీవు నెలతప్పిన పిల్లవు. అందుకే సాయం సంధ్యవేళ సమాలోచనమందిరానికి రా. అక్కడికి ప్రణవశర్మను రప్పిస్తాను. నీ భర్త దేవేంద్రులవారూ వస్తారు. నేనూ ఉంటాను. మాట్లాడుకుందాం. అంతవరకూ స్థిమితపడు. నే వెళుతున్నాను." అక్కడ ఒక్క క్షణం ఉన్నా కోడలు మరింతగా హృదయాన్ని దగ్ధం చేసుకుంటుందని, దరిమిలా శరీరానికి ఏ సమస్యయినా తెచ్చుకుంటుందని భావించి మందిరాన్ని చకచకా వీడివెళ్లిపోయింది రాజమాత. ఆమె వెళ్లేదారినే పట్టిపట్టి చూస్తూ ఉండిపోయింది గన్నియ.

* * *

సాయంవేళ రానేవచ్చింది. సమాలోచన మందిరానికి తరలిపోవలసిన తరుణం ఆసన్నమైందని తలపోసింది గన్నియ. అప్పటికే నందపురం నెచ్చెలి చిత్తజాణ అమ్మగారి ప్రయాణాన్ని పనిగట్టి ఉన్నందువల్ల తగిన ఏర్పాట్లు చేస్తోంది.

చిత్తజాణ పేరుకు తగ్గ జాణ. గన్నియ మనసును ఇట్టే కనిపెట్టి నడుచుకోగల సేవాపరాయణి. ఒకలా చెప్పాలంటే, వడ్డాది రాచరికాన్ని మహారాణీ హోదాలో రాచగన్నియ ఇముడ్చుకోలేకపోతోందన్న విషయం తెలుసుకున్న పిల్ల. ఈ పరిస్థితుల్లో రాణీకి తనే పెద్దదిక్కుగా నిలవాలనీ సంకల్పం చెప్పుకుని ఉంది. అచ్చం అలానే నిలుస్తోంది కూడా.





# పూలగండువనం

**8**

జాణ లేనినాడు తన మనుగడ ఎంతగా వడ్డాది దివాణంలో దిగనాసిల్లేదోనని ఇప్పటికి కనీసం వెయ్యిమార్లయినా అనుకుని ఉంటుంది గన్నియ.

"నే వెళుతున్నది సమాలోచన కోసం. పెళ్లి చూపులకేం కాదు. హెచ్చుగా శ్రమపడకే." తనను అద్దం ముందు కూర్చోబెట్టి రూపాన్ని చక్కదిద్దబోయిన జాణతో నిర్మోహంగా పలికింది వడ్డాది పట్టమహిషి.

"సమాలోచనకయినా చక్కగానే వెళ్లాలి కాదూ! రాజావారు వేంచేసే చోటు ఏదయినా అక్కడికి మీరు రాణీగానే చేరవలసి ఉంటుంది." యజమానురాలి మీదికి రక్కున జవాబు విసిరింది జాణ.

"సరేలే. మీ ప్రభువులవారికి సతీమణి అంటే అలంకార ప్రాయం. సమయానికి అక్కరకు వచ్చే పదార్థం. ఇది యదార్థం." రవ్వలహారాన్ని తప్ప దన్నట్టుగా మెడకు ధరిస్తూ మాటలు జారవిడిచింది గన్నియ.

"ఏ మగాడయినా అంతేనమ్మా. పెళ్లాం తన చేతిలో బొమ్మ అనుకోవడం అతని రివాజు. తన బొమ్మ చేతిలో తనే కీలుబొమ్మ కావడం అతని మోజు." ఇలా కిలకిలమన్న సేవికను వారిస్తూ,

"అసలు ఎవరయినా ఎవర్నయినా ఎందుకు కీలుబొమ్మగా చేసుకుని ఆడించాలే! స్నేహబంధంతో పెనవేసుకోవడం తప్పనిచ్చి మరో ప్రకృతి భార్యాభర్తల మధ్య ఎందుకుండాలి? నువ్విలా దాసీత్వం చేయడమే నాకు నచ్చదు. అరణంగా ఒక మనిషి కోసం మరో మనిషి జీవితాన్ని వెచ్చించడం దారుణం." గన్నియ చిరచిరలాడింది.

"ఆహా. బాగుందే. పోనీ అని చెప్పినందుకు నా కొలువుకే ఎసరు పెడుతున్నారు. సరే లెండి. ఈ సుగంధ ద్రవ్యం కొంచెం పూసుకోండి." అంటూనే గన్నియ చేతికి ఒకానొక భరిణెను మూత తీసి అందించింది జాణ. ఒక్కసారిగా మందిరమంతా సువాసనా భరితమైంది. తటాలున విద్యుల్లత ఏదో ఒంట్లో పాకినట్టుగా వజవజా వణికింది మహారాణి.



అందుకున్న భరిణెను చప్పున జాణకు తిరిగి ఇచ్చేసింది. అలా ఇస్తూనే,

"ఇది పునుగు కదూ!" నిర్లిప్తంగా ప్రశ్నించింది. అంతలోనే రాణీవారు అంతటి బేలగా ఎందుకు మారవలసివచ్చిందో అర్థం కాలేదు జాణకి. అయినా యజమానురాలిని మెప్పించాలన్న తీరున,

"పునుగే కాదు. కస్తూరీ లేకపోలేదు. కావాలంటే ఇట్టే తెచ్చి ఇవ్వగలను." అసలు విషయాన్ని బయటపెట్టింది. ఆ మాటలతో గన్నియ మరింత నిస్పృహ చెందినట్టయింది.

"ఎక్కడివే ఈ సుగంధాలు. వడ్డాది ఎలా చేరాయి." కటువుగానే పదాలను విసిరింది. జాణ భయపడింది. అనవసరమైన ప్రసంగం చేయలేదు కదా అనే తనుపుతో,

"ఇవి మన అడవుల్లోనివేనమ్మా. వడ్డాది వేట గాళ్లు తీసుకువచ్చినవే. ఇవే కాదు. మన సరుకులెన్నో ఇప్పుడు సరాసరి కొండలు దిగి వచ్చేస్తున్నాయి. పల్లపువ్యాపారులంతా నేడు నందకోనల్లోనే తిరుగుతున్నారు. ఇప్పుడక్కడ తేనెలేదు. కుంకుళ్లు లేవు. అడ్డాకులు లేవు. ఇంకా చాలా లేవు. అవన్నీ ఇక్కడే దొరుకుతున్నాయి. రేపటిరోజున గిరులన్నీ తవ్వి రంగురాళ్లు, లోహాలూ వడ్డాది షావుకార్లు బయటకు తీస్తారట." ఈ మధ్యనే ఇంటికివెళ్లి తిరిగివచ్చేటప్పుడు నందపురంలో తెలుసుకున్న సత్యసమాచారమంతా ప్రవాహంగా చెప్పేసింది.

నిస్త్రాణ ముంచుకువచ్చినట్టుగా అయిపోయింది గన్నియ. అద్దం వద్దనుంచి లేచింది. దగ్గరగా ఉన్న ఆసనంలో కూలబడినట్టుగా కూర్చుండిపోయింది. కొన్ని క్షణాలను భారంగా దొర్లించింది. ఇదంతా బోధపడక ఆ కాలమాత్రలను ఎలాగోఒకలా గడుపుకొచ్చింది జాణ. మెల్లగా మామూలయిన గన్నియ,

"చూడవే. ఎంత దురన్యాయానికి వడ్డాది దుండగులు పాల్పడుతున్నారో! రక్షితప్రాణులుగా మనం ప్రకటించుకున్న పునుగు పిలుల్నీ, కస్తూరి జింకల్నీ నామరూపాల్లేకుండా చేస్తున్నారన్నమాట." నిట్టూర్పు విడుస్తూ అంది. జాణకు అర్థం కాలేదు. ఈ కారణంగానే బుర్రగోక్కుంటూ,

"ఇందులో దురన్యాయం ఏముందమ్మా. మన్యం మగువను భార్యగా చేసుకున్న రాజుకు అత్తవారి



డా॥ చింతకింది శ్రీనివాసరావు

శిఖరాలమీద హక్కుండదా?" అనేసింది.

జాణమాటలకు నిప్పులు చిమ్ముతున్న జ్వాలా తోరణమే అయిపోయింది గన్నియ. చండప్రచండ కోపంతో ఊగిపోతూ అగ్నికీలల్ని కక్కుతున్నట్టుగా వాచను పెనుకేకలుగా మార్చివేసింది.

"వడ్డాదిప్రభువు నాకు మొగుడు గానీ మా నాన్న రాజ్యమంతటికీ మొగుడా? పిల్లకీ, పిల్ల కన్నవారి ఆస్తిపాస్తులకీ, వాళ్లసామ్రాజ్యమంతటికీ ఈ దేవేంద్రుడు పెనిమిటి అయిపోయి అలుపులేని మిథునక్రీడకు దిగుతాడేం? గిరికాంతలోకే కాదు. గిరికంతల్లోకీ మగతనాన్ని ప్రవహింపజేసేసి రాళ్లకే రంకుమొగుడు అయిపోతాడేం? ఇతగాడు అంతపెద్ద మగాడేం?" అనకూడని మాటలు సైతం రౌద్రంగా వెల యించేసింది. దెబ్బకి జాణ నోరు కట్టడిపోయింది. అంతటితోనే గన్నియ ఆగలేదు.

"నన్ను పెళ్లాడానన్న నెపంతో వడ్డాదిరాయడు నందాన్ని మింగుతానంటే నేనెందుకు ఒప్పుకుంటానే. నందపురాన్ని స్మశానవాటికగా మారుస్తానంటే మరెలా ఒల్లగలనే. మన పసిబయళ్లన్నీ బీళ్లుగా మార్చే ప్రయత్నం ఎవరు చేసినా మనసు కాలిపోదా?" బిగ్గరగా పలికింది. ఆ వెంటనే తెరలుతెరలుగా నీరసచ్ఛాయలు కమ్ముకోవడంతో ఆసనపు అంచునకు చేరి మెడ జారవేసింది. మందిరం పైకప్పును చూస్తూ ఉండిపోయింది. తారెత్తిపోయింది జాణ. ఉరమని పిడుగులా రాణీవారూ గళం పెంచేయడాన్ని, శిఖర ప్రాయమంతటి ఆగ్రహాన్ని తెచ్చేసుకోవడాన్ని తట్టుకోలేక డస్సిపోయినట్టయింది. గుండె పూర్తిగా జారిపోకుండా చూసుకుంటూనే మందిరం మూలనున్న మంచినీటి పాత్ర తెచ్చి గభాలున గన్నియకు అందించింది.

నోటికందిన నీరు అమృతంలా తోచింది రాణీకి. లోటాతో లోటాడు జలాన్నీ ఒక్క పెట్టున గుటకలు గుటకలుగా మింగేసింది. ఆ మీదట కాసింత తెప్ప రిల్లినట్టయింది. మెల్లగా కొన్ని క్షణాలకు చల్లబడినట్టూ అయింది. జాణకు ఖాళీ నీటిపాత్ర అందిస్తూ,

"నీ మీద కోప్పడ్డానే. మరేం అనుకోకు. నా బాధ అలాంటిది." ఆగ్రహాన్ని వదిలిపెట్టి సాధారణస్థితికి వస్తూ అనేసింది.

"అబ్బే. నామీద మీరేం కోపపడలేదమ్మా. కోప్పడితే మాత్రం తప్పేంటి. అదలా ఉండనివ్వండి గానీ, చీటికీ మాటికీ మీరిలా నెత్తురు కాగబెట్టుకోవడం ఇప్పుడున్న స్థితిగతుల్లో మంచిది కాదు. మీకు మూడవనెల నడుస్తోంది. అది మరచిపోకండి." చెప్పవలసింది చనువారా చెప్పేసింది జాణ. మూడవ నెల అనే మాట వినగానే గన్నియ నీరుగారి పోయినట్టుగా అయిపోయింది.

'అవుననుకున్నా కాదనుకున్నా కొన్ని సవాళ్లను మనిషికి దేవుడే విసురుతుంటాడు.' ఎదలోనే సొదపడుతూ,

"జాణా! ఊరికే నేనేం మరిగిపోవడం లేదే. ఎదుటివారి ఆస్తులను ఎంత దగ్గరవాళ్లయినా దోచుకోకూడదు కదే. పెళ్లినాటి మాటలు నాగవల్లికే మలిగిపోతే ఎలా చెప్పు. సరేలే. నీముందు నాగిని నృత్యం చేస్తే లాభమేంటి. అడగవలసినవాళ్లనే అడగాలి. ఇంతకీ ఇప్పుడు నువ్విచ్చిన జీవజలాలు ఎక్కడివే. అచ్చం మన శిలానది నీళ్లల్లానే ఉన్నాయి. గొంతులో ఒంపుకుంటే నందపురం వెళ్లొచ్చినట్టే ఉంది. నలిగిపోయిన నాడులన్నీ నవజీవాన్ని పొందినట్టుంది. పోయిన ప్రాణం లేచివచ్చినట్టే ఉంది. ఇంతకీ ఇవి ఏ నీళ్లు?" విపులంగా గన్నియ మాట్లాడే సరికి హాయిని పొందింది జాణ.

"పోనీలెండమ్మా. మీరు శీతబద్ధారు. నాకదే చాలు. ఈ మధ్య మీకు ఏం చెబితే ఏమవుతుందో అన్నట్టుగా బెగిలిపోతున్నాను తల్లీ.'' ప్రేమ పూర్వకంగానే మదిలోని చింతను బయటపెట్టింది.

"మరేం ఫరవాలేదు లేవే. నీ మీద కాకపోతే ఎవరి మీద ఎగిరిపడగలను చెప్పు." ముసిముసిగా బదులు పలికింది వడ్డాది రాణి. "అలా అయితే ఒక మాట. మళ్లీ మీరు చీకాకుపడకూడదు. ఇప్పుడు మీరు తాగిన నీళ్లన్నీ మీరన్నట్టు మన శిలానది నీళ్ళే." అసలు విషయాన్ని వివరించింది జాణ. చకిత అయింది గన్నియమ్మ. ఎక్కడలేని ఆనందం తనదే అన్నట్టుగా వదనాన్ని వాటంగామార్చి,

"అక్కడెక్కడి జలాలో ఇక్కడికెలా వచ్చాయే." విస్మయం పాలవుతూ అడిగింది. "ఎలా వచ్చాయా? శిలానదినుంచీ వడ్డాది రాజ్యంలోని బంగారు మెట్టవాగుకు కాలువతవ్వి రెంటినీ కలుపుకొచ్చారు కదా. అలా మీ నోటికి అందాయి ఈ నీళ్లు. నిన్ననే జలాల విడుదల జరిగింది. ఇకమీదట ఎంచక్కా మననీళ్లు మనమే తాగవచ్చు." జాణ పలికిన పలుకులతో ఆసనంనుంచి తటాలున లేచింది గన్నియ.

"అవి వడ్డాది నీళ్లు ఎలా అవుతాయి. అవి నందా నివి కదా. కొండల జీవజలాలనూ వడ్డాది ప్రభువులు వదలడం లేదా. శిలానదిని మనం గ్రోలుతుంటే, నందప్రజలు కుడవడానికి పంటలెక్కడుంటాయి. కొత్త ఫలం తిని కొవ్వి.. పాత అన్నం తిని బలిసి.. అనే సామెతను గుర్తుకుతెస్తున్నారీ వడ్డాదివారు. చెప్తా నుండు. అడగవలసినవేవో ప్రభువునే అడుగుతాను. అడగడం కాదు కడుగుతాను." అంటూనే మరోమాట లేకుండా సరసరా సమాలోచన మందిరంవైపు తోకతొక్కిన తాచులా వెళ్లిపోయింది. ఆమె వెళ్లినదారిని అవాక్కయి చూడటం జాణ వంతయింది.

* * *

మహారాణీ రాచగన్నియ కోసమే నిరీక్షిస్తూ సమాలోచనమందిరంలో కూర్చున్న పూర్ణిమాదేవికి, దేవేంద్రునికి, ప్రణవశర్మకి తుపానులా వచ్చి పడ్డ ఆమెను చూడగానే బుర్రగిర్రున తిరిగినట్టయింది. పట్టపుదేవిలా కాకుండా కోనలు తిరిగే గిరినాగులా గన్నియమ్మ మందిరంలోకి చొరబడిన తీరు వారిని మహదాశ్చర్యంలో ముంచివేసింది. ముగ్గురూ కొంతసేపు నిరుత్తరులే అయ్యారు.

వ్యగ్రతను ఎంతగా తగ్గించుకుందామని అనుకున్నా కుదరకపోవడంతో ఉగ్రంగానే మందిరాన ప్రవేశించిన గన్నియ కొన్ని రాచమర్యాదలను మరచిపోయింది. వస్తూవస్తూనే తనకు నిర్దేశించిన ముఖ్మల్ పరుపుల కర్రబల్లమీద కూలబడిపోయింది. ఆ వెంటనే కర్తవ్యం గుర్తుకువచ్చినట్టుగా అయిపోయి బల్లను వదిలిపెట్టింది. ప్రణవులవారికి నమస్కారాలు చేసింది. అత్తగారికి పాదాభివందనాలూ చెల్లించింది. ప్రభువు మోహం మాత్రం కనీసం చూడనయినా చూడకుండా ఆసదనం వైపు నడిచిపోయింది.

ఆమె మానసిక స్థితిని ప్రణవులవారు అప్పటికప్పుడే బేరీజు వేయగలిగారు. ఆమె రాకడకు ముందే రాజమాత చెప్పిన సొదలన్నీ విని ఉన్నారు గనక పస తెలుసుకున్నారు. ఇప్పుడు మాట్లాడవలసింది తను కాదన్నట్టుగా పూర్ణిమాదేవి కిమ్మనకుండా ఉండిపోయింది. దేవేంద్రుడు మటుకు మల్లగుల్లాలు పడుతున్నాడు. అప్పటికే వ్యక్తిగత సమయాల్లో తనతో భార్య జరిపిన అనేకానేక అదిలింపుల సంభాషణలూ గుర్తుకురాకపోలేదు. ఆమె చెప్పిన కొన్ని నీతులూ మనసున మెదలకపోలేదు. అవన్నీ అతనికి పెద్దగా నచ్చుబాటుకానివే. ఇందువల్లనే,

'వదరుబోతు. తెంపరి. న్యాయం, ధర్మం, దీనికే తెలుసట. మర్వెవరికీ ఎరుకలేదట. కనకపు సింహాసనం మీద అనర్హులు కూర్చోకూడదని అంటారందుకేను.' మనసును గంటుపెట్టుకున్నాడు.

**(ఇంకా ఉంది)**

**నోటికందిన నీరు అమృతంలా తోచింది రాణీకి. లోటాతో లోటాడు జలాన్నీ ఒక్క పెట్టున గుటకలు గుటకలుగా మింగేసింది. ఆ మీదట కాసింత తెప్ప రిల్లినట్టయింది. మెల్లగా కొన్ని క్షణాలకు చల్లబడినట్టూ అయింది. జాణకు ఖాళీ నీటిపాత్ర అందిస్తూ, "నీ మీద కోప్పడ్డానే. మరేం అనుకోకు. నా బాధ అలాంటిది." ఆగ్రహాన్ని వదిలిపెట్టి సాధారణస్థితికి వస్తూ అనేసింది.**



'పెళ్లి'- ఇద్దరు మనుషులనే కాదు, రెండు కుటుంబాలనూ దగ్గరచేసే గొప్ప బంధం. అగ్నిసాక్షిగా ఒక్కటైన ఈ బంధం.. వేదమంత్రాలతో చేసిన ప్రమాణాలతో, పంచభూతాల సాక్షిగా కడదాకా కలిసి ఉండాలనే ఉద్దేశం ఇందులో ఉంది. వివాహం అంటే రెండు తనువులు కాదు, మనసులు కూడా ఒకటై పరస్పరం తోడు-నీడగా కష్టసుఖాలలో ఒకరికి-ఒకరుగా ప్రయాణించే అద్భుత ప్రయాణం.

# విడాకులే పరిష్కారమా?

కానీ నేటి సమాజంలో అన్యోన్యంగా సాగాల్సిన సంసారం, 'ఒకరికొకరు' అన్నట్టుగా గడపాల్సిన దంపతులు చిన్నపాటి మనస్పర్థలకు కూడా విడిపోతున్నారు. విడాకుల కోసం కోర్టు తలపులు తడుతున్నారు. పెళ్లయి ఏడాది తిరగకుండానే దంపతులు విడాకుల కోసం కోర్టును ఆశ్రయించడం భయాన్ని కలిగిస్తున్నది, ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. ప్రపంచానికి ఆదర్శప్రాయంగా నిలిచిన మన భారతీయ వివాహ వ్యవస్థ ఇప్పుడు విడాకుల చిచ్చులో చిక్కుకుపోతున్నది.

పెళ్లి అంటే నూరేళ్ల పంట అనే నానుడి స్థానంలో పెళ్లంటే ఒక బందీఖానగా భావిస్తుండటం, ఆ బంధం మూన్నాళ్లకే ముక్కలవడం బాధాకరం. భరించేవాడు- భర్త; భూదేవి అంత సహనం గలది- భార్య. కాపురంలో కలతలు సహజం అనే విషయాన్ని మర్చిపోయి చిన్న చిన్న సమస్యలకే విడాకులు పరిష్కారం అని కోర్టును ఆశ్రయిస్తున్నారు.

గత కొన్నేళ్లుగా విడాకుల సంస్కృతి బాగా పెరిగిపోతోంది. విడాకులు కోరుతున్న వారి సంఖ్యా గణనీయంగా పెరుగుతోంది. పాశ్చాత్య పోకడలు, ఆధునికత, నగరీకరణ, వ్యక్తిగత స్వేచ్ఛ, దాంపత్య జీవితంలో మూడో వ్యక్తి ప్రమేయం, సోషల్ మీడియా, మొబైల్ ఫోన్స్, పని ఒత్తిడి, అత్తమామల అజమాయిషీ, సినిమాల ప్రభావం.. ఇలా అనేక కారణాలు దంపతు లపై ప్రభావాన్ని చూపి విడాకులకు దారితీస్తున్నాయి. నేటి దంపతులు పాశ్చాత్య పోకడలను అలవాటుగా చేసుకొని కలహాలను కొని తెచ్చుకుంటున్నారు.

ధర్మేచ, అర్థేచ, కామేచ, మోక్షేచ..! నాతిచరామి అని వరుడు నోటపలికే ఈ మంత్రం ఎన్ని కష్టాలు వచ్చినా భార్య చేతిని విడిచిపెట్టనని ప్రమాణం చేయిస్తుంది. కానీ చిన్న చిన్న కారణాలకే (టీవీ రిమోట్ ఇవ్వలేదని, నచ్చిన సీరియల్ పెట్టలేదని, కాఫీ ఇవ్వలేదని) విడాకులు ఇస్తున్నారు. పంతాలు, మనస్పర్థలకు వెళ్లి జీవితాలను సుడిగుండంలో నెట్టేస్తున్నారు.

విడాకుల సుడిగుండంలో మొదటి పది రాష్ట్రా లలో తెలుగు రాష్ట్రాలు కూడా ఉండటం ఆందోళనకు గురిచేస్తోంది. నేడు దేశంలో అత్యధికంగా నమోదవుతున్నవి విడాకుల కేసులే. హైదరాబాద్ నగరంలో రోజుకు 50 నుంచి 80 కేసులు నమోదవుతున్నాయి. ఇలా ఏటా 18 వేల నుంచి 20 వేల మంది విడాకులు కావాలంటూ న్యాయస్థానాలను ఆశ్రయిస్తు న్నారు. వీరిలో 25 నుంచి 35 మధ్య వయస్కులు 75 శాతం. 35 సంవత్సరాలు పైబడిన వాళ్లు 25 శాతం ఉన్నారు. ఏడాది తిరగకుండానే విడిపోతున్న దంపతులు 60 శాతం. ఒక్క హైదరాబాద్‌లోనే 2016లో 3,080 జంటలు విడిపోయినట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది తప్ప, తగ్గడం లేదు.

మన భారతీయ సంస్కృతి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచింది. కానీ నేటి యువత మన భారతీయ విలువలు, సాంప్రదాయాల్ని మరచిపోతున్నారు. ఒకప్పుడు ఏదైనా సమస్య వస్తే కూర్చుని మాట్లాడుకునే వారు. లేదా ఆ సమస్యను పెద్దల దృష్టికి తీసుకెళ్లేవారు. కానీ ఇప్పుడు అలాకాదు, ఏ చిన్న సమస్యనైనా 'కోర్టులోనే తేల్చుకుందాం' అంటున్నారు. మనస్పర్థలకు పరిష్కారం 'విడాకులే' అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. విడాకులు తీసుకునే దంపతుల వల్ల రాబోయే తరాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశా లున్నాయి. కాబట్టి ఈ సమస్యను గుర్తించి ప్రభుత్వాలే తగిన పరిష్కార మార్గాలను వెతకవలసిందే.

**రంజిత్, న్యాయవిద్యార్థి,**
**ఉస్మానియా యూనివర్సిటీ**



'నేను గుజరాత్‌లో పుట్టి పెరిగాను...' అన్నాడతడు. ఇందులో తప్పేమీ కనిపించదు. తరువాతే ఓ ప్రమాదకర మలుపు తిప్పాడు సంభాషణ, 'ఆ గుజరాత్‌లో బతికి ఉన్నాను కూడా!'. అంతే, ఆ వాచాలతలో అసాధారణమైన హాస్యమేదో పొంచి ఉన్నట్టూ, అది తమని ఉర్రూతలూగించినట్టూ పెద్ద పెట్టున నవ్వుతారు ప్రేక్షకులు. దీనికి ముక్తాయింపూ ఉంది. 'నేను బతికి బయట పడ్డాననే అనుకుంటున్నాను. ఎలాగంటే, ఆ (గుజరాత్) రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయడంలో విఫలమై నందువల్లనేనని నా అభిప్రాయం'. ఈ మాట రెట్టింపు కిక్కు ఇచ్చినట్టే ఈలలూ, కేరింతలూ, తప్పట్లు. ఇది 2021 ఆరంభంలో ఏర్పాటు చేసిన కొత్త సంవత్సర వేడుకలలో ఏర్పాటు చేసుకున్న ఉబుసుపోక ప్రదర్శన. దాని పేరే స్టాండప్ కామెడీ. అందులో వినపడిన 'హాస్యం' ఇది. ఆ కమేడియన్ మున్వర్ ఫారుఖి. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఇది జరిగింది. ఇది ప్రధాని నరేంద్ర మోదీ మీద పరోక్ష విమర్శ. అలాగే ఎందుకు అనుకోవాలి! అనుకోవచ్చు. ఆ స్టాండప్ కమేడియన్‌కే కాదు, దేశంలో దాదాపు పేరుమోసిన మరొక పాతిక ముప్పయ్ మంది ఆ బాపతు విదూషకులకి ఇదే పని. మోదీ మీద ముతక వ్యంగం, ప్రమాదకర హాస్యం సృష్టించాలన్న దుగ్ధ. ఇండోర్‌లోనే స్థానిక బీజేపీ నాయకుని కుమారుడు, హిందూ రక్షణ సంఘటన సభ్యుడు ఏకలవ్య గౌర్ వేదిక మీదకి వచ్చి ప్రేక్షకులని ప్రశ్నించాడు, 'ఇతడు మున్వర్ ఫారుఖి. మన దేవతల మీద జోకులు వేస్తూ నవ్విస్తాడు. ఇలాంటి చెత్తని డబ్బులిచ్చి, మరీ చూడడానికి మీకు సిగ్గనిపించడం లేదా?' అని. 'అబ్బే అదేమీ లేదు. నేను ఇస్లాం మీద కూడా జోకులేస్తా. త్రిపుల్ తలాక్ మీద కూడా' అని వివరణ ఇచ్చాడు మున్వర్. నిజానికి ఇదే అసలు జోక్. తలాక్ మీద జోక్ వేయడమంటే వాళ్ల ప్రవక్త మీద జోక్ వేయడం కాదు కదా! తరువాత ఇతడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇతడు ముస్లిం కాబట్టి, బీజేపీని విమర్శించాడు కాబట్టి ప్రభుత్వం అరెస్టు చేయలేదు. కానీ ఇతడి మిత్రులు, మన గుడ్డి మేధావులు ముక్తకంఠంతో ఒకటే చెప్పారు, 'అతడు మైనారిటీ కాబట్టి అరెస్టు చేశారు'. ఈ వార్తను ఫిబ్రవరి5, 2021న నమోదు చేసిన 'లాస్‌ఏంజెలెస్' పత్రిక సరిగ్గా ఇదే అభిప్రాయాన్నే ప్రకటించింది. కాబట్టి ఈ విదూషకులందరికీ లంకె ఉందనుకుంటే పొరపాటు కాదు.

# విషం కక్కుతున్న కమేడియన్‌లు



**20**14లో హిందుత్వ మోదీ వచ్చిన తరువాత 14 శాతం ఉన్న ముస్లింలను లక్ష్యం చేసుకున్నది అని ఒక కువ్యాఖ్య కూడా జోడించింది ఏంజలిస్. దానికి ఈ కేతిగాడి ప్రదర్శన, అరెస్టే సాక్ష్యంగా జమేసుకోమంటున్నది. మోదీని విమర్శిస్తే చాలు, దేశద్రోహం కేసు పెట్టి జైళ్లల్లో పడేస్తున్నారని కూడా తేల్చిపారేసింది. ఇటీవల స్టాండప్ కామెడీ పేరుతో బీజేపీ, హిందుత్వం మీద జరుగుతున్న అసహ్యపు దాడికీ, దాని రీతికీ ఇదొక్క ఉదాహరణే. గుజరాత్ ప్రభుత్వం మీద ఇంత పెద్ద నిందతో సాగిన వ్యాఖ్యలివి. గుజరాత్‌కు పూర్తికాని లక్ష్యం అన్న అతడి వాగుడుకు అర్థం ఏమిటో జనానికి తెలియదనే అనుకుంటున్నారా? ఇది పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగడం వంటిది. నిజానికి హిందూ-ముస్లిం రగడను ఏదో విధంగా కొనసాగించడానికి ఇదంతా హాస్యభరితంగా సాగుతున్న యత్నం. కానీ ఇదంతా భావ ప్రకటనా స్వేచ్ఛలో భాగంగానే చూడాలి, నేర్చుకోండి! అంటోంది భారతీయ మేధోలోకం. ఈ మాత్రం స్వారస్యం, హాస్య చతురత, అర్థం చేసుకునే విశాల హృదయం, కళాపోషణ లేకపోతే ఎలా? అంటోంది, అంతర్జాతీయ హక్కుల శిబిరం. ప్రపంచంలోనే ఈ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో కొన్నిసార్లు న్యాయస్థానాలు కూడా, 'నింద ఎలాంటిదో అన్న అంశం కంటే, నిందితుడు ఎవరో!' అనే చూస్తున్నాయని, సంజయ్ హెగ్డే, ఓ లాయర్ పెద్దాయన ఆక్రోశాన్ని కూడా ఆ పత్రిక నమోదు చేసింది. మున్వర్ ఇలా ప్రదర్శనలు ఇస్తూ ఉంటాడు. అవన్నీ వైరల్ అయి దేశం మీద పడి స్వైరవిహారం చేస్తూ ఉంటాయి. గొడవలవుతూనే ఉంటాయి. అయినా, పోలీసులు ప్రాథమిక దర్యాప్తు కూడా జరపకుండానే ముద్దుల కమేడియన్‌ని అరెస్టు చేసి తీసుకుపోయారని మున్వర్ అభిమానగణం గోల చేసింది. ఇంతకీ మున్వర్ చిన్నతనంలోనే గుజరాత్‌ని వదిలి, ముంబై చేరాడు. ఆ దేవరహస్యం మాత్రం చెప్పరు. ఇతడి గురువు కూడా కమేడియనే. పేరు సాద్ షేక్. 'నేను నా శిష్యుడిని రాజకీయాల జోలికి పోవద్దని చెప్పాను. అయినా ముస్లింలని లక్ష్యంగా చేసుకోవడం చాలా సులభం' అంటూ తనదైన బుద్ధిని చాటుకున్నాడు. 'ఔనౌను! మోదీ ప్రభుత్వ హయాంలో హాస్యం మీద రోజురోజుకీ దాడి పెరిగి పోతోంది. ఆఖరికి పెరుగుతున్న వంట గ్యాస్ గురించి మాట్లాడినా ఆయన అభిమానులు ధ్వజమెత్తుతున్నారు' అంటాడు మరొక స్టాండప్ కమేడియన్ అదితీ మిట్టల్. మున్వర్‌పై కేసు ఉదంతానికి తెగ బాధపడిపోతూ సంజయ్ రాజౌరీ అనే 'ఆసీ తాసై' 'ప్రజాస్వామిక వ్యంగ్య సంఘం' సభ్యుడు 'ఇది కుళ్లిన సంఘం' అని ఆక్రోశించాడు. పాపం, ఇలా కేసులూ అవీ అంటే అతడి బతుకేంగాను! అతడికి ప్రదర్శనలు ఎలా వస్తాయి? అని కూడా నిలదీశాడు, ఈ 'కుళ్లిన' సమాజాన్ని. మధ్యప్రదేశ్ న్యాయమూర్తిగారు మాత్రం, 'నీ వ్యాపారం కోసం ఇలా వాగడమేనా?' అని గట్టిగానే అడిగారు. అగ్రిమా జాషువ అనే ఆవిడ అరేబియా సముద్రం ఒడ్డున శివసేన కూటమి శివాజీ విగ్రహం ప్రతిష్టించడం గురించి జోకులు కురిపించింది. అది కూడా స్టాండప్ కామెడీయే (ట). సాక్షాత్తు ఆ రాష్ట్ర హోంమంత్రి అరెస్టుకు ఆదేశాలు ఇవ్వడంతో కాళ్ల బేరానికి వచ్చి, క్షమాపణలు చెప్పింది. చాలామంది మరాఠీలు, ఇతరులూ కూడా ఒళ్లు దగ్గరెట్టుకోమని మందలించారు.

వీళ్ల ధోరణి చూస్తుంటే కన్యాశుల్కంలో కరటకశాస్త్రి చెప్పిన సంభాషణ గుర్తుకు వస్తుంది. యాంటీనాచ్‌లలో చాలా రకాలు ఉంటారట. కొందరు పగలు యాంటీ నాచ్. రాత్రి ప్రోనాచ్. కొందరు సొంతూళ్లో యాంటీనాచ్. పొరుగూరులో ప్రోనాచ్. అలాగే మోదీని విమర్శించే విదూషకులను అరెస్టు చేస్తే అది భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం. కానీ మోదీ అనుకూల, కాంగ్రెస్ వ్యతిరేక జర్నలిస్టుని అరెస్టు చేయడం, పైగా దానిని సుప్రీంకోర్టు తప్పు పట్టడం

ఘోరాతిఘోరమైన తప్పిదం. కునాల్ కమ్రా అనే గంథోళీగాడు ఈ కేసులో సుప్రీం కోర్టుని వెక్కిరించి ప్రసిద్ధుడయ్యాడు. కాంగ్రెస్‌నూ, దాని అంగుష్టమాత్ర నేతలను విమర్శించినందుకు శివసేన ప్రభుత్వం కక్ష కట్టి అర్నబ్ గోస్వామిని అరెస్టు చేయిస్తే, సుప్రీంకోర్టు అడ్డం పడింది. అదే కమ్రాకి అసలు నచ్చలేదు. గోస్వామికి బెయిల్ ఇచ్చినందుకు సుప్రీంకోర్టు మీద జోకులేశాడు. క్షమాపణ చెబుతావా లేదా? అని గద్దించింది అత్యున్నత న్యాయస్థానం. అత్యున్నత అధికారం, పలుకుబడి ఉన్న సంస్థలు కూడా ఈ కాస్త హాస్యాన్ని కూడా సహించలేకపోతే, ఈ దేశంలో హాస్యగాళ్ల గతేమి కాను? అని కమ్రా వాపోయాడు. రాయల్ అండ్ ఫీల్డ్ ద్విచక్ర వాహనాన్ని చూస్తే హర్లే డేవిడ్‌సన్‌కీ, రాజదూత్‌కీ పుట్టిన అక్రమ సంతానంలా



ఉంటుందని ఒక కమేడియన్ వాగి చిక్కుల్లో పడ్డాడు. మరొకడు, వినాయకుడంటే తండ్రి తల నరికిన దేవుడు, ఆయన్ని పూజిస్తున్నారని మరొకడు నోరు పారేసుకున్నాడు.

'అతడి కంటె ఘనుడు ఆచంట మల్లన్న...' అన్నట్టు, వీళ్లందరి రికార్డు బద్దలుకొట్టదలచిన వీర విదూషకుడు -వీర్‌దాస్. 'నేను రెండు ఇండియాల నుంచి వచ్చాను...' అంటూ నవంబర్ 15, 2021న ఇతడు అమెరికా నుంచి ఒక వీడియో ప్రపంచం మీదకు వదిలాడు. వాషింగ్టన్ డిసిలోని కెనెడీ సెంటర్‌లో ఈ ప్రబుద్ధుడు వాగినదే అది. 'భారత్‌లో స్త్రీని పగలు దేవతంటారు. రాత్రైతే సామూహిక అత్యాచారం చేస్తారు' అని కూశాడు అందులో. అలాగే, 'శాకాహారిగా ఉండడమే గొప్పతనంగా భావించే దేశంలో, ఆ శాకాలను పండించే రైతులను జీపులు ఎక్కించి చంపుతున్నారు' అని కూడా వాగాడు. దీని మీద చాలామంది భారతీయులు ధ్వజమెత్తారు. నేను భారత్‌లో భేషజం ఎలా ఉందో చెప్పానంతే అంటున్నాడు వీర్. దీనికి కాంగ్రెస్ వాళ్లు వంతపాడారు. అతడికి స్టాండప్ అంటే ఏమిటో నిజంగా అర్థమైంది. స్టాండప్ అంటే సత్యం కోసం నిలబడడమే అని ఘనమైన భాష్యం వెలగబెట్టారు శశి థరూర్. ఆ మాత్రం భావ ప్రకటనా స్వేచ్ఛ ఉండొద్దా అన్నారు కపిల్ సిబల్. కానీ అభిషేక్ మను సింఘ్వి మాత్రం విదేశాలలో కూర్చుని ఇదేం వాగుడు అని అనగలిగాడు. ఈ తిష్టన్మూత్రులకి బీజేపీనీ, మోదీనీ విమర్శించే క్రమంలో,తాము మహిళలను ఘోరంగా అవమానిస్తున్నామన్న స్పృహ కూడా చచ్చి పోతోంది. 'వీర్ వ్యాఖ్య నన్ను నిలువునా కుదిపేసింది సుమా! ఇలాంటి వ్యాఖ్య చేయడమంటే దమ్ము ఉండాలి!' అంటూ మహిళ అయి ఉండి కూడా బాలివుడ్ వెండితెర వేలుపు పూజాభట్ నిస్సిగ్గుగా ప్రపంచానికి సందేశించింది. ఇదంతా మెత్తని ఉగ్రవాదం కాదా అంటూ కంగనా రనౌత్ చీల్చి చెండాడారు. నెవిల్లే షా అనే కమేడియన్ రిజర్వేషన్ల మీద పడ్డాడొకసారి. 'ప్రాణాలు కాపాడే కోర్సులలోకి రిజర్వేషన్‌లతో ప్రవేశం ఏమిటో నాకు అర్థమే కాదు!' అన్నట్టు వ్యాఖ్యానించి చావు తప్పి కన్ను లొట్టపోయిన పరిస్థితిని ఎదుర్కొన్నాడు. ఈ వ్యాఖ్య కూడా మేధావులకు వినసొంపుగానే ఉందని భావించాలి. అందుకే ఖండించలేదు. కానీ, అంతో ఇంతో విజ్ఞత ఉండే సాధారణ నెటిజన్లు తిట్టిపోశారు. దానితో క్షమాపణ చెప్పాడు నెవెల్లి. తాగిన వాడిలా వాగడం, ఆపై ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేదనడం. దేశంలో అందరికీ మామూలైపోయింది. ఇక ఈ బాపతు కమేడియన్ల సంగతేం చెప్పాలి!

మోదీ మీద స్నాప్‌చాట్ చేసినందుకు తన్మయ్ భట్ అనే స్టాండప్ కమేడియన్ మీద కూడా ముంబై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. మాసూమ్ రాజ్వాణి మీద కూడా హిందూ దేవుళ్లను కించ పరిచినందుకు కేసు నమోదైంది. కోర్టులో మద్యపానం చేసే సన్నివేశం తగిలించినందుకు కపిల్ శర్మ అనే బుల్లితెర స్టాండప్ కమేడియన్ కేసులో ఇరుక్కున్నాడు. 2005 నాటి ది గ్రేట్ ఇండియన్ లాఫర్ చాలెంజ్‌తో ఈ పనికిమాలిన ప్రదర్శనలకి ఇక్కడ అంకురార్పణ జరిగింది. 2009లో ముంబైలో మొదలుపెట్టిన ది కామెడీ స్టోర్ కార్యక్రమంతో దేశంలో ఈ స్టాండప్ గోల ఎక్కువయింది. అంటే ఇదీ ఇంగ్లండ్ నుంచి బిచ్చమెత్తుకున్నదే. దీనికి యూట్యూబ్ తోడయింది.

అసలు వీళ్లకి హిందూ దేవుళ్లపైనే జోకులు వేయాలని ఎందుకు అనిపిస్తుంది? హిందువుల మీద, బీజేపీ మీదనే విరుచుకుపడిపోవాలని ఎందుకు అనిపిస్తుంది? భారతీయులు స్త్రీని పగలు దేవతగా పూజిస్తారు రాత్రి సామూహిక అత్యాచారం చేస్తారు అని అత్యంత నీచంగా నింద మోపినవాడికి పక్కనే ఉన్న అఫ్ఘానిస్తాన్‌లో ఏం జరుగుతున్నదో తెలియదా? బొకొ హరాం (ఆఫ్రికా) అనే ముస్లిం మతోన్మాద ఉగ్రవాద సంస్థ ఎంతమంది అమాయక ముస్లిం బాలికలను అంతర్జాతీయ సెక్స్ మార్కెట్‌లో నిలబెట్టి వేలం వేసిందో తెలియదా? అఫ్ఘానిస్తాన్‌లో తాలిబన్ అధికారంలో వచ్చిన కొద్దిగంటలకే నజర్ మహమ్మద్ అనే కమేడియన్‌ని నిర్దాక్షిణ్యంగా చంపేసిన సంగతి ఈ కేతిగాళ్ల సమూహానికి ఎందుకు గుర్తుకు రావడం లేదు? తాలిబన్ మీద, వాళ్ల అకృత్యాల మీద ఎందుకు జోకులు పేలవు? పాకిస్తాన్‌లో, బంగ్లాదేశ్‌లో హిందువుల మీద జరుగుతున్న అత్యాచారాల మీద, లవ్ జిహాద్ మీద ఎందుకు వ్యంగ్యాస్త్రాలు జాలువారవు? శాకాహారం తినే దేశంలో కాయగూరలు పండించే రైతులను జీపులు ఎక్కించి చంపేస్తారని అమెరికాలో అంత ధీమాగా చెప్పిన వాడికి, దొంగ రైతులు, సాటి దొంగ రైతునే చేతులు నరికి, తల వేరుచేసి పడేశారని ఎందుకు తెలియలేదు? ఇతడు రెండు ఇండియాల నుంచి వచ్చాడట. అనుకోకుండా నిజమే చెప్పాడు. ప్రజానీకం బీజేపీని అభిమానించి, ఓట్లు ఇచ్చి పార్లమెంటుకు పంపుతుంది. అదొక భారత్. ఇక్కడ జరిగేవన్నీ అకృత్యాలేనంటూ ఇలాంటి అబద్ధాల కోరులు అంతర్జాతీయ వేదికల మీద చూపించే భ్రమాజనిత భారత్ మరొకటి. మోదీని రక్తపిపాసి అన్నవాళ్లు బయటే తిరుగుతున్నారు. 'హిందూ ఫాసిజం' అంటూ గొంతు చించుకునే కిరాయి వాగుడుకాయలు హాయిగా ఉద్యమాలు చేసుకుంటున్నాయి. అయినా ఇక్కడ వాక్‌స్వాతంత్ర్యం ఏదీ, ఎక్కడ అంటున్నారు. మోదీ మీద నిందలేయకుండా పేపరు వెలువరించలేని సంస్థలు కోకొల్లలు. తిట్టని టీవీ చానళ్లు కొన్నే.

కానీ వాటి మీద అత్యవసర పరిస్థితి ఫేం సెన్సార్‌షిప్ లేదు. అన్నట్టు రెండు ప్రపంచాలు ఉన్న సంగతి వీళ్లకి తెలియడం లేదు. మోదీని అత్యున్నత ప్రధాని అని కొనియాడే ప్రపంచం ఒకటి. ఇలాంటి వాళ్ల సొల్లు ఆబగా వినే మడ్డి ప్రపంచం ఒకటి. ఇవన్నీ వింటూ ఉంటే స్టాండప్ కామెడీయన్లంటే తిష్టన్మూత్రుల మందలా అనిపించడం లేదా? ఆ ప్రేక్షకులు చూసి ఆనందిస్తున్నది దానినే. ★

కథ

# ఈ రోజుల్లో....

డా॥ శ్రీదేవి శ్రీకాంత్



"హలో... హలో రాఘవ గారు ఉన్నారా?" అన్నాడు హరినాథ్.

అవతల నుండి "చెప్పండి" అనే సమాధానం. "రాఘవ గారికి ఒకసారి ఫోన్ ఇస్తారా?" అన్నాడు.

"పర్లేదు నాకు చెప్పండి. నా పేరు కళ. వారి శ్రీమతిని" అంది.

"నా పేరు హరినాథ్. ఈరోజు వాట్సాప్ పెళ్లిళ్ల గ్రూప్‌లో మీ పాప సంబంధం గురించి చూశాం. ఒకసారి రఘురా..." అంటున్న హరినాథ్ మాటను మధ్యలోనే తుంచేసి "వివాహ ప్రకటన ఇచ్చింది నేనే. మీ బాబుది సాఫ్ట్‌వేర్ ఉద్యోగమా?" అంది. "అవునండి" అన్నాడు హరినాథ్.

"బాబు పొడవుగా, తెల్లగా ఉండాలి అనేది మా పాప కోరిక. అవునూ.. హెచ్ వన్ బీ వీసా ఉందా?" అంది. "అమెరికాలో చదివాడు. అక్కడే జాబ్ వచ్చింది" అన్నాడు హరినాథ్.

"ఏ రాష్ట్రంలో ఉన్నాడు?" అని అడిగింది. "వర్జీనియాలో" అని సమాధానం ఇచ్చాడు. "మా పాప అదే రాష్ట్రంలో చదువుతుంది. మీకు ఎంతమంది పిల్లలు? మీకు బాధ్యతలు ఉన్నాయా? మీ ఆస్తిపాస్తులు? మీ బాబు బయోడేటా పంపండి. మా పాపకి నచ్చాలి. పాపతో మాట్లాడతాను" అంది. "అలాగేనండి" అని హరినాథ్ ఫోన్ పెట్టేశాడు.

"ఏవండీ.. ఇంతకీ పిల్ల తండ్రా? లేదా తల్లితోనేనా మీరు మాట్లాడింది?" అంది ఇందిర కుతూహలంగా. "ఈ రోజుల్లో పిల్ల తండ్రి మాట్లాడితే ఆశ్చర్యపోవాల్సిందే! ఏ సంబంధం వాళ్లకి ఫోన్ చేసినా ఆడవాళ్లే మాట్లాడుతున్నారు. తండ్రుల పెత్తనం లేదు. అమ్మాయి తల్లులే ఫోన్ ఎత్తడం. 'అమ్మాయితో మాట్లాడి చెప్తాం. అబ్బాయి అమ్మాయికి నచ్చాలి' అంటున్నారు. ఏం చేస్తాం?" అన్నాడు నిట్టూరుస్తూ హరినాథ్.

"ఇదివరకు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్ చేసుకున్నారు. దాని పర్యవసానమే ఇది. ఆడపిల్లల నిష్పత్తి తగ్గిపోయిందట కదా. ఆడపిల్లలకు గిరాకీ పెరిగింది. కన్యాశుల్కం రావచ్చేమో!" అంది ఇందిర నవ్వుతూ..

"ఏది వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మన అమ్మాయి పెళ్లి ఒక్క సంబంధమే చూసి చేశాం. మగపిల్లవాడి పెళ్లే ఈ రోజుల్లో పెద్ద సమస్యగా తయారయింది" అన్నాడు, హరినాథ్ దీనంగా ముఖం పెట్టి.

"ఈ రోజుల్లో అన్నీ కష్టాలే. ఏదీ ఎక్కువగా ఆశించకూడదు. ఎలాగూ పెళ్లయ్యాక మన దగ్గర ఉండేది లేదాయే. వాళ్లు ఎక్కడో అమెరికాలో ఉంటారు. జూమ్‌లోనూ, వీడియో కాల్‌లోనూ చూస్తాం. పూర్వం కథల్లో మాయా దర్పణాల్లా ఇవన్నీ మాయా దర్పణాలే" అంది ఇందిర.

* * *

"హలో! బాబు మాధవ్, అమ్మాయి సమీరా

వివరాలు పంపాను. వాకబు చేశావా?" అన్నాడు హరినాథ్. "ఆ అమ్మాయి నేను చదువుకునేప్పుడు నాకు జూనియర్. నా హాస్టల్‌లోనే ఉండేది. విచ్చలవిడిగా అబ్బాయిలతో తిరగడం, బాగా మందు కొట్టడం, సిగరెట్లు కాల్చడం లాంటి చాలా చెడు అలవాట్లు ఉన్నాయిలే."

"నిజమా!" అన్నాడు హరినాథ్ నమ్మలేనట్లుగా.

"మీరు చెప్పిన ఇక్కడున్న నాలుగు సంబంధాల అమ్మాయిలు ఇంచు మించు ఒకే బాపతు నాన్నగారు!"

"అదేమిటి మాధవ్? వింతగా చెబుతున్నావు."

"నాన్నా! ఇందులో ఆశ్చర్యపోయే విషయం ఏమీ లేదు. మీరు ఒక్కసారి వచ్చి చూస్తే మీకే తెలుస్తుంది"

"......."

"మనదేశం నుండి వచ్చిన అందరూ అనను గానీ చాలా మంది అమ్మాయిల పరిస్థితి ఇదే. మన తెలుగు ఆడపిల్లలు మన సంస్కృతి కట్టుబాట్లు కాలరాసి.. ఈ వ్యసనాలకు బానిస అవడం నేను చూస్తూనే ఉన్నాను."

"నిజమా, మాధవ్!" నమ్మలేనట్లుగా మళ్లీ అన్నాడు చాలా మథనపడుతూ..

"ఏమండీ! ఒక్కసారి ఫోన్ ఇలా ఇవ్వండి. నేనూ పలకరిస్తాను." అంది ఇందిర. హరినాథ్ సెల్ ఇచ్చాడు.

"బాబూ! ఏమి తిన్నావురా?"

"పని ఎక్కువగా ఉంది. ఖాళీ లేదు. నూడుల్స్ చేసుకున్నాను అమ్మా!"

"నీకు మంచి భార్య దొరికి నీకు చేదోడు వాతోడుగా ఉండాలనే కోరిక. ఎన్ని సంబంధాలు చూస్తున్నారో మీ నాన్న గారు...ప్రతి సంబంధమూ తృప్తిగా అనిపించడం లేదు" అంది.

"అమ్మా! అక్కడే మనదేశంలో చదువుకుని, కాస్త సంగీతం, మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం ఉన్న అమ్మాయిని చూడండి."

"అదే ప్రయత్నిస్తున్నాం. నేను మొక్కని దేవుడు లేదు." అంది నిరుత్సాహ పడుతూ..

"అమ్మా! మీటింగ్‌కు అటెండ్ కావాలి. ఉంటా" అవతల మాధవ్ సెల్ డిస్కనెక్ట్ చేశాడు.



* * *

"హలో! శోభ గారు.. నమస్తే అండి! మానస ఏం చేస్తుంది?"

"దర్జీ దగ్గరకు వెళ్లింది. ఈ రోజుల్లో జాకెట్ కుట్టించడం అంటే చాలా సమయం తీసుకునే పని అయింది. కొన్ని నమూనాలు చూపిస్తానంటే వెళ్లింది." అంది మానస తల్లి శోభ.

"అలాగా?" అంది ఇందిర.

"అసలు విషయం ఏమిటంటే మానస నిశ్చితార్థానికి, పెళ్లికి పెట్టాల్సిన నగలు, బట్టల తాలూకూ అన్నీ అదే ఎంచుకుంటుంది" అంది వియ్యపురాలు ఇందిరతో.

"అలాగేనండి" అంది ఇందిర.

"ఇంకో విషయం చెప్పడం మరిచాను. పాప బట్టలు, మాధవ్ బట్టలు సరిపోలేవిగా ఉంటే బాగుండదు. అందుకే మాధవ్‌ని మా ఊరు పంపించండి. మానస మాధవ్‌తో మాట్లాడతానంది లెండి."

"అలాగేనండి..." అన్నింటికీ ఇందిర సమాధానం అదే.

* * *

మాధవ్ షాపింగ్ చేయడానికి హైదరాబాద్ వెళ్లాడు. షాపింగ్ చేస్తూన్న మాధవ్ మానసను ఉద్దేశించి..."మానస నీ అభిరుచులు ఏమిటి?" అన్నాడు.

''నాకు షాపింగ్ ఇష్టం'' అంది చాలా సాధారణంగా..

అదిరిపడ్డాడు మాధవ్.

"మాధవ్! నీకు?" అంది మానస.

"షాపింగ్ మాత్రం కాదు" అని నవ్వేశాడు.

"మన పెళ్లి చాలా ఘనంగా జరగాలి, మాధవ్" అంది.

"ఎందుకు? అంత ఖర్చు." అన్నాడు.

"నాకు వేడుకలు అంటే చాలా ఇష్టం. పెళ్లిళ్లలో ఉండే కళే వేరు" అంది.

"మనం పెళ్లి చేసుకునే ప్రదేశం చాలా అందంగా ఉండాలి. ఈ రోజుల్లో చాలా మంది దూర ప్రాంతాలకు వెళ్లి పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. మనం మన మొదటి ప్రేమ యాత్రకు సింగపూర్ వెళదాం" అంది. మాధవ్ ఇష్టం లేకున్నా ఊఁ అని ఊరుకున్నాడు.

మానస, మాధవ్‌ల నిశ్చితార్థం హైదరాబాద్‌లో చాలా ఘనంగా జరిగింది. నిశ్చితార్థం తరువాత పెళ్లి రోజు వరకు మానస, మాధవ్ వీడియో కాల్స్‌లో రాత్రంతా గంటలు గంటలు మాట్లాడుకోవడం, ఉదయం పదింటికి నిద్ర లేవడం.. ఇదే వరస.

* * *

పెళ్లి పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. పెళ్లికి ముందు పెళ్లికొడుకు, పెళ్లికూతురు ఇద్దరినీ రకరకాల దుస్తులు ధరింపచేసి.. చిన్న చలనచిత్రంలా తీశారు. చక్కని పాటలతో అందమైన స్థలంలో తీసిన ఆ చిత్రం ఎందరినో ఆకర్షించింది.

అదే పెళ్లి శుభలేఖకు చేర్చి వివిధ మాధ్యమాల ద్వారా బంధువులకు, స్నేహితులకు పంపారు.

పెళ్లి జైపూర్ నగరంలోని గలమన్ సాగర్ సరస్సులో ఉన్న జైమహల్ భవంతిలో నిశ్చయించారు. రంగురంగుల లైట్లతో, పూలతో అలంకరింపబడి ఆ ప్రాంతం కనులపండువగా ఉంది. పెళ్లి అంగరంగ వైభోగంగా జరిగింది.

డబ్బు ఉంటే స్వర్గమే కాళ్లకు పాదా క్రాంతమైనట్లు ప్రేమ యాత్రకు సింగపూర్‌లోని ఇండిగో హోటల్‌లో ఉన్నారు. ఆ తరువాత ఇద్దరూ అమెరికా వెళ్లిపోయారు.

* * *

"మానసా! ఏమన్నా విశేషమా?"

ఫోన్ చేసినప్పుడు మాటల మధ్యలో అడిగింది కోడల్ని ఇందిర.

"ఇంకా ప్లాన్ చేయలేదు ఆంటీ!" అంది తాపీగా మానస.

అలా మరో సంవత్సరం.. అదే సమాధానం. పెళ్లయి ఐదు సంవత్సరాలు అయింది.

"మన రోజుల్లో పిల్లల్ని కనడానికి ఒక ప్రణాళిక

ఏర్పరచుకుని కనేవాళ్లం కాదు. ఇప్పటి పిల్లలు అదేమిటో, అన్నీ విడ్డూరాలే! వాడికి పిల్ల దొరకడానికి ఐదు సంవత్సరాలు పట్టింది. ఇప్పుడు పిల్లల్ని కనడానికి మరో తపస్సు..” అంది భర్తతో ఇందిర.

“ఏం చేస్తాం? కాలంతో పాటు వచ్చే మార్పులతో మనం సర్దుకుపోవాలి. ఇప్పుడు పిల్లలు మనల్ని ఏమీ తెలియనివారీగా చిత్రీకరిస్తూ.. ప్రతిదానికి వింత ప్రణాళికలు వేసుకుంటూ, వెర్రి పోకడలు పోతున్నారు” అన్నాడు హరినాథ్.

“ఈ రోజుల్లో డబ్బుకే కాదు, బంధాలకు కూడా విలువ లేకుండా పోయింది. ఒకర్నో ఇద్దర్నో కనడమేగా! దానికి సమయం నిర్ణయించుకుని కడుపు తెచ్చుకోవడం...కాయకష్టం చేయకుండా...నొప్పులు తెలియకుండా... శస్త్ర చికిత్స ద్వారా ముహూర్తం నిర్ణయించుకుని పిల్లలను కనడం...పురిటి నొప్పులు తెలియని బంధాలు” అంది ఇందిర నిట్టూరుస్తూ..

“అత్తయ్యా! ఆరు సంవత్సరాలుగా...పిల్లలు పుట్టకుండా మేం జాగ్రత్తలు వహించి... వాడిన మందులకు గాను ఏదో లోపం వచ్చింది. అందుకే ఇద్దరం చికిత్స కోసం వెళుతున్నాం” అంది మానస ఓ రోజు ఫోన్లో.

ఒక మగ, ఒక ఆడ బిడ్డలు కావాలని ఇద్దరూ నిర్ణయించుకుని...చికిత్స ద్వారా గర్భం దాల్చింది మానస.

* * *

ఇంటికి రాగానే మానస తల్లికి ఫోన్ చేసి “రెండు కాన్పుల్లో పిల్లల్ని మోయడం, ఖర్చు ఎందుకని మగపిల్లాడు, ఆడపిల్ల ఇద్దరూ కావాలన్నాం, అమ్మా. నువ్వు, నాన్న అమెరికా రండి అంది. కరోనా రెండు డోసులు వ్యాక్సిన్ వేసుకున్నారుగా.. అయినా ప్రయాణం జాగ్రత్త. మూడవ నెల వచ్చినప్పటి నుండి



“అత్తయ్యా! కరోనా సమయంలో మీరు ప్రయాణం చెయ్యలేరు. తొలి కాన్పు.. పైగా ఇద్దరు పిల్లల్ని కనడానికి ప్రణాళిక వేసుకున్నట్లు అంతా చక్కగా జరిగింది. ఉయ్యాల వేడుక ఘనంగా చెయ్యాలి అంటున్నది అమ్మ. మీరూ, మామయ్య జూమ్‌లో చూద్దురు గానీ. లింక్ పంపిస్తాను” అంది మానస ఫోన్ చేసి.

కాస్త జాగ్రత్తగా ఉండమన్నారు” అంది.

మాధవ్ మానసకు వేళకు మంచి ఆహారం ఇస్తూ..

సాయంత్రాలు నడవడానికి తీసుకెళుతూ చక్కగా చూసుకోసాగాడు. మానసకు మూడవ నెల వచ్చింది. మానస తల్లిదండ్రులు అమెరికా వెళ్లారు.

* * *

మానస డెలివరీ తేదీ రావడంతో ఆసుపత్రికి వచ్చింది. ముందుగానే ఎంచుకున్నట్టు బాబూ, పాప పుట్టారు.

“అత్తయ్యా! కరోనా సమయంలో మీరు ప్రయాణం చెయ్యలేరు. తొలి కాన్పు.. పైగా ఇద్దరు పిల్లల్ని కనడానికి ప్రణాళిక వేసుకున్నట్లు అంతా చక్కగా జరిగింది. ఉయ్యాల వేడుక ఘనంగా చెయ్యాలి అంటున్నది అమ్మ. మీరూ, మామయ్య జూమ్‌లో చూద్దురు గానీ. లింక్ పంపిస్తాను” అంది మానస ఫోన్ చేసి.

“అలాగేనమ్మా” అంది ఇందిర.

మొదటినుంచీ ఈ కాలం మగపిల్లాడి తల్లిగా ఆవిడకు వచ్చిన పదం అదే.

“అమ్మా! కొరియర్‌లో నువ్వు పాపకు పట్టు పావడా, బాబుకు పంచే పంపించు. ఉయ్యాలలో వేసినప్పుడు వెయ్యడానికి..” అన్నాడు మాధవ్.

“అలాగే” అంది.

వీడియో కాల్ చేసి చూపించారు, నానమ్మ, తాతయ్యకు.

“అమ్మా! చెప్పడం మరిచాను. పాపను మూడు నాలుగు సంవత్సరాలు నీ దగ్గరే పెంచాలి. బాబును మా అత్తగారు పెంచుతానన్నారు” అన్నాడు.

“పిల్లలు ఇద్దరూ ముచ్చటగా, ఆరోగ్యంగా ఉన్నారు. మీరు రేపు డిశ్చార్జ్ అవుతున్నారు, మానస” అంది డాక్టర్.

డాక్టర్ వైపు కృతజ్ఞతా భావంతో చూస్తూ... “డాక్టర్ గారు!.. మేం పిల్లలు పుట్టరేమోనని చాలా నిరుత్సాహ పడ్డాం. చివరికి ఈ విధానం ద్వారా బిడ్డలను కనగలగడం అదృష్టంగా భావిస్తున్నాం” అంది మానస.

“చూడండి మానసా! ఈ రోజుల్లో పిల్లలు ప్రతిదీ తరచి చూసి..పెద్దవాళ్ల మాటలు వినకుండా తమ సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారు. పూర్వం త్వరగా పెళ్లి చేసుకునే వారు. పిల్లల్ని కనే వారు. వాళ్లకి ఓపికలు ఉండగానే పిల్లల భాధ్యతలు తీరిపోయేవి. వారికి పిల్లల్ని ఎప్పుడు కనాలి అనే ప్రణాళికలు లేవు.

ఈ రోజుల్లో పూర్తిగా ఉద్యోగంలో నిలదొక్కు కున్నాక ఆలస్యంగా వివాహాలు చేసుకుంటున్నారు. స్త్రీకి ఇరవై ఐదు సంవత్సరాల తరువాత శరీరంలో మార్పులు రావడం మొదలవుతాయి. సంతాన నిరోధక మందుల వల్ల చాలా ప్రమాదాలు ఉన్నాయి. కనుక పిల్లల్ని కనడం అనేది సహజంగా జరిగితే మంచిది. ఇప్పుడు మీరు ఆర్టిఫిషియల్ ఇన్సెమినేషన్ ద్వారా పిల్లల్ని కనే పరిస్థితి ఏర్పడింది. ఇది మీ స్వయం కృతం. ఇది రిస్క్‌తోనూ, ఖర్చుతోనూ కూడుకున్న పని.” అంది డాక్టర్.

“అవును డాక్టర్! నేనే కాదు ఈ రోజుల్లో మేం ఇంకా పిల్లల్ని కనడానికి ప్రణాళిక వేసుకోలేదు అనే నా లాంటి వారికి ఎందరికో మీ సలహా కనువిప్పు” అంది మానస రెండు చేతులు జోడించి. ★





# కోరమీసాల మల్లన్నకు శతకోటి దండాలు

రామచంద్ర రామానుజన్

తెలంగాణలో ప్రసిద్ధ శివాలయాలలో కొమరవెల్లి మల్లన్న ఆలయం ఒకటి. కుమారస్వామి కొంత కాలం ఈ ప్రాంతంలో తపస్సు చేయడం వల్ల కుమారవెల్లి అని పేరు వచ్చి, కాలక్రమంలో 'కొమరవెల్లి'గా, వాడుకలో 'కొమ్రెల్లి'గా మారిందని చెబుతారు. ఈ క్షేత్రాన్ని అపర శ్రీశైలంగా భావిస్తారు. అక్కడికి వెళ్లలేని వారు ఈ మల్లన్నను దర్శించుకునే ఆనవాయితీ ఉంది.

నేటి సిద్దిపేట జిల్లాలోని మండల కేంద్రం కొమరెల్లిలో 11వ శతాబ్దంలో ఇంద్రకీలాద్రి అనే శిఖరంపై పరమశివుడు మల్లికార్జునస్వామిగా వెలసినట్లు పురాణోక్తి. వీరశైవ మతారాధకులు మాదిరాజు, మాదమ్మ దంపతులకు పుత్రుడిగా జన్మించిన పరమేశ్వరుడు తన మహిమలతో భక్తులను కాపాడాడని, కాపాడుతున్నాడని స్థలపురాణాన్ని బట్టి తెలుస్తోంది. శివాంశ సంభూతుడు మల్లన్న మామూలుగా సంప్రదాయబద్ధంగా కనిపించే లింగాకారంలో కాకుండా గంభీరరూపుడిగా, కోరమీసాలతో నిలువెత్తు విగ్రహంగా దర్శనమిస్తున్నాడు. శిరస్సున నాగేంద్రుడు పడగ విప్పి కనిపిస్తాడు. మల్లన్న పరమేశ్వరుడి అవతారమైన మార్తాండ భైరవుడు అని చెబుతారు.

కాకతీయుల పాలన సమయంలో పుట్టమన్నుతో చేసిన స్వామి వారి విగ్రహాన్ని ఇక్కడి గుహలో ప్రతిష్ఠించారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మాలెగావ్ ప్రాంతంలో ఖండోబా (మల్లికార్జున స్వామి) ఆలయ పూజారికి స్వామి కలలో కనిపించి 'కొమరవెల్లి కొండ గుహలో వెలసినట్లు' చెప్పడంతో ఆ పూజారి ఇక్కడికి వచ్చి శివలింగానికి పూజాదికాలు మొదలుపెట్టారట. కొన్నాళ్లకు ఆ శివలింగంపై పెరిగిన పుట్ట మట్టితోనే మాలెగావ్‌లోని స్వామి విగ్రహం తరహాలో ఇక్కడ మూర్తిని తయారు చేశారని తమ పూర్వికులు చెప్పినట్లు ఆలయ అర్చకులు పేర్కొంటున్నారు. మృత్తికా విగ్రహం నాటి నుంచి పూజలందుకుంటున్నప్పటికీ చెక్కుచెదరకపోవడాన్ని విశేషంగా పేర్కొంటారు. ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు స్వామివారి ప్రతిష్టనాడే అంకురరూపం దాల్చిందని చెబుతారు. భక్తులు ముందుగా ఆ చెట్టుకు ప్రదక్షిణ చేస్తారు. మొక్కుబడిగా కొబ్బరికాయను వస్త్రంలో చుట్టి దానికి కడతారు.

మల్లన్న దేవుడు యాదవ, లింగబలిజ సామాజిక వర్గాలకు చెందిన కేతమ్మ, మేడాలమ్మలను పెళ్లాడాడని, ఆ బాంధవ్యంతోనే ఆయా సామాజిక వర్గాల వారే ఆలయంలో పూజాదికాలు నిర్వహిస్తారు. ఏటా మార్గశిర మాసం చివరి ఆదివారం నాడు మొదలయ్యే వార్షిక జాతర ఫాల్గుణ మాసం చివరి ఆదివారం (ఉగాది ముందు వచ్చే ఆదివారం) వరకు కొనసాగుతుంది. ఆ ఆదివారమే ఆలయం తోటబావి ప్రాంగణంలో జరిగే మల్లన్న కేతమ్మ మేడాలమ్మ కల్యాణానికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాల సమర్పణ ఆనవాయితీగా వస్తోంది. కల్యాణోత్సవాన్ని వీరశైవ ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహిస్తారు. రెండు వంశాల వారు అంటే– పగిడన్న వంశీయులు స్వామివారి తరఫున, మహాదేవుని వంశంవారు అమ్మవార్ల తరఫున పెళ్లి తంతు నిర్వహిస్తారు. ఈ సంబరాలు స్వామివారి కల్యాణోత్సవంతో మొదలై అగ్నిగుండాలనే కార్యక్రమంతో ముగుస్తాయి.

**మల్లన్న జాతర**

మకర సంక్రాంతి నుంచి ఉగాది వరకు ప్రతి ఆది, బుధవారాలలో మల్లన్న జాతర జరుగుతుంది. సంక్రాంతి తరువాతిది 'పట్నం' వారంగా, రెండవ ఆదివారాన్ని, బోనాలను లష్కర్ వారం అంటారు. ఆ రెండు రోజులు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారు. తమ ఆడబిడ్డ మేడలాదేవిని మల్లన్న వివాహమాడినందున ఈ వారాన్ని యాదవులు అత్యంత ప్రీతికరంగా భావిస్తారు. భక్తులు ఆ మూడు నెలల కాలంలో బోనం, పట్నం అనే విశేష కార్యక్రమాలలో మొక్కుబడులు సమర్పించుకుంటారు. మల్లన్నను కీర్తిస్తూ జానపద శైలిలో 'ఒగ్గు' వాయిస్తూ పాటలు పాడతారు. జాతర చివరిలో, అంటే కామదహనం (హోలీ) పండుగకు ముందు 'పెద్దపట్నం' అనే కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రకృతి సిద్ధమైన అయిదు రంగులతో వేసే ముగ్గులను 'పట్నం' అని, అది పరిమాణంలో భారీగా ఉంటే 'పెద్దపట్నం' అంటారు. విశాలమైన ముగ్గు మధ్యకి స్వామిని ఆవాహన చేసి సామూహికంగా ఒగ్గులు వాయిస్తూ స్వామిని కీర్తిస్తారు ('పట్నం'లో వాడిన ముగ్గును జాతర తరువాత సేకరించి పంటపొలాల్లో చల్లుతారు). ఆ రాత్రి భారీ పరిమాణంలో కట్టెలను పేర్చి మంత్రబద్ధంగా అగ్ని ప్రతిష్ఠ చేసి కణకణలాడే నిప్పుల మీదుగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను మూడుసార్లు దాటిస్తారు. పెద్ద సంఖ్యలో భక్తులు వారిని అనుసరిస్తారు.

మహాశివరాత్రిని లింగోద్భవ వారంగా వ్యవహరిస్తారు. లింగోద్భవ సమయంలో మల్లన్నకు మహన్యాస రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ఒగ్గు పూజారులు 49 వరుసలతో పెద్దపట్నం (ముగ్గు)వేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మల్లన్నస్వామి ఆలయానికి కొంత చేరువలో కొండపై కొలువుదీరిన రేణుకాదేవిని ఆయన సోదరిగా భావించి భక్తులు బోనాలు సమర్పిస్తారు, జాతర నిర్వహిస్తారు.

**మట్టిపాత్రల ప్రసాదం**

భక్తులు మల్లన్నకు మట్టి పాత్రలలో పదార్థాలను నైవేద్యంగా పెడతారు. ఆ తరువాత ఆ పాత్రలను పాడిపంటల అవసరాలకు వినియోగిస్తారు. దీనివల్ల పాడిపండలు సమృద్ధిగా ఉంటాయని విశ్వాసం. ఆ మట్టి పాత్రలను గృహవసరాలకూ వినియోగిస్తారు. గతంలో ఈ ఆలయంలో ఈ మూడు నెలల్లో ఏడు వారాల పాటే జాతర కొనసాగేదట. దానిని సత్తేటి వారాల జాతర అనే వ్యవహరించేవారు. భక్తుల రద్దీ కూడా అంతంత మాత్రమే కావడంతో ఈ మూడు నెలలు మాత్రమే ఆలయం తెరిచి ఉండేది. రానురాను జాతర సమయంతో పాటు ఇతర సమయాల్లోనూ భక్తుల రద్దీ పెరుగుతోంది. అందుకు తగినట్లుగా మండపాలు, సత్రాలు, నూతన నిర్మాణాలు చేపట్టారు. సుమారు పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించే నీటి పథకానికి 'మల్లన్న సాగర్' అని రాష్ట్ర ప్రభుత్వం నామకరణం చేసింది.

వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్

స్వాతంత్ర్యానికి ముందు భారతీయ సంస్కృతిలో హిందూ, ముస్లింలు అంతర్భాగంగా ఉన్నారు. ఈ రెండు ప్రధాన వర్గాల మధ్య స్నేహం, సోదరభావం ఆదర్శప్రాయంగా ఉంది. మత సామరస్యం ప్రతీకగా ఉన్నారు. స్వాతంత్రోద్యమం జన బాహుళ్య ఉద్యమం. ఈ ఉద్యమంలో అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాలు, అన్ని మతాలు తమ వంతు కృషి చేశాయి. వీరిలో ముస్లింలు కూడా స్వాతంత్ర్యం కోసం ఎంతో కృషి చేశారు. అంతేకాదు, ముస్లిం స్త్రీల పాత్ర కూడా తక్కువేమి కాదు.

# 'మతోన్మాద భావాలకు వ్యతిరేకంగా పోరాడారు'

ప్రథమ ప్రపంచ యుద్ధానంతరం బ్రిటిష్ వారి దాస్య శృంఖలాల నుండి భరతమాతకు విముక్తి లభిస్తుందని భావించిన జాతీయోద్యమ నాయకులకు ఆంగ్లేయులు రౌలట్ చట్టాన్ని తీసుకుని వచ్చి షాక్ ఇచ్చారు. పంజాబ్ ప్రజలు రౌలట్ చట్టం వలన ఇబ్బంది పదుతున్నారు. ఎవరు ఎప్పుడు అరెస్టు అవుతారో ఏ స్వతంత్ర్య సమర యోధుని ఇంటిపై పోలీసులు విరుచుకుపడతారో, ఎంతటి విధ్వంసం సృష్టిస్తారో తెలియని భయానక రోజులవి. ఆ రోజుల్లో కూడా 'మీరు ధైర్యం కోల్పోకండి, వేదనపాలు కావద్దంటున్న – ఈ సాదత్ ప్రార్థన మరువద్దు. ఎలాగైనా మీరు స్వపరిపాలనా స్వేచ్ఛను పొందండి" అంటూ ఉద్యమకారులను ప్రోత్సహిస్తూ ఆమె కవితలు రాసారు. ఆమె పేరు సాదత్ బానో కిచ్లు, డాక్టర్ సైపుద్దీన్ కిచ్లు భార్య.

రౌలట్ చట్టం కిరాతకత్వానికి పంజాబ్ ప్రజలతో పాటు డాక్టర్ సైపుద్దీన్ కిచ్లు బలయ్యారు. ఆయనకు సంకెళ్ళు వేసి అజ్ఞాత స్థావరానికి తరలించారు. అయన ప్రాణాలకు ముప్పు ఉందని ప్రజల్లో తీవ్ర ఆందోళన ప్రారంభమయింది. అయితే విచారణ జరిపి శిక్ష విధించారు. సాదత్ బానో మాట్లాడుతూ "నా భర్తకు శిక్ష పడినందుకు సంతోషంగా ఉంది. ఆ కంటక మార్గంలో సాగి నా ప్రాణాలను బలి ఇవ్వడానికి నేను సర్వదా సిద్ధం" అని ప్రకటించారు.

డాక్టర్ సైపుద్దీన్ కిచ్లు, డాక్టర్ సత్యపాల్‌ను బ్రిటిష్ సైనికులు సంకెళ్లు వేసి అజ్ఞాత స్థావరానికి తరలించినప్పుడు పంజాబ్ ప్రజలు వారి వివరాలు తెలపాలని జలియన్‌వాలాబాగ్‌లో 1919 ఏప్రిల్ 13న సమావేశమయ్యారు. అక్కడ 15వేల నుండి 25 వేల దాకా జనం ఉన్నారు. వారంతా రౌలట్ చట్టానికి నిరసన తెలపడానికి అక్కడ సమావేశ మయ్యారు. ఆ సమావేశంలో డాక్టర్ సైపుద్దీన్ కిచ్లు భార్య సాదత్ బానో కిచ్లు కూడా ఉపన్యాసం చేయాల్సి ఉంది. కానీ ఆవిడ సకాలంలో సమావేశ స్థలానికి చేరుకోలేకపోయారు. రెజినాల్డ్ డయ్యర్ అనే బ్రిటిష్ సైనికాధికారి ప్రధాన ద్వారం మూసివేయించి 50 మంది పోలీసులను పొజిషన్ తీసుకొని ఫైర్ చేయమన్నాడు. 1651 రౌండ్లు పేల్చారు, కాల్పుల్లో 379 మంది పౌరులు మరణించారు. భారత స్వతంత్ర సంగ్రామ చరిత్రలో అత్యంత దురదృష్టకరమైన, హేయమైన సంఘటనగా జలియన్‌వాలాబాగ్ ఉదంతం నిలిచిపోయింది.



డాక్టర్ సైపుద్దీన్ కిచ్లు

మాతృభూమి పట్ల భక్తి భావం గల దేశభక్తులకు అక్షర జ్ఞానం తోడై, ఆ అక్షర యోధులకు దాస్య శృంఖలాల నుండి మాతృభూమిని విముక్తం చేయాలన్న దృఢ సంకల్పంతో పోరుబాటను ఎంచు కొన్న ఉద్యమకారులు జీవిత భాగస్వాములు అయితే అటువంటి మహిళలు అద్భుతాలు సృష్టించగలరు. బేగం సాదత్ బానోకు అటువంటి అవకాశమే దక్కింది.

1893 జనవరి 10న పంజాబ్ రాష్ట్రంలో అమృత్‌సర్‌లో సాదత్ బానో జన్మించారు. ఆమె తండ్రి మియా హఫీజుల్లా, ఆ ఇల్లు విద్యావికాసాలకు పుట్టినిల్లు. ముస్లిం యువతులు చదువుకోవడమే అంతంత మాత్రంగా ఉన్న పరిస్థితుల్లో సాదత్ బానో పలు భాషలు నేర్చుకొన్నారు, అంతే కాకుండా జాతీయ స్ఫూర్తితో కవితలు రాసి గాంధీజీ లాంటి ప్రముఖుల ప్రశంసలను అందుకొన్నారు.

1914 అక్టోబర్ 20న డాక్టర్ సైపుద్దీన్ కిచ్లును వివాహం చేసుకున్నారు. ఆయన కూడా స్వాతంత్ర్య సమరయోధుడు. బారిస్టర్ అయ్యాక న్యాయవాదిగా మొదట రావల్పిండిలో ప్రాక్టీస్ ప్రారంభించినా తరువాత అమృత్‌సర్‌లో స్థిరపడ్డారు. 1919లో లక్షలు ఆర్జించి పెడుతున్న న్యాయవాదవృత్తిని వదిలి ఖిలాపత్ ఉద్యమానికి, జాతీయ కాంగ్రెస్ కార్యక్రమా లకు అంకితమయ్యారు. జలియన్ వాలాబాగ్ హీరోగా ఖ్యాతి గడించారు. బ్రిటిష్ వలసవాదుల చర్యలను తీవ్రంగా వ్యతిరేకించడంతో సుమారు 14 సంవత్సరాల కాలం జైలు గోడల మధ్య గడపాల్సి వచ్చింది. భారత ప్రజలు బానిసత్వం నుండి విముక్తమై స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ సంతోషంగా గడపాలని ఆకాంక్షిస్తూ కఠిన కారాగారవాసాన్ని, క్రూర హింసను భరించారు.



డా॥ కాశింశెట్టి సత్యనారాయణ
**9704935660**

సాదత్ బానో కిచ్లు కలం పట్టి మతోన్మాద భావాలకు వ్యతిరేకంగా పోరాడారు. బయట శత్రువును తరిమికొట్టాలంటే "హిందూ-ముస్లిం" ఐక్యత అవసరమని ఆమె తన కలం ద్వారా, గళం ద్వారా పలుమార్లు ప్రకటించారు. ఆ ప్రయత్నంలో భాగంగా హిందూ సోదరుల మనోభావాలను గాయపర్చరాదు. ఆమె దానిని ఆచరించి చూపారు. హిందూ సోదరులు గోవును ఆరాధిస్తారు గనుక ఆమె తన కుటుంబంలో గోమాంసం వంటకాన్ని పూర్తిగా మానేశారు.

ఆమె రాసిన మరో గేయం– 'నక్షత్రాలతో సంభాషణ.' "నాకు నక్షత్రాలతో గాని, ఆకాశంతో గాని ఏ అవసరం లేదు. నా దేశం, నా భారతదేశం గురించే నా చింత అంతాను. ఆ రోజుని దేవుడు ఏనాటికైనా కళ్లకు చూపిస్తాడా?" అని వాపోయారు.

పంజాబ్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ దురంతాల విచారణకు గాంధీజీ పంజాబ్ వచ్చి సాదత్ బానో కిచ్లును కలిశారు. ఆ సందర్భంగా ఉద్యమకారుల విడుదల కోసం ఓ కవిత రాసి గాంధీజీకి సమర్పించారు.

**"ప్రతి హృదయంలో నీ హృదయం వుంది కదా గాంధీ**
**నీ ప్రశంసలకు ఆలవాలం కదా ప్రతి జిహ్వ గాంధీ**
**యధార్థాన్ని విడమరచి చెప్పాలి మరీ**
**మీ మార్గదర్శకత్వంలో సూచించాలి ఉపాయాన్ని**
**జైలులో పడి వున్న వాళ్లు బంధ విముక్తులవ్వాలి."**

బ్రిటిష్ వారిని ఎదుర్కొనేందుకు జాతీయ ఉద్యమకారులకు శిక్షణ ఇవ్వాలనే ఉద్దేశంతో డాక్టర్ కిచ్లు "స్వరాజ్య ఆశ్రమం" స్థాపించారు. దీన్ని 1921లో గాంధీజీ ప్రారంభం చేయగా దానిలో సర్దార్ భగత్‌సింగ్ లాంటి వారెందరో శిక్షణ పొందారు. ఖాదీ ఉద్యమంలో భాగంగా కిచ్లు దంపతులు జీవితాంతం ఖద్దరు ధరించారు. అంతేకాకుండా ఆమె పిల్లలను కూడా వాటిని ఇష్టపడేటట్లు చేశారు.

కిచ్లు దంపతులు మొదటి నుండీ ముస్లిం లీగ్ ఏర్పాటువాదాన్ని, దేశ విభజనను వ్యతిరేకించారు. విభజన జరగడంతో మతోన్మాదం జాతీయవాదానికి బానిసయ్యింది. మాతృభూమి రెండుగా చీలిపోవడం ఆమె సహించలేకపోయారు, విభజన వలన వచ్చిన ఉపద్రవాన్ని ఆ కుటుంబం చవిచూసింది, వారి ఆస్తిపాస్తులను దుండగులు దోచుకున్నారు. వారు కుటుంబంతో ఢిల్లీ వెళ్లి ముస్లిం శరణార్థుల శిబిరంలో గడపాల్సి వచ్చింది. చివరకు 1963లో డాక్టర్ సైఫుద్దీన్ కిచ్లు, 1970 ఆగష్టు 18న సాదత్ బానో కిచ్లు అనారోగ్యంతో మరణించారు.

Sources
1. Muslims in India Vol 2
-Naresh Kumar Jain, P - 27
2. Dr Abida Samiuddin, P-162
3.Saifuddin Kichlew - Hero of Jalian Wala Bagh.
-Toufique Kitchlew, P-42
4. భారత స్వాతంత్ర్యోద్యమం – ముస్లిం మహిళలు
– సయ్యద్ నశీర్ అహమ్మద్ పే.– 167

★



# వీళ్లు రైతులేనా?

నిజానికి నూతన సాగు చట్టాలకు దేశంలోని అత్యధిక శాతం మంది రైతులు అనుకూలంగా ఉన్నారు. ఈ మూడు చట్టాల విషయంలో కేంద్రానికి మద్దతు తెలపాలని, ఢిల్లీ వచ్చి సభలు నిర్వహించాలని నిజమైన రైతులు భావించినా ఒక్కరోజుకి మించి తమ వ్యవసాయ క్షేత్రాలను వదిలి ఉండలేరు. ఎందుకంటే వ్యవసాయ పనులు దెబ్బతింటాయి కాబట్టి. కానీ రైతు ఉద్యమకారుల ముసుగులో రహదారులపై ఉన్న వారి పరిస్థితి వేరు. ఒక సంవత్సరం కాలంగా ఢిల్లీ సరిహద్దు రోడ్లపై వారు గుడారాలలో నివసిస్తున్నారు. నిజమైన రైతులయితే అన్ని రోజులు



వ్యవసాయ క్షేత్రాలను వదిలి ఉండగలరా?

మరో విషయం. ఇప్పుడు సాగు చట్టాలను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఇప్పుడైనా నిరసనలు ఆపేయవచ్చు కదా. కానీ అలా చేయడం లేదు. ఎందుకంటే ఈ విషయంలో ఎలా స్పందించాలో వీళ్లకి ఇన్ని రోజులు తమ వెనకాల ఉండి, ఆర్థిక సహకారం అందించిన వారు ఇంకా చెప్పలేదు కావొచ్చు. అందుకే వాళ్ల నాయకుడు తికాయత్ ఇప్పుడే రహదారులు ఖాళీ చేయమని చెబుతున్నాడు. సంబంధం లేని, సాధ్యంకాని డిమాండ్లు కొత్తగా తెరపైకి తీసుకొస్తున్నారు.

ఇక రాహుల్‌గాంధీ, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు కూడా ఈ విషయంలో ఎలా స్పందించాలో తెలియలేదు. ఇది రైతుల విజయంగా అభివర్ణించారు. అంతేతప్ప తమ (ప్రతిపక్షాలు) విజయంగా చెప్పలేదు. కారణం రైతు చట్టాలకు అనుకూలంగా ఉన్న రైతుల ఆగ్రహానికి గురి కావడం ఇష్టంలేక. సాగు చట్టాలకు అనుకూలంగా ఉన్న రైతులు ముందు వాటిని తిరిగి తేవాలని ఉద్యమం చేసే సూచనలు కనిపిస్తున్నాయి.

**– కడియాల బాల సుబ్రహ్మణ్యం,**
**రాజమండ్రి.**

# వణికిస్తున్న

2020, 2021 సంవత్సరాలు యావత్ ప్రపంచానికి చేదు అనుభవాలను మిగిల్చాయి. కరోనా మహమ్మారి కారణంగా ఈ భూమండలంలోని అన్ని దేశాలు అతలాకుతల మయ్యాయి. పేద, పెద్ద, చిన్న… అనే తేడా లేకుండా అన్ని దేశాలు కరోనా తాండవానికి అల్లకల్లోలమయ్యాయి. శక్తిమంతమైన దేశాలు సైతం కరోనా ధాటికి చిగురుటాకుల్లా వణికిపోయాయి. పెద్దయెత్తున ప్రాణ, ధన నష్టం సంభవించింది. అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకులాయి. ఇప్పుడిప్పుడే కరోనా నుంచి క్రమంగా ప్రపంచం కోలుకుంటోంది. ప్రజల సాధారణ జీవితం మళ్లీ మొదలైంది. ప్రపంచం భయం భయంగా సాగుతోంది. లాక్‌డౌన్ నుంచి ప్రభుత్వాలు, ప్రజలు బయటపడుతున్నారు. ఆర్థిక వ్యవస్థలు గాడిన పడుతున్నాయి. పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కర్మాగారాల్లో ఇప్పుడిప్పుడే సందడి మొదలైంది. క్రమంగా ప్రపంచం కుదుట పడుతుందనుకుంటున్న తరుణంలో తాజాగా వెలుగు చూస్తున్న కరోనా కొత్త వేరియంట్లు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా 'ఒమిక్రాన్' యావత్ ప్రపంచాన్ని వణికిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు అందరి నోటా వినిపిస్తున్న మాట ఇది. కొవిడ్ రెండో తీవ్రతకు కారణమైన డెల్టా కంటే ఇది ఆరు రెట్లు వేగంగా విస్తరిస్తుంది. రోజుల వ్యవధిలోనే ఇది దాదాపు 40 దేశాలకు విస్తరించింది. దక్షిణాఫ్రికాలో వెలుగుచూసిన ఒమిక్రాన్ తీవ్రత ఎంత, దానిని టీకా ఎదుర్కోగలదా తదితర అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని, ఉదాసీనతను విడనాడాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది.




దీనికి సంబంధించి భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఒమిక్రాన్.. గురించి అతిగా భయపడాల్సిన అవసరం లేదని, దీని ప్రభావం పెద్దగా ఉండదని, అయితే అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వైద్యరంగ నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం కూడా ఇదే మాటను నొక్కి చెబుతోంది. దీని ప్రభావం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అదే సమయంలో జాగ్రత్తలు పాటించడం తప్పనిసరని స్పష్టం చేస్తోంది. భౌతిక దూరం పాటించడం, మాస్కులు ధరించడం, వీలైనంతవరకు బయటకు వెళ్లకుండా ఉండటం, ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో సంచరించకపోవడం, రాత్రివేళల్లో కర్ఫ్యూ, సామూహిక కార్యక్రమాలకు దూరంగా ఉండటం.. వంటి జాగ్రత్తలు పాటించడం ద్వారా 'ఒమిక్రాన్' తల వంచవచ్చని చెబుతున్నారు. అదే సమయంలో వచ్చే జనవరిలో దీని ప్రభావం వల్ల కరోనా కేసులు పెరిగే అవకాశం కూడా లేకపోలేదని వైద్య ఆరోగ్యశాఖ హెచ్చరిస్తోంది. మాస్కులు ధరించని వారిపై కేసులు నమోదు చేసేందుకు, జరిమానా విధించేందుకు పోలీసు యంత్రాంగం సిద్ధమైంది. ఇంతకుముందు కూడా పోలీసు శాఖే ఈ బాధ్యతను చేపట్టింది. గత ఏడాది మార్చిలో లాక్‌డౌన్ సమయం నుంచి మాస్క్ లేకుండా బహిరంగ ప్రదేశాలలో సంచరించిన వారిపై డిజాస్టర్ మేనేజ్‌మెంట్ చట్టంలోని సెక్షన్ 51 కింద 13 లక్షలకు పైగా కేసులు నమోదు చేశారు. ఒక్కొక్కరికి రూ. 1000 చొప్పున జరిమానా విధించారు. సుమారు రూ. 131 కోట్లు వసూలు చేశారు. మరోపక్క ఒమిక్రాన్‌ను నివారించేందుకు బూస్టర్ డోస్ వేసే విషయమై ప్రభుత్వ వర్గాలు అంతర్గతంగా ఆలోచన చేస్తున్నాయి.

ఒమిక్రాన్ ప్రభావం గురించి అధ్యయనం జరుగుతోందని, అయితే దాని గురించి మరీ అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భారతీయ ప్రజారోగ్య సంస్థ అధ్యక్షుడు, ప్రముఖ గుండె వ్యాధుల నిపుణులు డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటివరకు కొన్ని దేశాల్లో కేసులు నమోదైనప్పటికీ వాటి ప్రభావం తక్కువే. అవి అన్ని స్వల్ప లక్షణాలతో కూడుకున్నవే. వాటి తీవ్రత గురించి నిర్ధారణ కావాలంటే కొంతకాలం వేచిచూడక తప్పదు. అయితే ఒమిక్రాన్ వల్ల ఇన్ఫెక్షన్ బారిన పడే ప్రమాదం లేకపోలేదు. స్థూలంగా చూస్తే కరోనా మూడోదశ ఒమిక్రాన్ ప్రభావం తక్కువేనని, మరీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కాన్పూర్ ఐఐటీ ఆచార్యుడు మణీంద్ర అగర్వాల్ స్పష్టం చేశారు. టీకా తీసుకున్న వారికి వ్యాధి సోకకపోవచ్చని అమెరికా అంటువ్యాధుల నిపుణుడు డాక్టర్ ఆంటోనీ ఫౌచీ స్పష్టం చేశారు. కొత్త వేరియంట్ డెల్టాను మించిపోతుందని చెప్పలేమని అమెరికా జాతీయ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ కొలిన్స్ పేర్కొన్నారు.

కరోనా గురించి తక్కువగా అంచనా వేయరాదని, అదే సమయంలో నిర్లక్ష్యమూ పనికిరాదని తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు (డైరెక్టర్ ఆఫ్ హెల్త్) డాక్టర్ జి. శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతానికి స్వల్ప లక్షణాలే ఉన్నాయని, జనవరి నాటికి కేసులు పెరిగే అవకాశం లేకపోలేదని ఆయన వివరించారు. ప్రతి ఒక్కరూ రెండు డోసుల టీకా వేయించుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో లాక్‌డౌన్ విధించే అవకాశం లేనేలేదని, అది సమస్యకు పరిష్కారం కాదని ఆయన స్పష్టంచేశారు. నిర్ధారణ పరీక్షలు పెంచడం, బాధితులకు సరైన చికిత్స అందించడం.. అన్నింటికన్నా ప్రధానమన్నారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి, ఇతర కారణాలతో ముప్పున్న వారికి బూస్టర్ డోస్ ఇవ్వాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వైద్య వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. ఒమిక్రాన్‌ను పక్కనపెడితే.. ఇప్పటికే డెల్టా వేరియంట్ మన దగ్గర ప్రభావం చూపుతోంది. అంతమాత్రాన అందరికీ బూస్టర్ బోస్ తప్పనిసరి

జి. వి. ప్రసాద్

# ఒమిక్రాన్

కాదు. ముఖ్యంగా ఆరు పదులు దాటిన వారికి, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, మధుమేహం, గుండె, మూత్రపిండాలు, కాలేయం తదితర జబ్బులతో బాధపడుతున్న వారికి, వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారికి ప్రాధాన్య క్రమంలో బూస్టర్ డోస్ ఇవ్వాలి. కొవిడ్ రోగులకు చికిత్స అందించే డాక్టర్లు, నర్సులు తదితర ఆరోగ్య సిబ్బందికి సైతం బూస్టర్ డోస్ ఇవ్వడం తప్పనిసరి. 40 సంవత్సరాలు దాటిన వారికి, ముప్పు ఎక్కువగా ఉన్న వారికి బూస్టర్ డోస్ అందించే అవకాశాన్ని పరిశీలించవచ్చని కరోనా జన్యుక్రమాన్ని విశ్లేషించే కన్సార్టియం (ఇన్సాకాగ్) సిఫార్సు చేసింది. గత నెల 29న తన బులిటెన్‌లో ఇన్సాకాగ్ చేసిన ఈ సిఫార్సు తాజాగా వెలుగులోకి వచ్చింది. అమెరికా, బ్రిటన్ మాత్రమే ఇప్పటివరకు బూస్టర్ డోసుకు అనుమతించాయి.

**నిపుణుల సూచన మేరకే... మంత్రి**

ఒమిక్రాన్‌పై ప్రభుత్వం సమగ్రంగా అన్ని కోణాల్లో అధ్యయనం చేస్తోందని కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవీయ తాజాగా పార్లమెంటులో స్పష్టం చేశారు. పెద్దలకు బూస్టర్ డోస్, చిన్నారులకు కరోనా టీకా అందించే విషయమై నిపుణుల సలహా మేరకే ముందుకు వెళతామని ఆయన తెలిపారు. దేశ ప్రజానీకంలో 85 శాతం మందికి తొలి డోసు, 50 శాతం మందికి రెండో డోసు ఇచ్చామని ఆయన తెలిపారు. 12-17 ఏళ్ల వయసు గల పిల్లల కోసం కొవిడ్ టీకాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ప్రతిపాదన ప్రస్తుతానికి లేదని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయమంత్రి భారతీ ప్రవీణ్ పవార్ వెల్లడించారు. చిన్నారుల టీకాలకు సంబంధించి జాతీయ టీకా నిపుణుల కమిటీ నిశితంగా పరిశీలిస్తోందని ఆమె చెప్పారు. విదేశీ టీకాలపై నిర్ణయం తీసుకునే అధికారం నేషనల్ ఎక్స్‌పర్ట్ గ్రూప్ ఆన్ వ్యాక్సిన్ అడ్మినిస్ట్రేషన్ ఫర్ కొవిడ్-19 (నెగ్ వాక్), నేషనల్ టెక్నికల్ అడ్వైజరీ గ్రూప్ ఆన్ ఇమ్యూనైజేషన్ (ఎన్ టాగి) లకు అప్పగించినట్లు మంత్రి వెల్లడించారు.

బాలల కోసం దేశీయంగా తయారు చేస్తున్న టీకాలు వివిధ దశల్లో ఉన్నాయి. మరోపక్క అంతర్జాతీయ ప్రయాణికులపై నిఘా పెట్టాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. సరిహద్దులను మూసేయడం, విమానాలను నిలిపేయడం తదితర చర్యలు పాటించడం వల్ల వ్యాప్తిని కొంతవరకు తగ్గించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. మాస్కుల ధారణ, భౌతిక దూరం, టీకాలు, వైద్య వ్యవస్థలను బలోపేతం చేయడం, ఐసీయూ పడకలను సిద్ధం చేయడం ద్వారా ముప్పును నివారించవచ్చు. డెల్టా నియంత్రణకు పాటించిన పద్ధతులు, నియంత్రణలు యథాతథంగా పాటించడం ద్వారా ఒమిక్రాన్‌ను నివారించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ పశ్చిమ పసిఫిక్ ప్రాంత డైరెక్టర్ డాక్టర్ టకెషి కాసాయ్ వెల్లడించారు. దక్షిణాఫ్రికాలో వెలుగుచూసిన ఒమిక్రాన్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే సభ్యదేశాలను అప్రమత్తం చేసింది. ఇప్పటి వరకూ తీసుకుంటున్న కరోనా జాగ్రత్తలనే మున్ముందూ మరింత కఠినంగా, పకడ్బందీగా పాటించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం అందు బాటులో ఉన్న వివిధ రకాల కొవిడ్ టీకాలు ఒమిక్రాన్ నియంత్రణలో కొంతవరకు పని చేయగలవు. కరోనా నివారణకు వివిధ సంస్థలు తయారు చేసిన టీకాలను బూస్టర్ డోస్‌గా వాడవచ్చని వైద్యవర్గాలు చెబుతున్నాయి. గతంలో రెండు డోసులు పొంది, తరవాత మూడో డోసు పొందిన వారిలో బలమైన రోగనిరోధక వ్యవస్థ తయారైంది. ఈ విషయాన్ని ప్రముఖ వైద్య పత్రిక 'ద లాన్సెట్' వెల్లడించింది. ఒమిక్రాన్‌పై కొవాగ్జిన్ టీకా మెరుగ్గా పనిచేసే అవకాశం ఉందని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

మరోపక్క కరోనా కేసుల పెరుగుదల, ఒమిక్రాన్ వ్యాప్తిపై దేశీయ పరిశోధన సంస్థలు అప్రమత్త మయ్యాయి. దీనిని నివారించేందుకు పరీక్షల దిశగా అడుగులు వేస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన సీసీఎంబీ (సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ), ఐఐసీటీ వంటి సంస్థలు పరీక్షలు చేపట్టాయి. మురుగునీటి నమూనాలను సేకరించి పరీక్షించడం ద్వారా కొవిడ్‌తో పాటు ఇతర



మహమ్మారులను, అంటువ్యాధులను గుర్తించడానికి, వ్యాప్తిని నివారించడానికి వీలవుతుంది. గతంలో పోలియో నిర్మూలనకు ఇదే పద్ధతిని పాటించారు. కరోనా రెండో దశలోనూ ఇదే పద్ధతిని అనుసరించారు. వ్యాధి తగ్గుముఖం పట్టడం, నిధుల సమస్య కారణంగా తరవాత పరిశోధనలు నిలిపివేశారు. హైదరాబాద్‌తో పాటు మరికొన్ని నగరాల్లో ఈ పరీక్షలు చేపట్టనున్నట్లు హైదరాబాద్‌లోని సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్‌కుమార్ నందికూరి వెల్లడించారు. ఇతర ప్రపంచ దేశాలతో పోలిస్తే ఇప్పటివరకూ కరోనా నియంత్రణలో భారత్ మెరుగ్గా వ్యవహరించింది. ఆ అనుభవంతో మూడోదశనూ సమర్థంగా ఎదుర్కొనేందుకు సమాయత్తమవుతోంది. ఈ దిశగా నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ సర్కారు వేగంగా అడుగులు వేస్తోంది.

వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్

దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి, ఇతర కారణాలతో ముప్పున్న వారికి బూస్టర్ డోస్ ఇవ్వాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వైద్య వర్గాల నుంచి వ్యక్తమవు తోంది. ఒమిక్రాన్‌ను పక్కనపెడితే.. ఇప్పటికే డెల్టా వేరియంట్ మన దగ్గర ప్రభావం చూపుతోంది. అంతమాత్రాన అందరికీ బూస్టర్ బోస్ తప్పనిసరి కాదు. ముఖ్యంగా ఆరు పదులు దాటిన వారికి, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, మధుమేహం, గుండె, మూత్రపిండాలు, కాలేయం తదితర జబ్బులతో బాధపడుతున్న వారికి, వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారికి ప్రాధాన్య క్రమంలో బూస్టర్ డోస్ ఇవ్వాలి.



# తిట్ల రాజకీయం వెనుక కొత్త

తెలంగాణలో కొంతకాలంగా రాజకీయాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ప్రధానంగా అధికార టీఆర్ఎస్ వ్యవహారశైలి, ముఖ్యమంత్రి కేసీఆర్ అనుసరిస్తున్న తీరు రాష్ట్రమంతటా చర్చనీయాంశమవుతోంది. ఎందుకు, ఎలా, ఎవరి వల్ల, ఎందుచేత? అనే ప్రశ్నలు పక్కనబెడితే జనంలో ఒకరకమైన చర్చకు కేంద్రబిందువుగా మారుతోంది. ఇప్పటికే ఉన్న సమస్యలు, కొంతకాలంగా క్షేత్రస్థాయిలో టీఆర్ఎస్ పట్ల నెలకొన్న వ్యతిరేకత, హుజురాబాద్ ఉపఎన్నిక ఫలితాలు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు వంటి అంశాలన్నీ పక్కకెళ్లిపోయాయి. టీఆర్ఎస్ నేతల విమర్శలు, కేసీఆర్ పలు సందర్భాల్లో చేస్తున్న దుందుడుకు వ్యాఖ్యలపైనే చర్చ జరుగుతోంది. ఇదంతా పక్కా వ్యూహం ప్రకారమే జరుగుతోందని, జనం దృష్టి మరల్చి ప్రభుత్వ వ్యతిరేకతను కొంతయినా మర్చిపోయే పరిస్థితులు కల్పిస్తున్నారన్న విశ్లేషణలు కొనసాగుతున్నాయి. అయితే, ఈ వ్యూహాల వెనుక, తాజా పరిణామాల వెనుక కేసీఆర్ మాస్టర్ మైండ్ ఉన్నట్లు చర్చ మొదలయింది.

హుజురాబాద్ ఉపఎన్నిక ఫలితం కేసీఆర్‌లో తీవ్రమైన అలజడికి కారణమయింది. ఆయన ఏం చెబుతున్నారో, ఏ ప్రకటన చేస్తున్నారో ఆయనకే అర్థంకాని పరిస్థితి నెలకొందని పార్టీశ్రేణులే కుండబద్దలు కొట్టిన సందర్భాలున్నాయి. మరోవైపు, ఇదే తగిన సమయంగా భావించిన కొందరు సొంతపార్టీ నేతలు ఇన్నాళ్లు మనసులో ఉన్న మాటలు, అభిప్రాయాలు బయటకు చెప్పుకోలేక కుమిలిపోయిన నాయకులు నెమ్మదిగా తమ అభిప్రాయాల్ని బాహాటం చేస్తున్నారు. కేసీఆర్‌ది నియంతృత్వ ధోరణి అంటూ వ్యతిరేకిస్తున్నారు. అయితే ఈ పరిణామాల వెనక రాజకీయ 'కన్సల్టెంట్ ప్లాన్' ఉన్నట్లు అర్థమైపోయింది. రాజకీయ వ్యూహకర్తగా పేరున్న ప్రశాంత్ కిషోర్.. కేసీఆర్‌కు సలహాలు ఇస్తున్నారన్న చర్చ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

సీఎం కేసీఆర్ ఇటీవల రూటు మార్చారు. దారుణమైన తిట్లతో వివాదాస్పద రాజకీయం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తీవ్రమైన దూషణలకు దిగుతున్నారు. ఎందుకిలా చేస్తున్నారో చాలా మందికి అర్థం కావడం లేదు. హుజురాబాద్ గురించి నభూతో నభవిష్యత్ మాదిరిగా కష్టపడినా, రాష్ట్ర ఖజానానే ఓ దశలో ఖాళీచేసే స్థాయిలో వరాలజల్లు కురిపించినా.. జనం కాషాయ కండువా కప్పుకున్న ఈటలకే జై కొట్టడం కేసీఆర్‌కు మింగుడు పడలేదని, అందుకే ఆ స్థాయిలో వ్యక్తిగత దూషణలకు దిగుతున్నాడని అంతా అనుకున్నారు. సాక్షాత్తూ గౌరవప్రదమైన పదవిలో ఉన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని తీవ్రస్థాయిలో దూషించారు. ఇదంతా ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న దూషణల రాజకీయాలకు ఏమాత్రం తీసిపోవడం లేదు. ఏపీలో ఏకంగా మంత్రులే ప్రత్యర్థులపై దిగజారుడు వ్యాఖ్యానాలు, విమర్శలు చేస్తున్నారు. సాక్షాత్తూ అసెంబ్లీ వేదికనుంచే ఇంట్లోవాళ్లు, మహిళల పట్ల కించపరిచే విమర్శలు చేశారు. ఇప్పుడు కేసీఆర్ కూడా అలాంటి భాషనే వాడుతున్నారు.

కొద్దిరోజుల పాటు తెలంగాణ మంత్రులు కూడా అనుచిత విమర్శల బాట పట్టారు. అది కూడా ఏపీ సర్కారు, ఏపీ మంత్రులు, ముఖ్యమంత్రి లక్ష్యంగా దూషణలు కొనసాగించారు. అప్పుడే తెలంగాణ రాజకీయాల్లో ఈ స్థాయి విమర్శలపై విస్తృతంగా చర్చ జరిగింది. తర్వాత ఆ తరహా విమర్శలు సద్దు మణిగాయి. కానీ, కొంత సమయం తర్వాత కేసీఆర్..

సుజాత గోపగోని, 6302164068

స్వయంగా దిగజారుడు విమర్శలకు పాల్పడుతున్నారు. అయితే, స్వయంగా కేసీఆరే ఈ తరహా రాజకీయాలకు కేంద్రబిందువుగా మారడంతో రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ప్లాన్ అయ్యుండొచ్చన్న చర్చ సాగుతోంది. ఎందుకంటే ఏపీలో ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఐప్యాక్ సంస్థ.. వైసీపీకి రాజకీయ సలహాలను అందిస్తోంది. వైసీపీ వ్యూహాలను ఖరారుచేస్తోంది. జనం దృష్టిని మరల్చగలిగే ప్లాన్లను రూపొందించి అమలు చేయిస్తోంది. ఇప్పుడు అదే పద్ధతిలో తెలంగాణ సీఎం విమర్శల వర్షం కురిపిస్తుండటంతో ఈ పోలిక నిజమే అన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. కొంతకాలం క్రితం తెలంగాణ మంత్రులు చేసిన వ్యాఖ్యలు శాంపిల్స్‌గా భావిస్తున్నారు. ఆ సమయంలో మంత్రులు చేసిన వ్యాఖ్యలతో రాజకీయాల ప్రాధాన్యం మారిపోయింది. జనం దృష్టి మళ్లింది. ఆ పరిణామం విజయవంతం కావడంతో.. కేసీఆర్ ఆ ఫార్ములాను పాటిస్తున్నారన్న విశ్లేషణలు కొనసాగుతున్నాయి.

జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో తెలంగాణలో టీఆర్ఎస్‌కు ప్రశాంత్ కిషోర్ వ్యూహాలు అందించడం ప్రారంభమైందని అంచనా వేస్తున్నారు. టీఆర్ఎస్ కోసం పీకే టీం పని చేయబోతోందని..

# వ్యూహం?

ఈ మేరకు గతంలో ఓ సారి ప్రగతి భవన్‌లో సమావేశం అయ్యారన్న ప్రచారం జరిగింది. దానికి అధికారిక ప్రకటన రాలేదు. పీకేకు చెందిన ఐ ప్యాక్ కూడా టీఆర్ఎస్ కోసం పని చేస్తున్నట్లుగా ఎలాంటి సూచనలు ఇవ్వలేదు. కానీ, ఇటీవలే పీకే టీమ్‌కు చెందిన ఐ ప్యాక్ బృందం కేసీఆర్‌తో, టీఆర్ఎస్ శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమైందని తెలుస్తోంది. ప్రశాంత్ కిషోర్, ఆయన సంస్థ ఐప్యాక్ వ్యూహకర్తగా సేవలందించేందుకు ఒప్పందం కుదిరిందని అంటున్నారు. అంతేకాదు.. ఇటీవల ఢిల్లీ పర్యటనలో కూడా కేసీఆర్ పలుసార్లు పీకేతో భేటీ అయ్యారన్న వాదనలున్నాయి. అందుకే, ప్రశాంత్ కిషోర్ సలహాలతోనే ఉద్రిక్తతలు పెంచేలా తిట్ల రాజకీయం చేస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. పీకే మార్క్ రాజకీయాలు ఎలా ఉంటాయో.. కేసీఆర్ కూడా అచ్చంగా అదే రాజకీయ వ్యూహాలు అమలు చేస్తున్నారన్న అనుమానం తెలంగాణ రాజకీయాల్లో సహజంగానే వ్యక్తమవుతోంది. వాస్తవానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఆ స్థాయిలో తిట్టాల్సిన అవసరం కేసీఆర్‌కు లేదు. కానీ, పరిస్థితులను, పరిణామాలను జనం దృష్టి మళ్లించే స్థాయిలో అంత దారుణంగా తిట్టారు కేసీఆర్. అయితే, ఇదంతా ప్రశాంత్ కిషోర్ చలువేనని.. పదవిని కాపాడుకునేందుకు కేసీఆర్ అనాలోచితంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నిజంగానే కేసీఆర్‌కు ప్రశాంత్ కిషోర్ వ్యూహాలు సమకూర్చే సేవలు ప్రారంభిస్తే తెలంగాణ రాజకీయాలు మరింత దిగజారడం ఖాయమన్న చర్చ జరుగుతోంది.

ఈనెల ఒకటో తేదీన తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుందంటున్నారు. ప్రశాంత్ కిశోర్‌కు చెందిన ఐప్యాక్ బృందం తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయంలో సందడి చేసిందని అంటున్నారు. ఐప్యాక్ ప్రతినిధులు కేసీఆర్‌తోనూ, టీఆర్ఎస్ నేతలతోనూ సుదీర్ఘంగా సమావేశమయ్యారని చెబుతున్నారు. తొలుత రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు, ప్రజల అభిప్రాయాలు, కేసీఆర్‌పై ఓటర్ల వైఖరి తదితర అంశాలపై సర్వే చేసేందుకు సన్నద్ధమైనట్లు సమాచారం. రాష్ట్రంలోని ఓటర్ల మానసిక స్థితిని అంచనా వేసేందుకు కూడా అవసరమైన సర్వేలు చేయాలని కేసీఆర్ సూచించారని చెబుతున్నారు. ఈ క్రమంలో.. సర్వేలు మొదలైనట్లు కూడా చెప్పుకుంటున్నారు.

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు రెండేళ్ల సమయం మాత్రమే ఉన్నందున.. ఇప్పటినుంచే పీకే టీమ్ సేవలను వినియోగించుకోవాలని టీఆర్ఎస్ నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. తమ ప్రభుత్వానికి ఆదరణ తగ్గుతోందని ఆందోళన చెందుతున్న కేసీఆర్.. తన వైఫల్యాలకు గల కారణాలను విశ్లేషించుకొనేందుకు పీకే టీమ్ సర్వేలు తోడ్పడతాయని అభిప్రాయపడ్డారట. క్షేత్రస్థాయిలో అధికార



ప్రశాంత్ కిషోర్

టీఆర్ఎస్‌పైనా, కేసీఆర్‌పైనా వ్యతిరేకత స్థాయి ఎక్కువగా ఉండటంతో సర్వే చాలావరకు కలిసి వస్తుందని చెప్పారట. అలాగే. ఈటల రాజేందర్ బీజేపీలో చేరడం, హుజురాబాద్ ఎన్నికల్లో విజయం సాధించడం ఎలాంటి ప్రభావం చూపిస్తాయో కూడా తెలియాల్సి ఉందని కేసీఆర్ అంటున్నారట. వాస్తవానికి కొంతకాలం క్రితం ప్రశాంత్ కిషోర్‌తో కేసీఆర్ కుమారుడు కేటీఆర్ సమావేశమయ్యారు. మహారాష్ట్రలో శరద్ పవార్‌తో పీకే సమావేశాలు నిర్వహిస్తున్న సమయంలోనే ఈ సమావేశం జరిగింది. మరో ఆసక్తికరమైన విషయమేంటంటే, వైఎస్ షర్మిలకు ఇప్పుడు పీకే టీమ్ సభ్యురాలు ప్రియా సలహాలు, సూచనలు అందిస్తున్నారు. మరి కేసీఆర్‌కు పీకే టీం సలహాలు ఇస్తారా? అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయితే, ప్రస్తుతం ప్రభుత్వం పీకే టీం నుంచి సర్వే మద్దతును మాత్రమే కోరినట్లు తెలుస్తోంది. అవసరాన్ని బట్టి తదుపరి సేవలు నిర్ణయిస్తారని సమాచారం.

రాజకీయాల్లో కేసీఆర్‌నే పెద్ద వ్యూహకర్తగా చెప్పుకుంటారు. మరి.. అలాంటి నాయకుడు వేరే వ్యూహకర్త సలహాలు తీసుకుంటాడా? అన్న చర్చ కూడా రాజకీయవర్గాలలో సాగుతోంది. కానీ, ఆ అవసరం, అనివార్యమన్న పరిణామాలు ఇటీవలి కాలంలో చోటుచేసుకున్నాయి. తెలంగాణలో బీజేపీ ఊహించని స్థాయిలో పుంజుకుంది. పలు ఉప ఎన్నికల్లో సత్తా చాటింది. ప్రజల్లోకి ఉవ్వెత్తున దూసుకెళ్లింది. ఈ పరిస్థితుల్లో బీజేపీని ఎదుర్కోవడం కష్టసాధ్యమన్న అంచనాకు వచ్చిన కేసీఆర్ పీకే వ్యూహాలకు సై అన్నట్లు సమాచారం.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

ఈనెల ఒకటో తేదీన తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుందంటున్నారు. ప్రశాంత్ కిశోర్‌కు చెందిన ఐప్యాక్ బృందం తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయంలో సందడి చేసిందని అంటున్నారు. ఐప్యాక్ ప్రతినిధులు కేసిఆర్‌తోనూ, టీఆర్ఎస్ నేతలతోనూ సుదీర్ఘంగా సమావేశమయ్యారని చెబుతున్నారు.



(1933 - 2021)

కొల్లూరులో చదివారు. గుంటూరు హిందూ కాలేజీలో వాణిజ్యశాస్త్రంలో డిగ్రీ పూర్తిచేశారు.

20 ఏళ్ల వయసులో కొత్త రఘురామయ్య నేతృత్వంలో కర్షకనేత ఆచార్య ఎన్జీ రంగా ఏర్పాటు చేసిన కిసాన్ యాత్రా స్పెషల్‌లో వందలాది రైతులతో పాటు ఉత్తర భారతదేశమంతా పర్యటించడం రోశయ్య తొలి రాజకీయానుభవం. ఆ యాత్రలో భాగంగా అప్పటి ప్రధాని నెహ్రూని కూడా ఆయన కలిశారు.

రోశయ్య ప్రజాక్షేత్రంలో జనం ఓట్లతో నాయకుడైన సందర్భాలు తక్కువ. పెద్దలసభ (శాసన మండలి) రద్దయి, తప్పనిసరి పరిస్థితుల్లో ఒకటి, రెండు సందర్భాల్లో ప్రజానాయక పాత్ర పోషించి ప్రజల ఓట్లు అడగాల్సిన పరిస్థితి ఎదురయింది. ఆయన ఎన్నికల రాజకీయం ఓటమితోనే మొదల యింది. చీరాల నియోజకవర్గం నుంచి ప్రముఖ చేనేత నేత ప్రగడ కోటయ్య మీద 1967లో పోటీ చేసి ఓడిపోయారు.

మరుసటి ఏడాది రాజాజీ స్థాపించిన స్వతంత్ర బాధ్యతలు చేపట్టారు. చీరాల నియోజకవర్గం నుంచి 1989, 2004లో రెండు పర్యాయాలు ఎమ్మెల్యే గెలుపొందిన రోశయ్య సుదీర్ఘకాలం ఆర్థికమంత్రిగా పనిచేశారు. అప్పట్లో మొదటిసారిగా లక్షకోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రోశయ్య తన ఆర్థిక చాతుర్యాన్ని చాటారు.

రాజశేఖరరెడ్డి మరణించడంతో 2009 సెప్టెంబర్ 3 నుంచి 2010 నవంబరు 24 వరకూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా రోశయ్య బాధ్యతలు నిర్వహించారు. అనంతరం 2011 ఆగస్టు 31 నుంచి 2016 ఆగస్టు 30 వరకూ తమిళనాడు గవర్నరుగా సేవలందించారు. గవర్నరుగా పదవీ విరమణ అనంతరం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. డిసెంబర్ 4, 2021న అనారోగ్యంతో మరణించారు.

**వరించిన ఎన్నో పదవులు..**

1979లో టంగుటూరి అంజయ్య ప్రభుత్వంలో రవాణా, గృహనిర్మాణం, వాణిజ్య పన్నుల శాఖలు; 1982లో కోట్ల విజయభాస్కరరెడ్డి ప్రభుత్వంలో హోం శాఖ; 1989లో మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక,

# పదవులకే వన్నె తెచ్చిన నేత

**అందరి బంధువు, అజాతశత్రువు కొణిజేటి రోశయ్య. కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నుంచి ముఖ్యమంత్రిగా ఎదిగిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శం. 70 ఏళ్ల ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితం రాజకీయాల్లో రాణించాలనుకుంటున్న నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తిదాయకం.**

'ప్రజాసేవాతత్పరత, దేశభక్తి, చిత్తశుద్ధి, అంకితభావమే అప్పటి రాజకీయాల్లో ప్రవేశించిన మాలాంటి వాళ్లకి పునాది...' అని తరచూ చెప్పుకున్న రోశయ్య.. ఇప్పుడున్న రాజకీయ వాతావరణం, పరిస్థితులు 1950లలో ఉండి ఉంటే తాను అసలు రాజకీయాల్లో ప్రవేశించగలిగేవాడ్ని కాదు, మనగలిగే వాడ్ని కాదు అని ఇటీవల ఒక టీవీ ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు.

కొణిజేటి రోశయ్య గుంటూరు జిల్లా వేమూరులో 1933 జూలై 4న ఓ దిగువ మధ్యతరతి కుటుంబంలో ఆదెమ్మ, సుబ్బయ్య దంపతులకు జన్మించారు. ఐదో తరగతి వరకూ సొంత ఊళ్లో, మూడో ఫారం వరకూ రెండు మైళ్ల దూరంలోని పెరవలిలో, స్కూలు ఫైనలు, పీయూసీ ఇంకొంత దూరంలో ఉన్న

పార్టీ అభ్యర్థిగా ఆచార్య ఎన్జీ రంగా ఆశీస్సులతో శాసనమండలికి పోటీచేశారు. కానీ, స్వతంత్ర పార్టీ బలం 7 ఎమ్మెల్యేలే. అయినా రోశయ్య గెలిచారు. ఎలాగంటే, రోశయ్య వినయవిధేయతలకి ముచ్చటపడిన అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ఆయనని గెలిపించారు. అనంతరం 1971లో రోశయ్య కాంగ్రెస్‌లో చేరారు. కాసు తర్వాత ముఖ్యమంత్రులైన పీవీ నరసింహారావు, జలగం వెంగళరావులకు కూడా ఆయన సన్నిహితుడుగానే ఉన్నారు. చెన్నారెడ్డి, అంజయ్య, కోట్ల విజయ భాస్కరరెడ్డి మంత్రివర్గంలోనూ పనిచేశారు. వైయస్ రాజశేఖరరెడ్డి హయంలో కూడా మంత్రిగా రవాణా, విద్యుత్తు శాఖలు; 1991లో నేదురుమల్లి జనార్ధనరెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, ఆరోగ్య, విద్య, విద్యుత్ శాఖలు; 1992లో కోట్ల విజయభాస్కరరెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, ఆరోగ్య, విద్య, విద్యుత్ శాఖల మంత్రిగా పనిచేశారు. 2004, 2009లో వైఎస్. రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌ను 16 సార్లు శాసనసభలో ప్రవేశపెట్టారు.

1995-97 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. 1998లో నరసరావుపేట నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ★

## అవినీతికి దూరం..

అధికారంలో ఉన్నాం కదా ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనేది రాజకీయ నేతల సహజ ఆలోచనగా ఉంటుంది. కానీ రోశయ్య అవినీతికి చాలా దూరంగా ఉండేవారు. ఇన్ని సంవత్సరాల ఆయన రాజకీయ జీవితంలో ఎన్నడూ అవినీతి ఆరోపణలు ఎదుర్కోలేదు. ఎవరైనా ఏదైనా పని మీద తనను కలిస్తే అది తాను నిర్దేశించుకున్న పద్ధతుల ప్రకారం ఉంటేనే చేసేవారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తాను చేయలేనని అక్కడికక్కడే చెప్పేవారు. రోశయ్య చీరాల నుంచి గెలిచి మంత్రిగా ఉన్న సమయంలో ఆ ప్రాంత నేతలు కొందరు టిటిడి కల్యాణ మండపం వద్ద ఉన్న ఖరీదైన స్థలాన్ని రాత్రికిరాత్రే ఆక్రమించి అక్కడ గుడిసెలు వేసి దానికి కొణిజేటి రోశయ్య నగర్ అనే బోర్డు పెట్టేశారు. ఉదయాన్నే ఈ విషయం గురించి తెలుసుకున్న రోశయ్య తక్షణమే ఆ బోర్డు, అక్కడ ఉన్న గుడిసెలు తొలగించాలని అప్పటి కమిషనర్‌ను ఆదేశించారు. ఇలాంటి ఉదాహరణలు ఇంకా ఎన్నో ఉన్నాయి.

ఆటలు అన్నం పెడతాయా? అవి కూటికా, గుడ్డకా? అంటూ విమర్శించే రోజులు పోయాయి. ప్రపంచ క్రీడలు ఫుట్‌బాల్, క్రికెట్, టెన్నిస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ నుంచి గ్రామీణక్రీడ కబడ్డీ వరకూ ప్రతిభను చాటుకుంటే చాలు కోట్ల పంట పండటం ఖాయమని నేటితరం క్రీడాకారులు చాటి చెబుతున్నారు. మెస్సీ, రొనాల్డో లాంటి ఫుట్‌బాల్ దిగ్గజాలు, సచిన్, ధోనీ, కోహ్లీ, మిథాలీ వంటి క్రికెటర్లు, సైనా, సింధు, శ్రీకాంత్ లాంటి బ్యాడ్మింటన్ స్టార్లు, సానియా లాంటి టెన్నిస్ ప్లేయర్లే ఇందుకు ఉదాహరణ.




# ఆటలతో అందలం!

అపారమైన ప్రతిభకు అంకితభావం తోడైతే, కాస్త అదృష్టం కూడా జతకలిస్తే గంటకు 6 కోట్ల 50 లక్షల రూపాయలు సంపాదించవచ్చునని అర్జెంటీనా ఫుట్‌బాల్ వండర్ లయనల్ మెస్సీ నిరూపించాడు. ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యంత పారితోషికం అందుకొంటున్న ఈ సాకర్ మాంత్రికుడు గత రెండు దశాబ్దాల కాలంగా స్పెయిన్‌లోని బార్సిలోనా క్లబ్ తరపున ఆడినందుకు ఏడాదికి 7 కోట్ల యూరోలు చొప్పున వేతనంగా అందుకుంటూ చరిత్ర సృష్టించాడు. పోర్చుగీసు థండర్ క్రిస్టియానో రొనాల్డో సైతం ఏడాదికి 4 కోట్ల 50 లక్షల యూరోల జీతం ఆర్జిస్తూ ఫుట్‌బాల్ ఆటగాళ్లా మజాకానా అనిపించాడు. ఈ ఇద్దరు మాత్రమే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ప్రతిభావంతులైన వేలాదిమంది క్రీడాకారులు ఫుట్‌బాల్ ఆడుతూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు.

**సచిన్, ధోనీ, జడేజా..**

భారత్‌లో అత్యంత జనాదరణ పొందుతున్న క్రికెట్లో సైతం ప్రతిభ, నైపుణ్యం అపారంగా ఉన్న క్రికెటర్లు కళ్లు చెదిరే మొత్తాలు ఆర్జిస్తూ రాత్రికి రాత్రే కోటీశ్వరులుగా మారిపోతున్నారు.

ముంబైలోని ఓ మధ్యతరగతి కుటుంబం నుంచి భారత క్రికెట్లోకి దూసుకొచ్చిన సచిన్ టెండుల్కర్ క్రికెట్‌నే తన వృత్తిగా భావించడం ద్వారా రెండు దశాబ్దాల కాలంలో 2 వేల కోట్ల రూపాయల వరకూ సంపాదించగలిగాడు.

జార్ఖండ్‌లోని ఓ దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన మహేంద్రసింగ్ ధోనీ క్రికెట్ ద్వారా గత 15 సంవత్సరాల కాలంలో 1500 కోట్ల రూపాయలు కూడబెట్టాడు. ఇప్పటికీ కేవలం ఐపీఎల్ ద్వారానే ఏడాదికి 11 కోట్ల నుంచి 15 కోట్ల రూపాయల వరకూ ఆర్జిస్తున్నాడు. భారత టెస్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ, టీ-20 కెప్టెన్ రోహిత్‌శర్మ, ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా లాంటి ఆటగాళ్లు సైతం 200 నుంచి 1000 కోట్ల రూపాయలు సంపాదించిన వారే కావడం విశేషం. ఓ ఆటోరిక్షా డ్రైవర్ కుమారుడు, హైదరాబాద్ స్టార్ బౌలర్ మహ్మద్ సిరాజ్ గత మూడేళ్ల కాలంలోనే 10 కోట్ల రూపాయల వరకూ ఆర్జించాడంటే ఆశ్చర్య పోవాల్సిందే మరి. భారత మహిళా క్రికెట్ కెప్టెన్ మిథాలీరాజ్ సైతం ఆటనే నమ్ముకొని భారత రైల్వేలలో ఉన్నత అధికారి ఉద్యోగంతో పాటు కోట్ల రూపాయలు సంపాదించింది.

**సైనా, సింధు, శ్రీకాంత్..**

తెలుగు రాష్ట్రాల బ్యాడ్మింటన్ స్టార్లు సైనా నెహ్వాల్, సింధు, కిడాంబీ శ్రీకాంత్ సైతం బ్యాడ్మింటన్ ఆటనే తమ ఊపిరిగా చేసుకొని కోట్లు సంపాదించారు. సింధు, కిడాంబీ శ్రీకాంత్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగాలు కూడా పొందారు. అంతేకాదు, టెన్నిస్ ద్వారా సానియా మీర్జా 50 నుంచి 100 కోట్ల రూపాయల వరకూ సంపాదించగలిగింది.

**కబడ్డీలోనూ..**

మనదేశంలోని గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన కబడ్డీ క్రీడ సైతం పల్లె ప్రాంతాలకు చెందిన ఆటగాళ్లకు కాసులవర్షం కురిపిస్తోంది. కబడ్డీ లీగ్ పుణ్యమా అంటూ కొద్దివారాలలోనే లక్షాధికారులను చేస్తోంది. ఏటా మూడు మాసాలపాటు సాగే ప్రోకబడ్డీ లీగ్‌లో మహారాష్ట్రలోని ఓ మారుమూల పల్లెటూరుకు చెందిన సిద్ధార్థ దేశాయ్‌కి గత సీజన్ వేలంలో కోటీ 45 లక్షల రూపాయల ధర పలికింది. ప్రదీప్ నర్వాల్, రాహుల్ చౌదరి, నవీన్ కుమార్, పవన్‌కుమార్ షరావత్, మనిందర్ సింగ్, అభిషేక్ సింగ్ లాంటి పలువురు కబడ్డీ స్టార్ ప్లేయర్లు ఏడాదికి 50 లక్షల రూపాయలకు పైగా వేతనంగా అందుకుంటున్నారు.

టోక్యో వేదికగా కొద్దిమాసాల క్రితమే ముగిసిన 2020 ఒలింపిక్స్ వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం సాధించిన నీరజ్ చోప్రా సైతం నజరానాలు, ప్రోత్సాహక నగదు బహుమతులతో కోటీశ్వరుడుగా మారిపోయాడు.

మనదేశంలో మేధో క్రీడ చదరంగంలో గ్రాండ్ మాస్టర్లు కుప్పలు తెప్పలుగా ఉన్నా పలుమార్లు ప్రపంచ టైటిల్ సాధించడం ద్వారా సూపర్ గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ మాత్రమే కోట్ల రూపాయలు సంపాదించగలిగాడు.

ఆటలాడితే ఆరోగ్యానికి ఆరోగ్యం, ఉద్యోగానికి ఉద్యోగం, పేరుకు పేరు, డబ్బుకు డబ్బు. పిల్లల్ని చదువుతో పాటు ఆటల్లోనూ రాణించేలా ప్రోత్సహిద్దామా మరి! ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

# సేవానిరతికి కలెక్టర్ ప్రశంస



**కడప :** జిల్లా వ్యాప్తంగా వరద బాధితులకు గతకొన్ని రోజుల నుండి ఆర్.ఎస్.ఎస్., సేవాభారతి కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ భోజనం, నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ చేశారు. కొంతమందికి గ్యాస్ సిలిండర్లు కూడా ఉచితంగా అందించారు.

ఆర్.ఎస్.ఎస్., సేవాభారతి కార్యకర్తలు చేస్తున్నటువంటి ఈ కార్యక్రమాన్ని మరికొన్ని రోజులు నిర్వహించి బాధితులందరికీ సాయం అందించేలా చూడాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ★

**రాజంపేట మండలం, ఎగువమండపల్లిలో సేవాభారతి కార్యకర్తలు చేస్తున్న సేవకి అభినందనలు తెలియచేస్తున్న కడప జిల్లా కలెక్టర్ విజయరామరాజు**

# భజన పోటీలు

**కర్నూలు :** నంద్యాల ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో నవంబర్ 29న భజన పోటీల బహుమతి ప్రదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రాంత ధర్మజాగరణ ప్రముఖ్ తిరుపతయ్య, యోగా గురువు దామోదర్ రెడ్డి, కర్నూల్ విభాగ్ ధర్మ జాగరణ ప్రముఖ్ రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు వారాలుగా జరిగిన భజన కార్యక్రమాలను పరిశీలించి ఉత్తమ భజన బృందాలకు బహుమతులు అందజేశారు. ★




# గో సంరక్షణ కోసం పాదయాత్ర





**హైదరాబాద్ :** గో హత్యలు ఆగాలని, గో మాంసం ఎగుమతులను తక్షణమే ఆపివేయాలని, కబేలాలు మూసివేయాలని, గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామివారి దివ్య ఆశీస్సులతో పాదయాత్ర ప్రారంభమయింది. అయ్యప్ప సేవాసమితి అధ్యక్షులు బాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో గో భక్తులు అయ్యప్ప మాల వేసుకుని నవంబర్ 13న హైదరాబాద్ పాతబస్తీలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు తీసుకొని, మాత నిర్మలానంద యోగభారతి చేతుల మీదుగా పాదయాత్రను ప్రారంభించారు. గోభక్తులు, హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని జై గోమాత అంటూ నినాదాలు చేశారు. ఈ యాత్ర నలభై రోజుల్లో 1500 కిలోమీటర్లకు పైగా నడిచి డిసెంబర్ 21న ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌కి చేరుకుంటుంది.

ఇదివరకు బాలకృష్ణ గురుస్వామి హైదరాబాద్ నుండి తిరుమలకు, శ్రీశైలంకు, షిరిడికి, యాదాద్రికి గో సంరక్షణ కోసం గోభక్తులతో పాదయాత్ర చేసారు. అదే స్ఫూర్తితో ఢిల్లీ వరకు పాదయాత్ర చేయాలని సంకల్పించానని ఆయన చెప్పారు. ★

# స్వధర్మం ఆధారంగా స్వతంత్రం



**హైదరాబాద్ :** "స్వధర్మం ఆధారంగా స్వతంత్రం ఏర్పరచుకునే సమయం ఆసన్నమయింది. ఈ అపూర్వమైన కార్యంలో ప్రతిఒక్కరు తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. అప్పుడే భవ్యమైన భారతం నిర్మాణమవుతుంది. ప్రపంచంలోని అన్ని రంగాల్లో భారత్ తృతీయ ప్రత్యామ్నాయాన్ని చూపించగలదని నిరూపితమవుతోంది" అని ఆర్.ఎస్.ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచార ప్రముఖ్ నడింపల్లి ఆయుష్ అన్నారు. స్వాతంత్ర్యం సాధించిన తరువాత ప్రారంభం కావలసిన ఈ స్వతంత్ర సాధన ప్రక్రియ 75 సంవత్సరాలు ఆలస్యమైనా ఇప్పుడు త్వరితగతిన సాగుతోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. భాగ్యనగర్ శివారులో ఉన్న అన్నోజీగూడాలో డిసెంబర్ 6, సాయంత్రం 6 గంటలకు జరిగిన ఆర్.ఎస్.ఎస్. శిక్షావర్గ (శిక్షణ) ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో బలంగా ఉన్న జాతీయవాదం స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అణచివేతకు గురైంది. 'హిందూ' అనే పదం కూడా వాడకూడనిది అయింది. కానీ సంఘ స్వయంసేవకుల నిరంతర ప్రయత్నం మూలంగా మార్పు వచ్చింది. ఒకప్పుడు సోమనాథ ఆలయ పునర్నిర్మాణానికి అభ్యంతరాలు వ్యక్తమైతే ఇప్పుడు అయోధ్యలో రామమందిర భూమి పూజలో ప్రధాని స్వయంగా పాల్గొన్నారు. ఈ మార్పును మరింత వేగంగా ముందుకు తీసుకువెళ్లడానికి అందరూ తమవంతు బాధ్యత నిర్వర్తించాలని ఆయుష్ కోరారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ అదనపు కలెక్టర్‌గా పదవీ విరమణ చేసిన రావుల మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్.ఎస్.ఎస్. కార్యం చాలా ప్రత్యేకమైనది, విశిష్టమైనదని మహేందర్ రెడ్డి అన్నారు. సంఘటిత భావం చాలా బలమైనదని, దానిని పెంపొందించేందుకు ప్రతిఒక్కరు రోజులో కనీసం గంట సమయం వెచ్చించాలని పిలుపునిచ్చారు.

నవంబర్ 17 నుండి డిసెంబర్ 6వ తేదీ వరకు జరిగిన శిక్షావర్గ (శిక్షణ కార్యక్రమం)లో వివిధ జిల్లాలకు చెందిన ఎంపిక చేసిన కార్యకర్తలు పాల్గొన్నారు. 18-30 మధ్య వయస్సు కలిగిన మొత్తం 117 మంది ఈ వర్గలో శిక్షణ పొందారు. వీరిలో 58 మంది విద్యార్థులు, 57 మంది ఉద్యోగులు ఉన్నారు.




20 రోజుల పాటు నేర్చుకున్న అంశాలను కార్యక్రమం ప్రారంభంలో శిక్షార్థులు ప్రదర్శించారు. శారీరిక్ కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో వర్గ సర్వాధికారి జాగ్గారి విజయానంద్, తెలంగాణ ప్రాంత సహ సంఘ చాలక్ సుందర్ రెడ్డి, ఇతర ప్రాంత కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని తిలకించడానికి 400 మంది పురప్రముఖులు, మహిళలు, పెద్దలు విచ్చేశారు. ★

# సంఘ శిక్షావర్గ ముగింపు

**విజయవాడ :** నూతక్కిలోని విజ్ఞాన విహార పాఠశాలలో నవంబర్ 14 నుండి డిసెంబర్ 4వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ ప్రథమ వర్ష సంఘ శిక్షా వర్గ జరిగింది. ఇందులో అన్ని రెవెన్యూ జిల్లాల నుండి 95 మంది ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తలు పాల్గొన్నారు. వీరిలో ఇంటర్ విద్యార్థులు 30; డిగ్రీ, పీజీ విద్యార్థులు 41; ఉద్యోగస్థులు, వ్యాపారస్థులు, వ్యవసాయదారులు 24 మంది ఉన్నారు. ముగింపు కార్యక్రమం డిసెంబర్ 3న సాయంత్రం జరిగింది. ఇందులో ప్రాంత సహ కార్యవాహ యుగందర్ ముఖ్య వక్తగా పాల్గొని మార్గదర్శనం చేసారు. ★



# బాలజాగృతి

## పూరీ జగన్నాథాలయం

### తెలుసుకుందాం



ఒడిషా రాష్ట్రం బంగాళాఖాతం తీరంలోని పూరీ పట్టణంలో గల ప్రాచీన, ప్రముఖ హిందూ ఆలయం. కృష్ణభక్తులకు లేదా విష్ణుభక్తులకు ఎంతో ప్రియమైనది. చెక్కతో తయారుచేసిన విగ్రహాలు ఇక్కడి ప్రత్యేకత. శ్రీకృష్ణుడు సుభద్ర, బలరామ సమేతంగా దర్శనమిస్తాడు. చార్‌ధామ్ పుణ్యక్షేత్రాలలో ఇదీ ఒకటి. ఈ ఆలయంలో ప్రతి ఏటా రథోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటారు.

## కథ | అడవిలో కచేరి

మల్లయ్యకి మృదంగం నేర్చుకోవాలని ఎంతో కోరిక. తండ్రిని ఒప్పించి, రాజధాని నగరంలో పెద్ద విద్వాంసుడి దగ్గర చేరి ఆరితేరాడు. తర్వాత మృదంగం తీసుకుని ఇంటికి బయలుదేరాడు.

దారిలో తన ఊరివాళ్లు కనిపించడంతో అందరూ కలిసి అడవి దారిలో బయల్దేరారు. వారిలో ఓ గుడ్డివాడు కూడా ఉన్నాడు.

మల్లయ్య చిన్ననాటి స్నేహితుడు పుల్లయ్య 'నీ విద్య ఎప్పుడు చూద్దామా అని ఉంది. ఊరికి వెళ్లగానే నీ కచేరీ ఏర్పాటుచేయాలి' అన్నాడు. అందరూ 'అవునవును' అనడంతో మల్లయ్య పొంగిపోయాడు.

'దానికేం భాగ్యం? మీరందరూ అంత ఆత్రుతగా ఉంటే ఇక్కడే వాయిస్తా' అంటూ పక్కనే ఉన్న రావిచెట్టు కింద కూర్చుని, మృదంగాన్ని బయటకు తీశాడు.

గుడ్డివాడు మాత్రం 'అయ్యా, ఇది అడవి ప్రదేశం. మనమిక్కడ కచేరి పెట్టడం సరైంది కాదనిపిస్తోంది' అన్నాడు. మల్లయ్య విసుగ్గా మొహం పెట్టి, 'కళలంటే ఏంటో తెలియని ఇలాంటి వారి వల్లే కళాకారులకు గౌరవం లేకుండా పోతోంది' అన్నాడు.

ఊరి వాళ్లందరూ 'ఒరే... గుడ్డోడా! నోరు మూసుకుని కూర్చో లేదంటే వెళ్లిపో' అంటూ కసురుకున్నారు.

గుడ్డివాడు చిన్నబుచ్చుకుని, "సరే, నేను



## పద్యము

**చేయకుము కాని కార్యము;**
**పాయకుము మతిన్ శుభం; బవని భోజనమున్**
**జేయకుము రిపు గృహంబున;**
**గూయకు మొరుమనసు నొచ్చు గూత కుమారా!**

**భావం :** ఓ కుమారా! సాధ్యము కాని పనిని చేయుటకు ప్రయత్నించవద్దు, మంచిదానిని వదలవద్దు. పగవాని ఇంట భుజించవద్దు. ఇతరులకు నొప్పి కలుగునట్లు మాట్లాడవద్దు.

## శ్లోకము

**ప్రారభ్యతే న ఖలు విఘ్నభయేన నీచైః**
**ప్రారభ్య విఘ్ననిహతాః విరమంతి మధ్యాః**
**విఘ్నైః పునఃపునరపి ప్రతిహన్యమానాః**
**ప్రారబ్ధముత్తమగుణాః న పరిత్యజంతి॥**

**భావం :** సమాజహితానికి పనికొచ్చే పనిని మొదలుపెట్టడానికి నీచులైనవారు భయపడుతారు. మధ్యములు పనిని మొదలుపెడతారు. కానీ కొన్ని సవాళ్లు వచ్చినా, భీతి చెంది విరమిస్తారు. ఉత్తములైన వాళ్లు మాత్రమే ఎన్ని అడ్డంకులు అయినా దాటి పనిని పూర్తిచేస్తారు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| తల్లి | రాణి |
| భార్య | మామ |
| అత్త | చంద్రుడు |
| రాజు | తండ్రి |
| సూర్యుడు | భర్త |

జవాబులు : తల్లి–తండ్రి, భార్య–భర్త, అత్త–మామ, రాజు–రాణి, సూర్యుడు–చంద్రుడు.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### బత్తుల సుమిత్రాదేవి



ప్రముఖ స్వాతంత్ర్య ఉద్యమకారిణి, సంఘసంస్కర్త. అక్టోబర్ 8, 1918న హైదరాబాద్‌లో జన్మించారు. నిజాంకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసి జైలుకు వెళ్లారు. 1957 నుంచి ఈమె ఐదు పర్యాయాలు శాసనసభకు ఎన్నికయ్యారు. దళితుల అభివృద్ధికి కృషిచేశారు. 1980లో మరణించారు.

## జనరల్ నాలెడ్జ్

1. ప్రపంచంలోనే పొడవైన వృక్షం ఏది?
2. వింగ్స్ ఆఫ్ ఫైర్ పుస్తక రచయిత?
3. పెద్దలసభ లేదా ఎగువసభ అని దేనిని అంటారు?

సమాధానాలు : 1.రెడ్‌వుడ్ (కాలిఫోర్నియా); 2.ఏపీజే అబ్దుల్ కలాం (భారత మాజీ రాష్ట్రపతి); 3.రాజ్యసభ.

## మెదడుకు మేత

అందమైన చెరువులో ఎర్రపిట్ట. తోకతో నీళ్లు తాగుతుంది?

జవాబు : దీపం

## మంచిమాట

విజయ శిఖరాలు సోమరులకు అందవు. పట్టుదలతో కృషిచేసేవారికి అవి తలవంచుతాయి..



వెళ్లిపోతాను' అంటూ ముందుకు సాగిపోయాడు.

అడవిలో కచేరీ మొదలైంది. మల్లయ్య మృదంగ విన్యాసాలు అడవంతా ప్రతిధ్వనించసాగాయి. ఊరి వాళ్లలో ఒకడు పాట పాడితే, మరొకడు పద్యాలు అందుకున్నాడు.

కాసేపటికి గుర్రాల మీద కొందరు దొంగలు వచ్చి వారందరినీ చుట్టుముట్టారు. 'మీ దగ్గరున్న డబ్బు, నగలు అక్కడ పెట్టండి' అంటూ కత్తులు దూశారు.

అందరూ గజగజ వణుకుతూ సొమ్మంతా కుప్పపోశారు. అదంతా మూటకట్టుకున్నాక దొంగల నాయకుడు మృదంగం ముందు కూర్చున్న మల్లయ్యతో 'అడవిలో గొప్ప కచేరీ చేశావయ్యా! ఎటో పోతున్న వాళ్లం నీ మద్దెల చప్పుడు విని సందడేంటో చూద్దామని వచ్చాం. ఇక మీ ఇష్టం. ఇప్పుడు ఎంతసేపైనా వాయించుకోండి' అంటూ పకపకా నవ్వాడు.

దొంగలు వెళ్లిపోయాక అందరూ ఉసూరుమంటూ ఊరు చేరారు. ఊరిపెద్ద జరిగిందంతా తెలుసుకుని మల్లయ్యతో 'ఆ గుడ్డోడికి ఉన్న బుద్ధి నీకు లేకపోయింది. కళను ప్రదర్శించడానికి వేళా పాళా చూడక్కర్లేదా? అదే కచేరీ ఊర్లో పెడితే నాలుగు డబ్బులు వచ్చేవి. అడవిలో పెట్టడం వల్ల ఉన్నది కూడా ఊడింది' అంటూ చీవాట్లు పెట్టాడు.

'కళను సరైన చోట, సరైన సమయంలోనే ప్రదర్శించాలి' అనే పాఠాన్ని మల్లయ్య ఆ రోజు నేర్చుకున్నాడు. ★



# వారఫలాలు

2021 డిసెంబర్ 13-19



సింహంభట్ల సుబ్బారావు
6300674054



**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

అనుకున్న పనులు నిదానంగా పూర్తిచేస్తారు. వస్తులాభాలు. నిరుద్యోగుల యత్నాలు సఫలం. రాబడి ఆశాజనకంగా ఉంటుంది. దీర్ఘకాలిక రుణాలు తీరుతాయి. వ్యాపారులకు పెట్టుబడులు సమకూరుతాయి. ఉద్యోగులకు కొన్ని బాధ్యతల నుండి విముక్తి లభిస్తుంది. కళాకారులు రెట్టించిన ఉత్సాహంతో గడుపుతారు. 14, 15 తేదీల్లో దూర ప్రయాణాలు. అనారోగ్యం. దేవీస్తుతి పఠించండి.



**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

కొత్త కార్యాలు చేపడతారు. స్థిరాస్తి వ్యవహారాలు అనుకూలిస్తాయి. కొంత సొమ్ము అంది అవసరాలు తీరుతాయి. కుటుంబంలో ఉల్లాసంగా గడుపుతారు. ఆరోగ్యం మెరుగుపడుతుంది. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగుల ప్రతిభ వెలుగులోకి వస్తుంది. కళాకారులు, క్రీడాకారులకు కొత్త అవకాశాలు. 18,19 తేదీల్లో మానసిక అశాంతి. కుటుంబ సభ్యులతో తగాదాలు. శివస్తోత్రాలు పఠించండి.



**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

పరిస్థితులు అనుకూలిస్తాయి. స్థిరాస్తి ఒప్పందాలు కుదుర్చుకుంటారు. వాహన సౌఖ్యం. విద్యార్థులకు ఊరటనిచ్చే సమాచారం. ఆదాయం ఆశాజనకంగా ఉంటుంది. అప్పులు తీరుతాయి. కుటుంబంలో ఉత్సాహవంతంగా ఉంటుంది. కొద్దిపాటి రుగ్మతలు బాధిస్తాయి. ఉద్యోగులకు కోరుకున్న మార్పులు జరిగే వీలుంది. 15,16 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. ఆదిత్య హృదయం పఠించండి.



**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

నిరుద్యోగులకు ఉద్యోగయోగం. వాహనాలు, భూములు కొంటారు. రాబడి సంతృప్తినిస్తుంది. ఇతరుల నుంచి రావలసిన సొమ్ము అందుతుంది. కుటుంబంలో సమస్యలు తీరి ఊరట చెందుతారు. వ్యాపారులకు లాభాలు. రాజకీయవేత్తల కృషి ఫలిస్తుంది. క్రీడాకారులు, సాంకేతిక నిపుణులకు ఆహ్వానాలు. 14,15 తేదీల్లో దూరప్రయాణాలు. అనారోగ్యం. ఆంజనేయ దండకం పఠించండి.



**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

అనుకున్న కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేస్తారు. రావలసిన సొమ్ము సమకూరి అవసరాలు తీరుతాయి. కుటుంబ సభ్యులతో సఖ్యత నెలకొంటుంది. ఆరోగ్యం క్రమేపీ మెరుగుపడుతుంది. వ్యాపారులు అధికంగా లాభాలు పొందుతారు. ఉద్యోగులకు ఉన్నత పదవులు రావచ్చు. కళాకారులు, రచయితలకు శుభవార్తలు. 13,14 తేదీలలో మానసిక అశాంతి. స్నేహితులతో తగాదాలు. శివాష్టకం పఠించండి.



**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

వివాహ, ఉద్యోగయత్నాలు కలసివస్తాయి. స్థిరాస్తి వ్యవహారాలు సర్దుబాటు చేసుకుంటారు. పాతబాకీలు సైతం వసూలవుతాయి. శుభకార్యాల రీత్యా ఖర్చులు ఉండవచ్చు. ఉద్యోగులు విధుల్లో అవాంతరాలు అధిగమిస్తారు. పారిశ్రామికవేత్తలు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. కళాకారులు, క్రీడాకారులకు శుభవర్తమానాలు. 14,15 తేదీలలో వృథా ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. శివపంచాక్షరి పఠించండి.



**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

నిరుద్యోగులకు ఊరటనిచ్చే ప్రకటన రావచ్చు. వాహన, గృహయోగాలు. కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడుపుతారు. శుభకార్యాలపై చర్చలు జరుపుతారు. ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉద్యోగులకు కొత్త హోదాలు రాగలవు. కళాకారులకు విశేష గుర్తింపు రాగలదు. 17,18 తేదీలలో బంధువులతో తగాదాలు. చర్చల్లో ప్రతిష్టంభన. విష్ణుసహస్ర నామ పారాయణం చేయండి.



**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

నిరుద్యోగులకు ఉద్యోగయోగం. వాహనాలు, భూముల కొనుగోలు ప్రయత్నాలు కలసివస్తాయి. ఇబ్బందులు ఎదురైనా మొత్తం మీద ఆదాయం సంతృప్తినిస్తుంది. మీ నిర్ణయాలకు ఎదురుండదు. కొద్దిపాటి రుగ్మతలు బాధిస్తాయి. వ్యాపారులకు లాభాలు. కళాకారులు, రచయితలకు సమస్యలు తీరుతాయి. 14,15 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. మానసిక ఆందోళన. గణేశాష్టకం పఠించండి.



**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. ఒక సమాచారం మరింత ఉత్సాహాన్నిస్తుంది. ఆకస్మిక ధనలాభాలు. రుణబాధలు తొలగుతాయి. కుటుంబంలో చికాకులు తొలగుతాయి. గృహ నిర్మాణాలలో అవాంతరాలు తొలగుతాయి. వ్యాపారులు అభివృద్ధి సాధిస్తారు. ఉద్యోగులకు పైస్థాయి ఆదరణ లభిస్తుంది. 13,14 తేదీల్లో దూరప్రయాణాలు. ఆరోగ్య సమస్యలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.



**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

మీ శ్రమ ఫలిస్తుంది. ఆలోచనలు కలసివస్తాయి. ఇంటి నిర్మాణయత్నాలు కలసివస్తాయి. రాబడి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. వ్యాపారులకు లాభాలు. విస్తరణ యత్నాలు కలసి వస్తాయి. ఉద్యోగులకు అధికారుల ప్రశంసలు. కళాకారులకు అనుకూల సమాచారం. క్రీడాకారులు, వైద్యులకు ఆహ్వానాలు. 15,16 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో సమస్యలు. విష్ణుధ్యానం చేయండి.



**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ప్రయత్నాలలో అవాంతరాలు. ఉద్యోగ యత్నాలు మందగిస్తాయి. ఇంటి నిర్మాణయత్నాలు ముందుకు సాగవు. రావలసిన సొమ్ము సకాలంలో అందక నిరాశ చెందుతారు. అప్పులు సైతం చేస్తారు. వ్యాపారులు సామాన్య లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు కొన్ని మార్పులు ఉండవచ్చు. కొత్త బాధ్యతలు మీదపడతాయి. 17,18 తేదీల్లో ధనలాభం. వాహనయోగం. ఆంజనేయ దండకం పఠించండి.



**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

అనూహ్యరీతిలో కార్యక్రమాలు పూర్తిచేస్తారు. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. సమాజంలో గౌరవం లభిస్తుంది. కొన్ని విషయాలలో పట్టింది బంగారమే. దూరప్రాంతాల నుంచి అందిన సమాచారం సంతోషం కలిగిస్తుంది. అనుకోకుండా కొంత సొమ్ము దక్కుతుంది. కుటుంబంలో అందరి ప్రేమను పొందుతారు. 18,19 తేదీల్లో దూరప్రయాణాలు. అనారోగ్యం. నవగ్రహస్తోత్రాలు పఠించండి. ★

# పదరసం-346

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 | | 2 | | ✠ | 3 | 4 | | 5 |
| 6 | | ✠ | | ✠ | 7 | ✠ | | ✠ | |
| ✠ | 8 | | | ✠ | | ✠ | 9 | 10 | |
| 11 | | ✠ | 12 | | | | ✠ | 13 | |
| ✠ | 14 | 15 | | ✠ | | ✠ | 16 | | ✠ |
| 17 | ✠ | | ✠ | 18 | ✠ | 19 | | ✠ | 20 |
| 21 | | | ✠ | 22 | 23 | ✠ | ✠ | 24 | |
| | ✠ | 25 | | ✠ | 26 | | | ✠ | |
| 27 | 28 | | ✠ | 29 | | ✠ | ✠ | 30 | ✠ |
| ✠ | 31 | | | ✠ | 32 | | | | |

**పదరసం – 346**

పేరు : ........................................................................................

చిరునామా:........................................................................................

........................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..................................................

## ఆధారాలు

**అడ్డం**

1. సోమవారమే! (4)
3. ఆండాళ్ పాశురములు పాడుకునే కాలం (4)
6. '....మీద కొడితే మూతి పళ్ళ రాలాయి' అని సామెత (2)
8. పంతము, ప్రతిజ్ఞ (3)
9. శివుని అవతారమే! (3)
11. కన్నము, ఎముక (2)
12. దేవకి సప్తమ గర్భాన జన్మించినది (4)
13. మలుపు చివరకు లేదు (2)
14. కరాపువు, దేవకుసుమము (3)
16. సర్పము (2)
19. సింహాలకు ఉండేది. సింహాలు ఉండేవి (2)
21. వేదము, బ్రాహ్మణుడు (3)
22. పిపీలికము (2)
24. తాపేశ్వరం దీనికి ప్రసిద్ధి (2)
25. నెమలి (2)
26. ఓలేటి వెంకటసుబ్బారావు కవిగా ఈ పేర ప్రసిద్ధి వహించాడు (3)
27. అటుగా రక్షకము, రక్షింపదగిన (3)
29. వాలము (2)
31. హిందీలో ఇవ్వవద్దు (3)
32. అచ్చుతప్పు ఓ సంస్కృత నాటకం (5)

**నిలువు :**

1. గృహ పార్శ్వముల అనే! (5)
2. వారఫలాల్లో ఇది ఎక్కి ప్రయాణించే యోగం ఉందని పేర్కొంటూంటారు (5)
4. ఫాలము (3)
5. అతిశయాలు, జనసమూహ కోలాహలాలు (4)
7. ఆంజనేయుడు (4)
10. చెట్టు (3)
15. హిందీలో వందవందనాలు అని చెప్పండి మరి! (6)
16. క్షీరము (2)
17. ఈ నెల ఈయన షష్టి, తొమ్మిదో తేదీన (4)
18. వ్యవహారంలో చేతి గడియారం (2)
20. చక్రవర్తి రాజగోపాలాచారి. భారత భాగవతాలు రాశాడు (3)
23. దోమ (4)
28. లక్ష్మీదేవి (2)
30. బిచ్చుము, తిరిపెము (2)

**మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2021 డిసెంబర్ 27 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 342 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 దీ | పా | 2 వ | ళి | ✠ | 3 బా | 4 లా | సం | 5 దం |
| 6 బిం | బం | ✠ | ర | ✠ | 7 ధ | ✠ | భ | ✠ | డ |
| ✠ | 8 సు | డి | వి | ✠ | ధ్వ | ✠ | 9 ము | 10 మ | క |
| 11 సీ | త | ✠ | 12 క్ర | య | వ | త్రం | ✠ | 13 దు | ము |
| ✠ | 14 అ | 15 నా | యం | ✠ | త్మ | ✠ | 16 తే | రు | ✠ |
| 17 లు | ✠ | గు | ✠ | 18 పం | ✠ | 19 మా | నె | ✠ | 20 భ |
| 21 కు | టీ | ల | ✠ | 22 పా | 23 ము | ✠ | ✠ | 24 బిం | గి |
| డు | ✠ | 25 చ | వి | ✠ | 26 వ | ల్మీ | కం | ✠ | ని |
| 27 కొ | 28 ర | వి | ✠ | 29 శ్యా | స | ✠ | ✠ | 30 మా | ✠ |
| ✠ | 31 సం | తి | శం | ✠ | 32 అ | కా | శ | దీ | పం |

**విజేతలు:** పి.రాజేశ్వరరావు, బి.ఇందుశేఖర్–హైదరాబాద్, వి.రామలింగాచారి–యాదగిరిగుట్ట, డా॥ఎం.ప్రణీత–కామారెడ్డి, సి.హెచ్.నాగేందర్‌రెడ్డి–మేడ్చల్, ఎస్.రాజు–కర్నూలు, కె.స్వప్న, కె.శ్రీనిధి, ఐ.బ్రహ్మేంద్రస్వామి, శ్రీపతి పూర్ణకుమారి–ఒంగోలు, వి.ఉమామహేశ్వరశర్మ–అనంతపురం, డా॥బి.ధన్వంతరి–మచిలీపట్నం, కె.అల్లీరాణి–తిరుపతి, ఎన్.వి.ఎస్.శర్మ–తూర్పుగోదావరి, టి.రాధ–నెల్లూరు, కె.నరసింహస్వామి–భువనేశ్వర్.

**బహుమతి పొందిన విజేత :**

**వి.రామలింగాచారి-యాదగిరిగుట్ట.**

అరుణ



నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీనుది హిట్ కాంబినేషన్. వారిద్దరి కలయికలో వచ్చిన 'సింహ, లెజెండ్' చిత్రాలు ఒకదానిని మించి మరొకటి విజయం సాధించాయి. దాంతో సహజంగానే మూడో చిత్రంగా 'అఖండ' ప్రకటన వెలువడగానే అభిమానుల ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. అయితే అంతలో కరోనా రావడంతో ఈ సినిమా నిర్మాణం మందకొడిగా సాగింది. దానికి తోడు ఇప్పటికే బాలకృష్ణ సినిమా విడుదలై రెండేళ్లు గడిచిపోయింది. దాంతో అభిమానుల ఎదురుచూపులు మరింత ఎక్కువయ్యాయి. వాటికి తెరదించుతూ 'అఖండ' చిత్రాన్ని నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి డిసెంబర్ 2న తెర ముందుకు తీసుకొచ్చారు.

# హై ఓల్టేజ్ యాక్షన్ డ్రామాగా అఖండ

మురళీకృష్ణ (బాలకృష్ణ) అనంతపురంకు చెందిన రైతు. అక్కడ ఫ్యాక్షనిజానికి ఫుల్‌స్టాప్ పెడుతూ పిల్లలు కలం పట్టేలా, యువకులు హలం పట్టేలా చేస్తాడు. ఆ జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ శరణ్య (ప్రగ్యా జైస్వాల్) మురళీకృష్ణను మొదట అపార్థం చేసుకున్నా, అతను చేపట్టిన సేవాకార్య క్రమాలకు ప్రభావితురాలై పెళ్లి చేసుకుంటుంది. వారికో కూతురు కూడా పుడుతుంది. ఇంతలో అదే ప్రాంతానికి చెందిన వరదరాజులు (శ్రీకాంత్) తన గనుల్లో యూరేనియం నిక్షేపాలు ఉన్నాయనే విషయం ప్రపంచానికి తెలియకుండా తవ్వుతూ ఉంటాడు. దాని కారణంగా వాతావరణ కాలుష్యం ఏర్పడి దాని చుట్టుపక్కల పిల్లలంతా అనారోగ్యం పాలవుతారు. వారంతా మురళీకృష్ణ హాస్పిటల్‌లోనే చేరతారు. అయితే యూరేనియం నిక్షేపాలకు సంబంధించిన రహస్యం బయటకు పొక్కకూడదనే ఆలోచనతో ఆ హాస్పిటల్‌ను బాంబులు పెట్టి పేల్చేస్తారు. ఆ ఘటనలో కేంద్ర మంత్రి భరత్ రెడ్డి (సుబ్బరాజు) సైతం కన్నుమూస్తాడు. దాంతో మురళీకృష్ణను ఎన్.ఐ.ఎ. సంస్థ విచారణ కోసం అదుపులోకి తీసుకుంటుంది. ఇదే సమయంలో వరదరాజులు మనుషులు మురళీకృష్ణ కూతురును కిడ్నాప్ చేస్తారు. ఆమెను రక్షించడం కోసం ఊహించని విధంగా రంగంలోకి అఖండ రుద్ర (బాలకృష్ణ) అనే అఘోర దిగుతాడు. వరదరాజులతో పాటు అతనికి దన్నుగా ఉన్న గజేంద్ర సాహు (నితిన్ మెహతా)కు అఖండ ఎలా బుద్ధి చెప్పాడు? మురళీకృష్ణ కుటుంబానికి ఎలా దన్నుగా నిలిచాడు, దానికి వెనక ఉన్న కారణం ఏమిటీ? అనేది మిగతా కథ.

గనుల అక్రమ తవ్వకాలు, దాని ద్వారా ఏర్పడుతున్న కాలుష్యం, పర్యావరణ అసమానతలు మీద మనకు బోలెడన్ని సినిమాలు వచ్చాయి. 'కృష్ణం వందే జగద్గురుమ్' వంటి మూవీలో ఇంతకు మించిన డ్రామా ఉంది. ఇది కూడా దాదాపు అలాంటి కథాంశంతో తెరకెక్కిన సినిమానే. అయితే ప్రథమార్థం అంతా అనంతపురంకు చెందిన రైతు మురళీకృష్ణకు సంబంధించిన కథ కాగా ద్వితీయార్థంలో ధర్మానికి, ప్రకృతికి వ్యతిరేకంగా ఎవరైనా వెళితే దేవుడు క్షమించడు, ఏదో రూపంలో వారికి తగిన శిక్ష విధిస్తాడు అనే సందేశాన్ని అఘోర పాత్ర ద్వారా చూపించారు. ఆ రకంగా చూసినప్పుడు అఘోర పాత్రే ఈ సినిమాకు ప్రాణం. అయితే అది ద్వితీయార్థంలోనే తెర మీదకు వస్తుంది. దాని కోసం ఓ రొటీన్ ఫ్యామిలీ డ్రామాను ప్రథమార్థంలో భరించాల్సి ఉంటుంది. అందులో జిల్లా కలెక్టర్ ఓ రైతుకు కల్లు తాగడం ఎలానో నేర్పించడం వంటి చిత్ర విచిత్ర సంఘటనలుంటాయి. మూడేళ్ల పాటు తన జిల్లాలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై దృష్టి పెట్టకుండా, కేవలం అధికారులను రిపోర్ట్ కోరడం కథానుగుణంగా తీసుకున్న స్వేచ్ఛగా భావించాలి. వరదరాజులు ఎంత క్రూరుడో ఒకసారి చూపించిన తర్వాత కూడా మరోసారి అతను ప్రభుత్వ అధికారిణిని మానభంగం చేయడం వంటి సన్నివేశాలను పరిహరించి ఉండాల్సింది. అయితే, ఒక్కసారి అఘోరాగా బాలకృష్ణ తెర మీదకు వచ్చిన తర్వాత ముందు మనం చూసిన అవక తవకలన్నీ మనసులోంచి వెళ్లిపోతాయి. అఘోరా నోటివెంట వచ్చే సంభాషణలు, అతను చేసే పోరాటాలు మాత్రమే కనిపిస్తాయి. ఇక క్లయిమాక్స్‌లో మదర్ సెంటిమెంట్‌ను మరిపిస్తూ, చైల్డ్ సెంటిమెంట్‌కు బోయపాటి పెద్ద పీట వేశాడు.

ఇటు రైతు మురళీకృష్ణగా, అటు అఘోరగా బాలకృష్ణ చేసిన ద్విపాత్రాభినయం ఆకట్టుకుంటుంది. అతని నోటి వెంట వచ్చిన సంభాషణలు అరి వర్గాలను శరాఘాతంలా తాకడం అభిమానులను ఆనంద పరుస్తుంది. పోరాట సన్నివేశాలు పరిమితులకు మించి ఉన్నా, వాటినీ కొందరు బాగానే ఆస్వాదిస్తున్నారు. కలెక్టర్‌గా ప్రగ్యా జైస్వాల్, సి.ఎస్. పద్మావతిగా పూర్ణ, బాలకృష్ణ తల్లిదండ్రులుగా అవినాశ్, విజీ చంద్ర శేఖర్, అఘోర బాబాగా జగపతిబాబు, కేంద్ర మంత్రిగా సుబ్బరాజు చక్కని నటన కనబరిచారు. ఇందులో వరదరాజులు పాత్ర పోషించిన శ్రీకాంత్ ప్రతినాయకుడిగా పెద్దంత మెప్పించలేకపోయాడు. స్వామీజీగా మారే మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ గజేంద్ర సాహు పాత్రలో నితిన్ మెహతా చక్కగా సూట్ అయ్యాడు. నిజానికి అతన్ని దొంగ స్వామీజీగా చూపించాల్సిన అవసరం లేదు. ఇలాంటి పాత్రలను రూపొందించడం వల్ల తెలియకుండానే స్వామీజీలపై అగౌరవాన్ని కలిగిస్తున్నామనే స్పృహ మన దర్శక రచయితలకు లేకుండా పోతోంది. ఎం. రత్నం సంభాషణలు, రాంప్రసాద్ సినిమాటోగ్రఫీ, రామ్ లక్ష్మణ్, స్టంట్ శివ కంపోజ్ చేసిన పోరాట దృశ్యాలు సినిమాకు హైలైట్. అన్నింటికీ మించి ఎస్.ఎస్. తమన్ నేపథ్య సంగీతం మూవీని మరోస్థాయిలో నిలబెట్టింది. 'జై బాలయ్య' గీతం అభిమానులను ఆకట్టుకునేలా ఉంటే, 'అడిగా అడిగా...' మెలోడీతో మెప్పించింది. 'సింహా, లెజెండ్' చిత్రాల స్థాయిలో కాకపోయినా, 'అఖండ'ను జనం బాగానే ఆదరిస్తున్నారు. బాలకృష్ణ అభిమానుల దాహార్తిని బోయపాటి 'అఖండ'తో బాగానే తీర్చాడు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్


తామెవరో, ఎటువంటి ఘనచరిత్రకు వారసులో
మన భావితరాలకు తెలియాలి గదా!
ఆ దృష్టితో రూపొందించినదే ఈ బాల పుస్తకమాల
భారత భారతి
సంత్ గాడ్గేబాబా
యాదవరావు జోషి
భగత్ సింగ్
నివేదిత
రాణీ దుర్గావతి
అతి తక్కువ ఖరీదులో లభిస్తున్న అత్యంత ఉపయోగకరమైన
భారత భారతి పుస్తకమాలను మీ ఇంటిలో,
పాఠశాలలో చదివించండి.
మీ పిల్లలు సవ్యమైనదిశలో ఎదగడానికి దోహదపడండి.
భారత భారతి బాల పుస్తకమాలగా ఇప్పటికి వెలువడిన
169 పుస్తకాలు విడివిడిగా ఒక్కొక్కటి 15 రూపాయలు.
మొత్తం సెట్ 2200 రూ॥లకే లభిస్తుంది.
సాహిత్యనికేతన్
3-4-852, కేశవనిలయం,
బర్కత్‌పురా, హైదరాబాద్ - 27.
దూరవాణి : 040-27563236
సాహిత్యనికేతన్
ఏలూరురోడ్, గవర్నరుపేట,
విజయవాడ - 2.
దూరవాణి : 9440643348

From:
**JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1,
Lingampally, Kachiguda, Hyderabad-500027
email : jagritiweekly@gmail.com, web : jagritiweekly.com

Date of Publication Every Monday : 13.12.2021
Date of Posting Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023
RNI Regd. No. 3270/57
Volume : 74 Issue : 07

# MAHAVEER
## GROUP OF INSTITUTIONS
(AN ISO 9001-2008 CERTIFIED INSTITUTION)





Counseling Code : MHVR
### MAHAVEER
**INSTITUTE OF SCIENCE & TECHNOLOGY**
Estd : 2001
(Approved by AICTE, Affiliated to JNTUH, Hyderabad.)
Email: mist.admissions@gmail.com | website : mist.ac.in
Courses Offered :

| | | |
|---|---|---|
| B.Tech | ECE \| EEE \| CSE \| IT \| MECH. \| CIVIL \| AERO | PG |
| M.Tech | DE & CS \| VLSI \| PE & ES \| CSE \| SE \| AMS | MBA |

Counseling Code : MHVR
### MAHAVEER
**Institute of Science & Technology Polytechnic** (2nd Shift)
Estd : 2009
(Approved by AICTE, Affiliated to SBTET Hyderabad.)
Email: mist.admissions@gmail.com | website : mist.ac.in
Courses Offered :
Polytechnic: DECE | DEEE | DCME | DME | DCE

Counseling Code : AARM
### AAR MAHAVEER
**ENGINEERING COLLEGE**
Estd : 2010
(Approved by AICTE, Affiliated to JNTUH, Hyderabad.)
Email: aarm.admissions@gmail.com | website : aarm.ac.in
Courses Offered :
B.Tech: ECE | EEE | CSE | MECH.

### MAHAVEER DEGREE COLLEGE
**For Arts, Commerce & Science**
Estd : 2014
(Approved by Telangana Govt. - Affiliated to Osmania University)
Email: mdc.admissions@gmail.com | website : mahaveerdegreecollege.com
Courses Offered :
B.Com: Computers & General
B.Sc: MSCs

Sponsored by MAHAVEER EDUCATIONAL SOCIETY

**FOR NRI / MANAGEMENT SEATS**
Ph: 040-29880079, 29880086, 29880089, 29880081, 29880087
Cell : 9542001907, 9849944411
Vyasapuri, Bandlaguda, Post : Keshavgiri, Hyderabad - 500 005.